Estd 1938

# ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

సంపుటి: 64 • సంచిక: 267 • శనివారం 12 అక్టోబర్ 2019 • విజయవాడ * పేజీలు: 10+4 • వెల: 5.00

• Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Tirupati | Visakhapatnam | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad






చైనా టు చెన్నయ్.. పొరపొచ్చాల మంచుతెరల మధ్య నుంచి దూసుకొచ్చిన డ్రాగన్ దేశాధిపతి..అవే పొరపొచ్చాలను పటాపంచలు చేసి స్నేహవారథిని పటిష్టం చేయాలనుకున్న భారతదేశ ప్రధానమంత్రి..ఆ ఇద్దరూ కలిసిన శుభవేళ..నూట ఇరవై నిమిషాలు..ఏడు కరచాలనాలు..మహాబలిపురం శిల్పకళా చాతుర్యం నేపథ్యంలో మోడీ-జిన్‌పింగ్ స్నేహగీతం.. ప్రధాని మోడీ ముందుగానే చెన్నయ్ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్లో మహాబలిపురానికి చేరిక..చైనా అధినేత జిన్‌పింగ్ అదే చెన్నయ్ ఎయిర్‌పోర్టు నుంచి చైనా కారులో 57 కిమీ రోడ్డు మార్గంలో మహాబలిపురానికి రాక..భద్రతా కారణాల రీత్యా చైనా అధ్యక్షులు హెలికాప్టర్ ఎక్కరు. అందుకే ఆయన చైనా మేడ్ హాంగ్కి కారెక్కారు..కాసేపు కలిసి నడక.. మరికాసేపు కూచుని పిచ్చాపాటీ.. మళ్లీ నడుస్తూ మాటామంతీ. అది పేరుకి లాంఛనమే. కాని ఇద్దరు అగ్రనేతల మహా సమ్మేళనమది.. ప్రధాని మోడీ దౌత్య చాతుర్యం అడుగడుగునా ప్రదర్శించిన వైనం..తమిళ సాంప్రదాయక ఆహార్యం.. పంచెకట్టు.. భుజాన పైకండువాలో మోడీ మొదటిసారి దర్శనం.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కి శుక్రవారం సాయంత్రమంతా కనులపండుగే. వీనుల విందే. మహాబలిపురం షోర్ ఆలయమంతా మోడీ దగ్గరుండి జిన్‌పింగ్‌కు చూపించారు. అక్కడి కళావైభవరీతుల్ని జిన్‌పింగ్‌కి విడమర్చి చెప్పారు. ఆ ఇద్దరి నడకలో సరికొత్త స్నేహబంధపు అడుగుల సవ్వడి...తీరప్రాంతపు ఉక్కపోత నుంచి ఆటవిడుపుగా కొబ్బరిబొండా నీళ్లు తాగి సేద దీరారు..చాయ్ పే చర్చకు గతంలో తెరతీసిన ప్రధాన మోడీ తాజా దౌత్యయాత్రలో నారికేళ పానీయంతో చర్చకు నాంది పలికారు. చివరిగా సాంస్కృతిక శోభ.. జిన్‌పింగ్‌కు ప్రధాని మోడీ రెండు అమూల్యమైన బహుమానాలిచ్చారు. ఒకటి నచ్చియార్‌కోయిల్ దీపాల చిమ్మె.. రెండోది. నాట్యభంగిమలో ఉన్న సరస్వతి.. తంజావూర్ పెయింటింగు. తమిళ వంటకాల డిన్నర్‌తో మోడీ-జిన్‌పింగ్ తొలిరోజు స్నేహయాత్ర ముగిసినట్టయింది. మళ్లీ శనివారం.. ఇద్దరి ముఖాముఖి చర్చలు ఉంటాయి...

# స్నేహగీతిక

## మహాబలిపురం సాక్షిగా మిత్ర దౌత్యం!

- తమిళ సాంప్రదాయక దుస్తుల్లో మోడీ స్వాగతం
- చారిత్రక స్మారకాల సందర్శన
- తీర దేవాలయంలో ఇరువురు అగ్రనేతల మాటామంతీ
- తమిళ రుచులతో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ప్రధాని డిన్నర్
- చెన్నైలో ఘనస్వాగతం పలికిన తమిళనాడు ప్రభుత్వం
- ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధిపై నేడు మరోసారి నేతల భేటీ

**చెన్నై:** ప్రధాని మోడీతో రెండు రోజుల అనధికార భేటీ కోసం చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ భారత్ చేరుకున్నారు. చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయనకు ఘనస్వాగతం పలికాయి. మధ్యాహ్నం 2 గంటలకు కాస్త ముందుగానే చెన్నై చేరుకున్న జిన్‌పింగ్‌కు తమిళనాడు ప్రభుత్వం రెడ్‌కార్పెట్ స్వాగతం పలికింది. రాష్ట్ర గవర్నర్ బన్వారిలాల్ పురోహిత్, ముఖ్యమంత్రి పళని స్వామి, అసెంబ్లీ స్పీకర్ పీ దనపాల్ చైనా అధ్యక్షుడికి ఆహ్వానం చెప్పారు. మొత్తం 500 మంది జానపద కళాకారులు తమిళనాడు సాంప్రదాయక నృత్యాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఇరుదేశాలకు చెందిన జాతీయ జెండాలను ఊపుతూ చిన్నారులు జిన్‌పింగ్‌కు స్వాగతం పలికారు. నవ్వుతూ కళాకారుల వైపు చూస్తూ జిన్‌పింగ్ అభివాదం చేశారు. చెన్నై నుంచి మహాబలిపురం చేరుకునే రహదారి వెంట అనేకచోట్ల కళాకారులు ప్రదర్శనలతో స్వాగతాలు పలికారు. స్థానికులు పెద్ద ఎత్తున ప్లకార్డులు, ఇరు దేశాల జాతీయ జెండాలతో జిన్‌పింగ్‌కు అభివాదాలు చేశారు. అధ్యక్షుడు జిన్‌పింగ్ వెంట చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ, ➪ 3వ పేజీలో...



## ఉక్రోషంతో మరో తప్పు

- హాంకాంగ్, కాశ్మీర్‌లపై వరుస ట్వీట్లు
- జిన్‌పింగ్‌ను ఇబ్బందుల్లోకి నెట్టిన పాక్ ప్రధాని ఇమ్రాన్



3 లో



# పిడివాదన!

- ప్రభుత్వంపై టీఎస్సార్టీసీ కార్మికుల ఒత్తిడి సరికాదు
- విసుగెత్తిస్తున్న కామ్రేడ్ల డిమాండ్లు
- జాతీయ స్థాయిలో చర్చ జరగాలి
- సూత్రప్రాయ విధానాలను కేంద్రం సూచించాలి
- వామపక్షాలు ఇందుకు కృషి చేయాలి
- సామాజిక నిపుణుల సూచనలు

**(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)**

తెలంగాణా ఆర్‌టిసి సమ్మె సాగదీత రెండు తెలుగురాష్ట్రాలపైన తీవ్రంగా ఉంది. ముఖ్యంగా దసరా సెలవుల అనంతరం స్వస్థలాలకు తిరిగెళ్ళడం పలువురికి ఇబ్బందికరంగా మారింది. దీంతో గతంలో ఎప్పుడూ ఆర్‌టిసి అంతర్గత విషయాలపై దృష్టిసారించని వారు కూడా ఇప్పుడు సమ్మెకు దారితీసిన పరిస్థితులు, అనంతర పరిణామాలపై చర్చిస్తున్నారు. ఆర్‌టిసి కార్మికులు తమ డిమాండ్ల కోసం ఈ సమ్మె చేపట్టారు. దీనికి వామపక్షాల అనుబంధ కార్మిక సంఘాలు మద్దతిస్తున్నాయి. సమ్మె ప్రధాన లక్ష్యం కార్మికుల డిమాండ్ల పరిష్కారం కాగా ఇప్పుడు వామపక్షాలు ఈ లక్ష్యాన్ని మరింత విస్తృతపర్చడం సాధారణ ఆలోచనా పరులకు్కూడా విసుగెత్తిస్తోంది. సహజంగా కార్మికులు తమకు మెరుగైన పనివసతులు కల్పించాలని డిమాండ్ చేస్తారు. జీతభత్యాలు పెంచాలని కోరతారు. లేదా జీతాల్ని సకాలంలో ఇవ్వాలని ఆశిస్తారు. సంస్థల్లో వారసత్వ విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరిన సందర్భాలు కూడా ఉంటాయి. అనంతరం తమ పిల్లలకు అదే సంస్థలో ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేసి సాధించుకున్న సందర్భాలు అనేకమున్నాయి. కానీ ఆర్‌టిసి కార్మికులు అంతకుమించి ప్రభుత్వ విధానాల్ని ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆర్‌టిసి లాభనష్టాల్తో పాటు నిర్వహణలో కూడా ప్రభుత్వానికి ఆదేశాలిచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆర్‌టిసికి రవాణాపన్ను మినహాయించాలని, సబ్సిడీలు, రాయితీల భారాన్ని ప్రభుత్వమే భరాయించాలని, ఆర్‌టిసి నష్టాలన్నింటిని ప్రభుత్వ ఖజానా నుంచి భర్తీ చేయాలంటూ డిమాండ్‌లు మొదలెట్టాయి. తెలుగు రాష్ట్రాల్లోని పలు కార్పొరేషన్‌లకు చెందిన ఉద్యోగులకు ప్రభుత్వాలు నేరుగా జీతాలిస్తున్నాయి. జెఎన్‌కో, ➪ 3వ పేజీలో...



## ఇథియోఫియా ప్రధానికి నోబెల్ శాంతి!

సరిహద్దు దేశం ఎరిత్రియాతో ఉద్రిక్తతల నివారణకు కృషి

3 లో



## విరాట్ కోహ్లి

డాన్ బ్రాడ్‌మన్ రికార్డు బ్రేక్

డబుల్ సెంచరీతో మరోసారి విరాట్ స్వరూపం

(వివరాలు క్రీడాప్రభలో)



## విలీనం ఎలా?

ఆర్టీసీ విలీన ప్రక్రియపై మరో ముందడుగు

విధివిధానాల రూపకల్పనకు కమిటీ నియామకం

చైర్మన్‌గా రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి

నవంబర్ 30లోగా నివేదికకు ఆదేశం

3 లో








# నోట్ల కట్టల రారాజు

• సంజామల తహసీల్దార్ లాకర్‌ల గుట్టు తెరిచిన ఏసీబీ • 42,82,000 నగదు, కోటి 9 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, 428 గ్రాముల బంగారం, 5 ఇళ్లపట్టాల డాక్యుమెంట్లు లభ్యం

**కర్నూలు, ప్రభ న్యూస్:** జిల్లాలోని సంజామల మండలం తహసీల్దార్ గోవింద్‌సింగ్ గురువారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన సంగతి తెలిసిందే. అయితే శుక్రవారం తహసీల్దార్ గోవింద్‌సింగ్, ఆయన భార్య పేరుపై ఉన్న లాకర్లను తెరిచిన ఏసీబీ అధికారులు అవాక్కయ్యారు. లక్షల్లో నగదు, బంగారు, ఇళ్ల పట్టాలతో పాటు కోటికిపైగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు బ్యాంకు లాకర్లలో బయటపడ్డాయి. ఏసీబీ డీఎస్పీ ఎం నాగభూషణం తెలిపిన వివరాల ప్రకారం తహసీల్దార్ గోవింద్‌సింగ్‌కు కృష్ణానగర్‌లోని ఎస్‌బీఐ బ్రాంచీలో ఒక లాకర్ ఉండగా, ఆయన భార్య పేరుపై కృష్ణానగర్‌లోని ఆంధ్రబ్యాంకులో మరో లాకర్ ఉంది. గోవింద్‌సింగ్ పేరిట ఉన్న కృష్ణానగర్ ఎస్‌బీఐ బ్రాంచిలో ఏసీబీ అధికారులు లాకర్లను తెరవగా, రూ.16,32,000 నగదు, కోటి9 లక్షల, 2వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లు, దాదాపు రూ.15 లక్షల విలువ కలిగిన 428 గ్రాముల బంగారు నగలతో పాటు, ఐదు ఇంటిస్థలాల డాక్యుమెంట్లు లభ్యమయ్యాయి. తహసీల్దార్ భార్య పేరుపైన కృష్ణానగర్ ఆంధ్రబ్యాంకులో ఉన్న లాకర్‌ను ఓపెన్ చేయగా రూ.26.50లక్షలు నగదు లభ్యమైంది. ఈ నగదు, బంగారు, డాక్యుమెంట్లను సీజ్ చేశామని, విచారణ జరుగుతుందని ఏసీబీ డీఎస్పీ నాగభూషణం తెలిపారు.

# చిన్న పరిశ్రమలకు పెద్దపీట

• రాష్ట్రంలో రూ.16.39 లక్షల కోట్లతో 2.241 ప్రాజెక్టులకు ఒప్పందాలు • వివిధ దశల్లో పనులు • నూతన పాలసీతో మరిన్ని పెట్టుబడులు రాబట్టాలని యోచన



**అమరావతి, ఆంధ్రప్రభ:** పారిశ్రామికాభివృద్ధితో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగానే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పెద్దపీట వేయాలని ఆలోచన చేస్తోంది. దీనికి అనుగుణంగానే 31 ఎమ్ఎస్ఎంఈ క్లస్టర్లను ఏర్పాటు చేసి, 300 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటుచేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అదేవిధంగా 13జిల్లాలను ఇండస్ట్రియల్ జోన్లుగా మార్చే లక్ష్యంతో ముందుకెళుతోంది. ప్రభుత్వం ఏర్పడిన కొద్దిరోజుల్లోనే ఏపీఐఐసీకి 800 దరఖాస్తులు వచ్చాయని, కృష్ణపట్నం పోర్టులో రూ.5500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు అదానీ కంపెనీ ముందుకొచ్చిందని అధికారపార్టీ సభ్యులు పేర్కొంటున్నారు. డిసెంబర్‌లోపు పారిశ్రామిక, ఐటీ విధానాలను రూపొందించి కొత్త సంవత్సరం నుండి వాటిని అమల్లోకి తీసుకొచ్చి పెట్టుబడుల వరద పారించాలని చూస్తోంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 2,241 ప్రాజెక్టులను 16.39 లక్షల కోట్ల వ్యయంతో పూర్తిచేసి దాదాపు 32.88 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే విధంగా కంపెనీలతో ఒప్పందాలు జరిగినట్లు అధికారిక సమాచారం. 2016లో 247 ప్రాజెక్టులను 3.03లక్షల కోట్ల వ్యయంతో పూర్తిచేసి 6లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు ఒప్పందాలు జరిగాయి.

అదేవిధంగా 2017లో 452 ప్రాజెక్టులను 7.19లక్షల కోట్ల వ్యయంతో పూర్తిచేసి 12.41లక్షల మందికి, 2018లో 485 ప్రాజెక్టులను 2.21లక్షల కోట్లతో పూర్తిచేసి 4.31లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేవిధంగా కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. శాఖల పరంగా చూస్తే పరిశ్రమలు శాఖలో 487 ప్రాజెక్టులు, మౌలికవసతులు పెట్టుబడుల విభాగంలో 35, సులభతర వాణిజ్యంలో 256, ఏపీటిడ్కో తరపున 22, ఏపీసీఆర్డీఏలో 93, పశుసంవర్ధకశాఖలో 5, రాష్ట్ర విద్యుత్ కన్జర్వేషన్ మిషన్లో 6, నెడ్‌క్యాప్లో 170, ఫుడ్ ప్రాసెస్సింగ్లో 436, ఉన్నత విద్యలో 11, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో 400, భూగర్భ, గనులు విభాగంలో 44, రోడ్లు భవనాలశాఖలో ఒకటి, స్కిల్ డెవలప్‌మెంట్‌లో 19, చేనేత వస్త్రాలు 51, పర్యాటకంలో 200, గృహనిర్మాణంలో 4, పురపాలశాఖలో ఒకటి ఉన్నాయి. అత్యధికంగా పరిశ్రమలు శాఖలో 4.76లక్షలు, నెడ్‌క్యాప్‌లో రూ.4.10లక్షల కోట్లు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రూ.2.68లక్షల కోట్లు, ఏపీసీఆర్డీఏలో రూ.1.22లక్షల కోట్లు పెట్టడానికి ఒప్పందాలు జరగ్గా వీటిల్లోనే ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పించేవిధంగా ఒప్పందాలు జరిగాయి. ఈ ప్రాజెక్టులన్నీ వేర్వేరు దశల్లో ఉండగా నూతన పారిశ్రామిక విధానంతో మరింత పెట్టుబడులు రాబట్టాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అందుకు అనుగుణంగానే పారిశ్రామిక వర్గాలకు రాయితీలు కల్పించేవిధంగా నూతన పారిశ్రామిక విధానం తీసుకురానుంది.

రాష్ట్రంలో సామాజిక విధానం, ఆర్థిక విధానం, పారిశ్రామిక విధానం వంటి ప్రాథమిక సూత్రాలతో రాష్ట్రాన్ని ఊహించని స్థాయిలో నిలబెట్టే దిశగా అడుగు ముందుకు వేయనున్నట్లు మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి స్పష్టంచేశారు. దేశ జీడీపీలో మొదటి 5 రాష్ట్రాలు 43 శాతం ఆదాయంతో ముఖ్య భూమిక పోషిస్తున్నాయని, జీడీపీలో ప్రస్తుతం 180 బిలియన్ డాలర్లతో ఏపీ 9 స్థానంలో ఉందని, ఆ ర్యాంకును మెరుగుపర్చేందుకు తగిన వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో పోర్టులు, విమాశ్రయాలు, మెట్రోరైళ్లు, ఎలక్ట్రిక్ బస్సులు తదితర బీఓటీ ప్రాజెక్టులపై దృష్టిపెట్టి పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. వీటికి గ్లోబల్ టెండర్లు పిలిచి తక్కువ ఖర్చుతో వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకరావానుకుంటోంది. గత ప్రభుత్వం లాగా పెట్టుబడులు పెట్టండి.. రాయితీలు ఇస్తాం అని మోసపూరిత మాటలు చెప్పకుండా ఆచరణయోగ్యమైన హామీలే పారిశ్రామిక వర్గాలకు ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల పరిశ్రమల శాఖ సమీక్షలో ఉన్నతాధికారులకు సూచించారు. రాష్ట్రాభివృద్ధికి దోహదం చేసే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులను కోరారు. అదేవిధంగా పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాలు ఇచ్చే విధంగా పరిశ్రమలకు అవసరమైన మానవ వనరుల అభివృద్ధిని తీర్చిదిద్దాలని యోచిస్తోంది. రాష్ట్రంలోని ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే.

# అభిషేక సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు



**తిరుమల, ప్రభన్యూస్:** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్‌వి.రమణ దంపతులు, ఏఎన్.బోపన్న దంపతులు శుక్రవారం వేకువజామున స్వామివారికి నిర్వహించే అభిషేకసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయంలోకి చేరుకున్న వీరికి అదనపు ఈఓ ఏవీ ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీఈఓ హరీంద్రనాథ్‌లు దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో న్యాయమూర్తులకు అదనపు ఈఓ శ్రీవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందచేశారు.

# ఎన్నికల్లో ధన ప్రవాహంపై సీఈసీ ఆందోళన

**న్యూఢిల్లీ:** ఎన్నికల్లో ధన ప్రవాహం రోజు రోజుకూ పెరిగిపోతోందని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎస్.వై ఖురేషి ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో నేరాలు,ధన ప్రవాహం పెరగడం పోటీ తత్వాన్ని పెంపొందిస్తోందని అన్నారు. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ (న్యూ) ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఖురేషి మాట్లాడుతూ.. ఏ వ్యక్తి అయినా దోషిగా తేలే వరకు అమాయకుడిగానే కనిపిస్తాడు. కానీ మన దేశంలోని జైళ్లలో నాలుగు లక్షలకుపైగా నేరస్తులున్నారు, వారిలో 70 శాతం మంది విచారణ ఎదుర్కొంటూ నిర్బంధంలో ఉన్నవారే. అంటే ఆ 70 శాతం మంది దోషులు కారు. వారిలో అమాయకులు కూడా ఉంటారు. అయినప్పటికీ వారి స్వేచ్ఛను హరిస్తూ..హక్కులను కాలరాస్తున్నారు...మరి అలాంటి వారు ఎన్నికల్లో పోటీ చేయొద్దని ఎలా ఆదేశిస్తాం. నేరం రుజువు కాకుండా దోషిగా చిత్రీకరించడం సరికాదు. నేరారోపణలు ఎదుర్కొంటున్న వారిని ఎన్నికల్లో పోటీ చేయకుండా బహిష్కరించాలన్న డిమాండ్ నేపథ్యంలో ఖురేషి పై విధంగా బదులిచ్చారు.

# స.హ.చట్టం సామాన్యుడి ఆయుధం

• అవినీతికి చరమగీతం పాడడం, పారదర్శకతకు ప్రాధాన్యమివ్వడం సమాచార హక్కు చట్టం కమిషనర్ల విధి

• సత్వర న్యాయం కలగించే లక్ష్యంతోనే విధులు • ఆంధ్రప్రభతో సమాచార హక్కు చట్టం కమిషనర్ ఐలాపురం రాజా



**విజయవాడ సిటీ, ప్రభన్యూస్:** సమచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం, ఈ చట్టం భాధ్యతతో ప్రభుత్వ ఉద్యోగులు పనిచేసేలా చేస్తుంది. అవినీతికి అడ్డుకట్ట వేస్తుంది. పారదర్శకతకు ప్రాధన్యమిస్తుంది. సమాచార హక్కుచట్టం కమిషనర్లు సత్వరమే ఫైళ్ళను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. భాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు తమ వంతు కృషి చేస్తున్నారని విజయవాడకు చెందిన సమాచార హక్కుచట్టం కమిషనర్ ఐలాపురం రాజా అన్నారు. మరోవైపు ప్రజలలో చైతన్యం బాగా పెరిగిందని దీంతో వేల కొలది కొత్త దరఖాస్తులు వస్తున్నాయి. సమాచార హక్కుచట్టం అమలులోకి వచ్చి అక్టోబర్ 12 నాటికి 14 సంవత్సరాలైన సందర్భంగా ఆయన ఆంధ్రప్రభకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంకా చాలా మందికి సమాచార హక్కు చట్టం చేసే మేలుపై అవగాహన లేదని ఈ ఏడాది మే నెలలో సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజా తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్ చదివిన రాజా, విదేశాలలో ఎంబీఏ చేశారు. ఆంధ్రప్రదేశ్ హోటల్ యజమానుల సంఘం అధ్యక్షుడుగా ఉన్నారు. ఇంకా ఆయన బీసీలకు సంబంధించి అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు.

**ఆంధ్రప్రభ:** సమాచార హక్కు కమిషనర్ల వద్ద ఫైళ్ళు పెండింగులో ఉండడం వల్ల సత్వర న్యాయం జరగడం లేదంటున్న వ్యాఖ్యలపై మీ స్పందన?

**రాజా:** సమాచార హక్కుచట్టం కమిషనర్ల వద్ద ఫైళ్ళు పెండింగులో ఉండడానికి అనేక కారణాలు ఉన్నాయి. కావాలని మా వద్ద ఏదీ పెండింగులో ఉంచడం జరగదు. బాధితులకు సత్వరమే న్యాయం కలగచేయడమే మా ధర్మం. అయితే ప్రభుత్వం యంత్రాంగంలోని ఆయా శాఖల వారు తమ వద్ద ఉన్న రికార్డులను సత్వరమే అందించగలగాలి. వాయిదాలు ఎక్కువ పడకుండా సహకరించాలి. వాస్తవానికి గత ఆగస్టు నెలాఖరు వరకు ఉన్న స్టేటస్‌ను గనుక పరిశీలించినట్లయితే, చాలా వరకు ఫైళ్ళు పరిష్కారమవుతున్నాయి. సెకండ్ అప్పీళ్ళకు సంబంధించి కమిషనర్-1 వద్ద పాత, కొత్త కలసి 1050 కాగా 825. కమిషనర్ -2 వద్ద 1346 కాగా 1099, కమిషనర్-3 వద్ద 1445 కాగా 442, కమిషనర్-4 వద్ద 746 కాగా 427 అప్పీళ్ళు పెండింగులో ఉన్నాయి. ఫిర్యాదుల విషయానికొస్తే అందరి వద్ద కలిపి 1805 ఉంటే 1164 పెండింగులో ఉన్నాయి. నెలకు సగటున 400 కొత్త కేసులు వస్తున్నాయి. కొత్త.పాత కేసులను కూడా పరిష్కరించడానికి కృషి జరుగుతున్నది.

**ఆంధ్రప్రభ:** కొత్త కేసులు కూడా పెరుగుతుండడానికి కారణమేమిటి?

**రాజా:** ఆయా ప్రభుత్వ శాఖలు సక్రమంగా తమ విధులను తాము నిర్వహిస్తే ఎటువంటి ఇబ్బంది ఉండడం., ఇవ్వగలిగిన సమాచారం కూడా ఇవ్వకపోవడం, వాయిదాలు వేసుకుంటూ పోవడం వల్ల బాధితులు తమకు న్యాయం కలగ చేయాలని కోరుతూ సమాచార హక్కు చట్టం కమిషనర్లకు దరఖాస్తు చేసుకుంటున్నారు.దీంతో నెల నెల వేల కేసులు కొత్తవి వస్తున్నాయి. అయినప్పటికి ఫైళ్ళను వేగంగా పరిష్కరించేందుకు తగిన కృషి చేస్తున్నాం

**ఆంధ్రప్రభ:** ఈ ఐదు నెలల కాలంలో మీ అనుభవాలు ఏమిటి?

**రాజా:** సమాచార హక్కు చట్టం కమిషనర్లకు సిబ్బంది కొరత ఉంది. దీంతో పాటు మౌలిక సదుపాయాలు కూడా కల్పించాల్సి ఉంది. దీనిపై ఇటీవలనే రాష్ట్రప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని కలిసి వివరించాం. మా పని చేసేందుకు మాకు కొన్ని వనరులు కావాలి. వాటిని సమకూర్చాలని కోరాం. వాటికి ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చింది.

**ఆంధ్రప్రభ:** ప్రభుత్వ శాఖల సహకారం ఎలా ఉంది.. సయన్వయ లోపం కనిపించిందా?

**రాజా:** నేను సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా భాధ్యతలు స్వీకరించాక, నాకు అప్పగించిన ప్రభుత్వ శాఖలపై దృష్టి పెట్టాను, ముఖ్యంగా కమిటీల నిర్మాణం కాలేదు. కొత్త ప్రభుత్వం వచ్చాక నవరత్నాల పథకాలను ప్రవేశ పెట్టారు. వీటి అమలులో కలెక్టర్లు,యంత్రాంగం కూడా బీజీగా ఉంది. ఒక విధంగా చెప్పాలంటే అటు ప్రభుత్వ శాఖలకు, అధికారులకు, మాకూ కూడా పనిభారం పెరిగింది. వివిధ శాఖల మధ్య సమన్వయం విషయంలో కొంత లోపం కనిపిస్తోంది. మెల్లగా సమన్వయం కోసం ప్రయత్నిస్తున్నాం. కమిటీలు ఏర్పాటయితే, చాలా వరకు మేలు జరుగుతుంది.

**ఆంధ్రప్రభ:** సమాచార హక్కు చట్టంపై ఇంకా చాలా మంది ప్రజలకు అవగాహన లేదు, దీనిపై మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

**రాజా:** అక్టోబర్ 12 సమాచార హక్కుచట్టం అమలులోకి వచ్చిన రోజు. సమాచారహక్కుచట్టంపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు 12 వతేదీతో ముగిసేలా వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. సంబంధిత శాఖల అధికారులకు ఇప్పటికే మార్గదర్శకాలను పంపించాం. సత్వరమే కేసులను పరిష్కరించాలని, సమాచార హక్కు చట్టంపై ప్రజలలో అవగాహనకల్పించాలని, అవినీతి రహితంగా, పారదర్శకంగా అధికారులు విధులు నిర్వహిస్తే ప్రజల మన్ననలను పొందుతారని సూచించాం.

**ఆంధ్రప్రభ:** జిల్లాలలో ఇంకా పర్యటిస్తున్నట్లు లేదు కదా?

**రాజా:** వాస్తవంగా జిల్లాలలో పర్యటనలు జరగడం లేదు. రెండు మూడు సంవత్సరాలుగా ఫైళ్ళు బాగా పేరుకుపోయాయి. వాటిని గురించి తెలుసుకుంటున్నాం. అవి ఏ స్థాయిలో ఉన్నాయో పరిశీలిస్తున్నాం. ఈ విభాగం చాలాస్తబ్దుగా నడిచింది. ముఖ్యంగా మాకార్యాలయాలు కూడా సరిగా లేవు. వనరులు లేవు, వాటిని చూసుకోవాలి. 2020 జనవరి నుంచి జిల్లాల పర్యటనలు ప్రారంభించాలని అనుకుంటున్నాం. జిల్లాల పర్యటనలతో మంచి ఫలితాలు వస్తాయని భావిస్తున్నాం. తనిఖీలు కూడా అవసరమైతే నిర్వహిస్తాం. సమీక్షా సమావేశాలు పెడతాం. సమాచారహక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తూనే, అమలు చేసే విషయంలో అధికారులకు కూడా సూచనలిస్తాం.

## ఔరా..!




## ముహూర్తం

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, శుక్లపక్షం తిథి: చతుర్దశి ఆదివారం ఉ.0.36 వరకు, నక్షత్రం: ఉత్తరాభాద్ర రాత్రిమొత్తం, రాహుకాలం: ఉ.9:07 నుండి ఉ.10:34 వరకు; దుర్ముహూర్తం: ఉ.6.11 నుండి ఉ.6.58 వరకు, ఉ.6:58 నుండి ఉ.7:45 వరకు; వర్జ్యం: మ.3.51 నుండి సా.5:38 వరకు; యమగండం: మ.1:30 నుండి మ.2:57 వరకు; అమృతకాలం: ఆదివారం ఉ.2:33 నుండి ఉ.4:19 వరకు;

# మూడు బీర్లకే అనుమతి!

• నేటి నుంచి అమలు
• ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో బీర్ల వ్యక్తిగత నిల్వలపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. గతంలో జారీ చేసిన నిబంధనలను సవ రిస్తూ వ్యక్తిగతంగా మూడు బీర్లు మాత్రమే నిల్వ చేసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృ త్వంలోని ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని రూపొందించి అమలు చేస్తోం ది. దశలవారీ మద్య నిషేధంలో భాగంగా 20 శాతం షాపులను తగ్గించి 3500 షాపుల నిర్వహణ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే చేపట్టింది. అక్టోబర్ 1వ తేదీ నుంచి ఏపీబీసీఎల్ ఆధ్వర్యంలో మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నా రు. గతంలో మద్యం అమ్మకపు వేళలను కుదిస్తూ ఉదయం 11గంటల నుంచి రాత్రి 8 గంటల వరకే అమ్మకాలు జరపాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ క్రమంలోనే వ్యక్తిగత మద్యం నిల్వలపై కూడా పలు ఆంక్షలు విధించింది. రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ అమలోకి వచ్చిన తర్వాత మద్యం బాటిళ్లు, బీర్ల వ్యక్తిగత నిల్వలపై ప్రభుత్వం పలు ఆంక్షలు విధిస్తోంది. గతంలో ఏ విధమైన లైసెన్స్‌లు, ముందస్తు అనుమతులు లేకుండా 12 బీర్లు, ఆరు మద్యం బాటిళ్లు వ్యక్తిగతంగా నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉండేది. దీనిని సవరిస్తూ గత నెల 24వ తేదీన ప్రభుత్వం జీవో 411ను జారీ చేసింది. ఆ జీవో ప్రకారం పరిమాణంతో నిమిత్తం లేకుండా మద్యం మూడు బాటిళ్లు, ఆరు బీర్లు నిల్వ చేసుకునే వెసులుబాటు కలిపించారు. ఆ ఉత్తర్వులను మరోసారి సవరిస్తూ మూడు బీర్లు మాత్రమే వ్యక్తిగత నిల్వలు ఉంచుకునే విధంగా జీవో 426ను ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి డాక్టర్ డి.సాంబశివరావు ఉత్తర్వులు జారీ చేశారు. సవరించిన ఉత్తర్వులు శనివారం నుంచి అమలులోకి రానున్నట్లు ఆయన స్పష్టం పేర్కొన్నారు.

# ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింపచేస్తా

జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్

**అమరావతి, ఆంధ్రప్రభ:** ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింప చేసే విధంగా పనిచేస్తానని జాతీయ మీడియా, అంత రాష్ట్రవ్యవహారా ల సలహాదారు దేవులపల్లి అమర్ చెప్పారు. ప్రభుత్వ పథకాలు, కార్య క్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేయను న్నట్లు ఆయన పేర్కొన్నారు. జాతీయ మీడియా, అంతర్రాష్ట్రవ్యవహారాల సలహాదారుగా నియమి తులైన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పలువురు యూనియన్ నేతలు, పాత్రికేయులు అమర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అమర్ మాట్లా డుతూ ప్రతి ప్రభుత్వానికి మీడియా సలహాదారులు అవసర మన్నారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ నుంచి నేటి వరకు కేంద్ర ప్రభుత్వంలో మీడియా సలహాదారులను నియమించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. సలహాదారులను బ్యూరోక్రాట్స్ నుంచి కాకుండా జర్నలిజం నుంచి వచ్చిన నిష్టాతులైన పక్షంలో ప్రభుత్వానికి ప్రయోజనం ఉంటుంద న్నారు. 1976లో పత్రికా రంగంలో అడుగుపెట్టిన నాటి నుంచి ఏపీయూ డబ్ల్యూజే సభ్యునిగా పాత్రికేయుల సమ స్యల పరిష్కారానికి తనవంతు కృషి చేసినట్లు పేర్కొన్నారు.

పాత్రికేయులకు కుల, మత, ప్రాంతీయ విబేధాలు ఉండవని పేర్కొంటూ శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన సీనియర్ పాత్రికేయులు మణికొండ చలపతిరావు విగ్రహం హైదరాబాద్ జర్నలిస్టు కాలనీలో ఏర్పాటు చేయడమే నిదర్శనమన్నారు. ఏపీ గురించి తానేనాడు వ్యతిరేకంగా మాట్లాడలేదని ఆయన తెలిపారు. ఐజేయు సీనియర్ నాయకులు, ప్రెస్ అకాడమీ పూర్వపు ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉద్యమ సహచరుడు అమర్‌కు ప్రభుత్వం పదవి ఇవ్వడం



సముచితమన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి అమర్‌నిరంతరం శ్రమిస్తుంటాడని చెపుతూ పత్రికా స్వేచ్ఛను హరించే పరిస్థితుల్లో అమర్ యూనియన్‌తో కలిసి ఉంటాడన్నారు. ఐజేయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టుగా, యూనియన్ నేతగా అమర్ చేసిన కృషిని ప్రశంసించారు. జర్నలిస్టుల హక్కుల విషయంలో గతంలో మాదిరిగానే ఏపీయూడబ్ల్యూజే ముందుండి పోరాడుతుందని పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐజేయు నేతలు కె.అమర్‌నాథ్, ఆలపాటి సురేష్‌కుమార్, డి.సోమసుందర్, రాష్ట్రప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, పూర్వపు అధ్యక్షుడు జి.ఉపేంద్రబాబు, వెంకట్రావు, 10టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ కె.జయరాజ్, హిందూ రెసిడెంట్ ఎడిటర్ రెడ్డెం అప్పాజీ, విశాలాంధ్ర సంపాదకులు ముత్యాల ప్రసాద్, ప్రజాశక్తి ఉప సంపాదకులు గెడ్డన్న, ట్వంటీఫోర్ ఇంటూ సెవెన్ ఛానల్ సీఈవో వెంకటకృష్ణ, షేక్ బాబు, నిమ్మరాజు చలపతిరావు తదితరులు అమర్‌వ్యక్తిత్వం, వృత్తి నిర్వహణ, నిబద్ధత వంటి అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన పాత్రికేయులు అమర్‌ను ఘనంగా సత్కరించారు.

# ఈఎస్ఐ ప్యానల్ ఆస్పత్రుల్లో సోదాలు

• ఫార్మా ప్లాంట్లలో సోదాలకు కసరత్తు
• రాష్ట్రమంతటా విజిలెన్స్ తనిఖీలు



**అమరావతి, ఆంధ్రప్రభ:** ఈఎస్ఐ కుంభకోణం రెండు తెలుగు రాష్ట్రాలను కుదిపేస్తోంది. తెలంగాణాలో అక్కడి ఏసీబీ ఈఎస్ఐ కుంభకోణంపై దర్యాప్తు సాగిస్తుండగా ఏపీలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తాజాగా రంగంలోకి దిగారు. తెలంగాణాలో శుక్రవారం నాడు అరెస్టయిన ముగ్గురితో పాటు అక్కడ అరెస్టయిన వారి సంఖ్య మొత్తం 16కు చేరింది. వీరిలో ఈఎస్ఐ డైరెక్టర్ దేవికారాణితో పాటు తేజ ఫార్మా ఎండీ రాజేశ్వరరెడ్డి, వెంకటేశ్వర హెల్త్ కేర్ ఎండీ అరవింద రెడ్డి కూడా ఉన్నారు. వీరిలో కొందరిని ఏసీబీ అధికారులు తమ కస్టడీలోకి తీసుకుని మరిన్ని వివరాలను రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఏపీలో విజిలెన్స్ నిర్వహిస్తున్న దర్యాప్తులో కీలక విషయాలను రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. విజయవాడ ప్రసాదంపాడులోని ఈఎస్ఐ డైరెక్టరేట్‌లో ఇప్పటికే ఒక దఫా సోదాలు నిర్వహించిన విజిలెన్స్ అధికారులు కొన్ని కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈఎస్ఐ ప్యానల్ ఆస్పత్రుల జాబితా సేకరించిన అధికారులు ఆ ప్రకారం కొన్ని ఆస్పత్రుల్లో సోదాలు నిర్వహించి కొన్ని డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈఎస్ఐకు మందులు సరఫరా చేసిన ఫార్మా సంస్థల గురించి ఆరా తీశారు. మందుల కొనుగోళ్లలో నిబంధనలు పాటించారా.. ఫార్మా కంపెనీల టెండర్లు, డిస్పెన్సరీల ఇండెంట్లు, పర్చేజ్ ఆర్డర్లకు సంబంధించిన వివరాలపై విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు పట్టణాల్లో ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీల నుంచి కొన్ని మందుల శాంపిల్స్‌ను అధికారులు సేకరించారు. అందుకు సంబంధించిన ఇండెంట్ల రికార్డులను కూడా అధికారులు పరిశీలిం చారు. విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రుల్లో ఉన్న సీవరేజ్ ప్లాంట్ల నిర్వహణ గురించి కూడా అధికారులు ఆరా తీశారు. ప్లాంట్ల నిర్వహణలో లోపాలను గుర్తించారు. ప్రస్తుతం విజిలెన్స్ అధికారుల చేతుల్లో ఉన్న రికార్డుల ప్రకారం వచ్చే వారంలో ఫార్మా కంపెనీల్లో సోదాలు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది.

# పిడివాదన!



(మొదటి పేజీ తరువాయి)

ట్రాన్స్‌కో లు కూడా ప్రభుత్వరంగ కార్పొరేషన్‌లే. కానీ వీటి సిబ్బందికి ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు చెల్లిస్తునారు. గతంలో దేవాదాయ శాఖ ఉద్యోగు లందరికీ ఆ శాఖలో వసూలైన నిధుల్నుంచే జీతాలు జమయ్యేవి. కానీ ఇప్పుడు వారందరి జీతాలకు ట్రెజరీ బాధ్యత వహిస్తోంది. పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల్లో స్థానికంగా వచ్చిన రాబడిక నుగుణంగానే సిబ్బందికి జీతాల చెల్లింపుండేది. వీటన్నింటిని ప్రభుత్వమే నేరుగా చెల్లిస్తోంది. ఇదే తరహాలో ఆర్‌టిసి కార్మికులు ప్రభుత్వరంగ సంస్థలో పని చేస్తున్నప్పటికీ వారి జీతభత్యాలన్నింటిని నేరుగా ప్రభుత్వ ఖజానా నుంచి జమ చేయాలని డిమాండ్ చేయెచ్చు. దీనికి ప్రజల్నుంచి కూడా సానుకూలత లభిస్తుంది. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం పాలనాపర నిర్ణయానికనుగుణంగా చేపట్టాల్సిన చర్య. దీనిపై కార్మికుల ఒత్తిళ్ళు సరికావు. సంస్థ లాభనష్టాలకు, భవిష్యత్‌కు ప్రభుత్వమే బాధ్యత వహిస్తోంది. ఇది కార్మికులు, వారి సంఘాల పరిధి లోకి రాదు. సంఘాలన్నీ కార్మికుల శ్రేయస్సు, సంక్షే మానికి మాత్రమే పరిమితం. వాటిని సాధించుకునే దిశగానే పోరాటాలుండాలి.

అంతకుమించి ప్రభుత్వ విధివిధానాల్ని శాసించే ప్రయత్నాలు ఫలించే అవకాశాలుండవని పరిశీలకు లు విశ్లేషిస్తున్నారు. ఇక ప్రైవేటీకరణ అంశం జాతీ యస్థాయిలో చర్చించి నిర్ణయించాల్సింది. ఇప్పటికే పలు రైలు సర్వీసుల్ని, రైల్వేస్టేషన్లను ప్రైవేటు సంస్థల నిర్వహణకు భారతీయ రైల్వే ఇచ్చేసింది. దీనిపై పార్లమెంట్‌లో విస్తృతమైన చర్చ సాగుతోంది. తలోపార్టీ తమకనుకూల విధానంలో అభిప్రాయా ల్ని వెల్లడిస్తున్నాయి. అలాగే రోడ్డు రవాణా సంస్థల జాతీయకరణ లేదా ప్రైవేటీకరణ ఏదైనా సరే జాతీ యస్థాయిలో అన్ని రాష్ట్రాల్లో ఒకే విధానం అమలు కావాల్సిన అవసరముంది. పార్లమెంట్ ఉభయసభ ల్లో చర్చించి సూత్రప్రాయనిర్ణయాన్ని రాష్ట్రాలకు సూచించాలి.ఈ దిశగా వామపక్షాలు జాతీయస్థాయి లో ప్రయత్నాలు చేయడం సమంజసంగా ఉంటుందని వీరు పేర్కొంటున్నారు.

# ఉక్రోషంతో మరో తప్పు



**(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి):** చైనా అధ్యక్షుడు భారత పర్యటన పట్ల ఉక్రోషంతో పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ చేసిన వ్యాఖ్యలు షి జిన్‌పింగ్‌ను ఇబ్బందుల్లోకి నెట్టాయి. శుక్రవారం మరికొద్ది సే పట్లో జిన్‌పింగ్ చెన్నై విమానాశ్రయానికి చేరుకుంటారనగా ఇమ్రాన్‌ఖాన్ తన ట్విట్టర్ ఖాతాకు పదునెట్టారు. కాశ్మీర్ అంశాన్ని పదే పదే తట్టిలేపారు. కాశ్మీర్‌లో అణిచివేత పట్ల ప్రపంచ మీడి యా సంక్రమంగా స్పందించడంలేదంటూ ఆందోళన వ్యక్తంచేశా రు. పనిలోపనిగా చైనా దురాక్రమణ పట్ల హంకాంగ్‌లో వెల్లువె త్తుతున్న నిరసనలకు ప్రపంచ మీడియా పతాక శీర్షికల్లో ప్రాధా న్యతిస్తోంది. జమ్మూకాశ్మీర్‌లో గత 60రోజులుగా ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. సమాచార వ్యవస్థ స్థంభించింది. కనీసం నమాజ్ చేసుకునేందుక్కూడా ముస్లింలను అనుమతించడంలేదు. పాఠశాలలు మూసేశారు. ప్రభుత్వ కార్యాల యాలు పని చేయడంలేదు. జమ్మూకాశ్మీర్ మొత్తం సైనిక నియంత్రణలో ఉంది. కానీ ఈ అంశానికి అంతర్జాతీయ మీడియా ఏమాత్రం ప్రాధాన్యతనివ్వక పోవడం తనకు ఆశ్చర్యంగా ఉందంటూ ఇమ్రాన్‌ఖాన్ వరుసపెట్టి ట్వీట్‌లు చేశారు. చైనా అధ్యక్షుడికి కాశ్మీర్ అంశాన్ని గుర్తుకు తేవాలన్న తలంపుతో ఇమ్రాన్ చేసిన ఈ వ్యాఖ్యల్లో ఆలోచనారహితంగా హంకాంగ్‌లో చైనా దురాక్రమణ, అణిచి వేత అంశాల్ని ప్రస్తావించడం ఇప్పుడు జిన్‌పింగ్‌కు తలనొప్పిగా పరిణమించింది. పాక్‌కు ప్రపంచంలో ఉన్న ఏకైక బలమైన మిత్రదేశం ఒక్క చైనాయే. 370వ అధికరణం రద్దు అనంతరం కాలికి బలపాలు కట్టుకుని ఇంటింటికి తిరిగిన ఇమ్రాన్‌కు ఎక్కడా సానుకూలత వ్యక్తంకాలేదు. అమెరికా నుంచి ఐరోపా దేశాలన్నీ విశ్వసించలేదు. ఆయన వాదనకు మద్దతివ్వలేదు. ఆఖరకు ఐక్య రాజ్యసమితి కూడా పోయి భారత్‌తో తేల్చుకో అంటూ సలహా ఇచ్చి ఊరుకుంది. ఒక్క చైనా మాత్రమే పాక్‌కు అండగా నిలబడింది. ఈ ఒక్క విషయంలోనే కాదు.. దీర్ఘకాలికంగా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాల్ని అడ్డుకునే క్రమంలో భారత్‌క ు ఆ అవకాశం కల్పిస్తే పాకిస్థాన్‌కు కూడా ఇవ్వాలంటూ కొత్త మెలిక పెట్టింది చైనా. ఇలా అంతర్జాతీయ వేదికలపై భారత్‌కు వ్యతిరేకంగా పాక్‌కు ప్రయోజనకరంగా వ్యవహరిస్తున్న దేశం అదొక్కటే. కాగా ఇప్పుడు ఇమ్రాన్ హంకాంగ్‌లో చైనా అణిచి వేత, ఊచకోతల గురించి స్వయంగా ప్రస్తావించి ఇంతవరకు వాటిని తీవ్రంగా ఖండిస్తున్న ఆ దేశ వాదన తప్పని స్వయంగా ప్రపంచానికి చాటిచెప్పినట్లయింది.

# స్నేహగీతిక



(మొదటి పేజీ తరువాయి)

స్టేట్ కౌన్సిలర్ యాంగ్ జీచీ ఉన్నారు. భారత్ విదేశాంగమంత్రి జైశంకర్, ఎన్ఎస్ఏ అజీత్ దోవల్‌తో వీరివురు సమావేశమవనున్నారని అధికారిక వర్గాలు పేర్కొ న్నాయి. అనధికారిక భేటీ కావడంతో ఎలాంటి ఒప్పందాలపై సంతకాలు చేయబోర ని అధికారులు వివరించారు. బంధాల బలోపేతానికి విశ్వాసాన్ని పెంపొందించు కోవడమే అనధికార భేటీ ఉద్దేశమని వివరించారు. కాశ్మీర్, సరిహద్దు అంశాల్లో విభేదాలు ఉన్నప్పటికీ ప్రపంచంలో ధృఢమైన ఆర్థిక శక్తులుగా ఎదుగుతున్న భారత్, చైనాల మధ్య మెరుగైన ద్వైపాక్షిక వాణిజ్యం, అభివృద్ధిలో సహకారం పెంపుపై మోడీ-జీ సమావేశం దృష్టిసారిస్తుందని ఇరుదేశాల దౌత్యాధికారులు వివరించారు. యూనెస్కో ప్రపంచ వారసత్వ సంపద వద్ద ప్రశాంతమైన వాతావ రణంలో జరగనున్న అనధికారిక భేటీ ఇరుదేశాల బంధాలను మరింత బలోపేతం చేస్తూ ఉన్నతస్థాయికి తీసుకెళ్తుంది. భారత్-చైనా బంధాలు వేగం పుంజుకుంటాయి అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రవీష్‌కుమార్ శుక్రవారం ట్వీట్ చేశారు. అనధి కారిక భేటీలో కాశ్మీర్ అంశాన్ని లేవనెత్తితే అంశాన్ని జిన్‌పింగ్‌కు వివరించేందుకు ప్రధాని మోడీ సిద్ధంగా ఉన్నాయని అధికారవర్గాలు వెల్లడించాయి. మరోవైపు 7వ శతాబ్దంలో నిర్మించిన మహాబలిపురంలోని తీర దేవాలయంలో సహాయకులు లేకు ండానే అధినేతలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించనున్నారు. ఇదిలావుండగా భారత పర్యటనకు ముందు పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో జిన్‌పింగ్ సమావేశమవడం చర్చనీయాశంగా మారింది. పాక్‌కు మద్దతు తెలుపుతూ కాశ్మీర్ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించిన విషయం తెలిసిందే.

## తమిళ సంప్రదాయక దుస్తుల్లో స్వాగతం

ఎయిర్‌పోర్ట్‌లో తమిళనాడు సాంస్కృతిక, సంప్రదాయక స్వాగతం అందుక ుని మహాబలిపురం చేరుకున్న జిన్‌పింగ్‌కు తమిళసాంప్రదాయక దుస్తుల్లో ప్రధాని మోడీ ఘనస్వాగతం పలికారు. ముందుగానే అక్కడికి చేరుకున్న ప్రధాని మోడీ.. తమిళనాడు సాంప్రదాయక ధోతి, అంగవస్త్రం(శాలువా) ధరించిన మోడీ జిన్‌పిం గ్‌కు షేక్ హ్యాండ్ ఇచ్చి స్వాగతం పలికారు. తెల్ల చొక్కా, నల్ల ప్యాంట్ ధరించిన జిన్ పింగ్‌కు అర్జునుడి తపస్సు స్మారకం వద్ద జిన్‌పింగ్‌కు స్వాగతం పలికారు. పలక రింపుల సందర్భంగా ఇరువురు నవ్వుతూ సరదాగా కనిపించారు. ఇదిలావుండగా జిన్‌పింగ్ పర్యటన దృష్ట్యా ఉదయం 11:30 గంటలకే ప్రధాని చెన్నై చేరుకున్నారు.

## శనివారం షెడ్యూల్..

శనివారం ఉదయం మహాబలిపురంలోని విలాసవంతమైన తాజ్ ఫిషర్‌మ్యాన్ కోవ్ రిసార్ట్ అండ్ స్పాలో మోడీ, జిన్‌పింగ్‌లు ఏకాంతంగా చర్చలు జరుపుతారు. దాదాపు కొన్ని గంటలపాటు భేటీ అనంతరం ఇరుదేశాలు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేస్తాయని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. ద్వైపాక్షిక వాణిజ్యం, రక్షణ, సరిహద్దు సమస్యలతోపాటు ఉగ్రవాదం అంశంపై కూడా ఇరువురు చర్చించ నున్నారని పేర్కొన్నాయి. కీలక అంశాల్లో బంధాల బలోపేతం లక్ష్యంగా ఈ చర్చలు కొనసాగుతాయి. చర్చల అనంతర జిన్‌పింగ్‌కు మోడీ లంచ్ ఆతిథ్యమిస్తారు. మధ్యహ్నం 12:45 నిమిషాలకు జిన్‌పింగ్ చెన్నై ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరతారు. అక్కడి నుంచి తన అధికారిక విమానం ఎయిర్ చైనా బోయింగ్ 747లో నేపాల్‌కు బయలుదేరతారు.

## మూడు భాషల్లో మోడీ ట్వీట్

చెన్నై ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు మొత్తం మూడు భాషల్లో ప్రధాని మోడీ స్వాగతం చెప్పారు. భారత్ వచ్చిన చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌కు స్వాగతం అంటూ ఇంగ్లీష్, తమిళ్, చైనా భాషల్లో ఆయన ట్వీట్ చేశారు.

## రక్షణ వలయంలో మహాబలిపురం

ప్రధాని మోడీ, అధ్యక్షుడు జిన్‌పింగ్ పర్యటన నేపథ్యంలో మహాబలిపురంలో భద్రత శత్రుదుర్భేధ్యంగా ఉంది. మొత్తం 5 వేల మంది పోలీసుల నగరానికి పహారాకాస్తున్నారు. వందల సంఖ్యలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పరిశీలిస్తున్నా రు. మరోవైపు ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డ్ సిబ్బంది తీర దేవాలయానికి కొంతదరూ రంలో తమ యుద్ధనౌకలను మోహరించాయి. పట్టణంలోకి ప్రవేశించే పాయింట్ల వద్ద తాత్కాలిక తనిఖీ పాయింట్లను ఏర్పాటు చేసిన క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.



దర్శనీయ ప్రాంతాల్లో పర్యటకుల సందర్శనపై కొన్నిరోజులపాటు ఆంక్షలు విధిం చిన విషయం విధితమే. చేపల వేటను కూడా కొన్ని రోజులపాటు నిషేధించారు.

## చైనా-మహాబలిపురం చారిత్రక బంధం

మోడీ-జిన్‌పింగ్‌ల భేటీకి ఆతిథ్యమిస్తున్న మహాబలిపురం పట్టణానికి దాదా పు 1,700 సంవత్సరాల క్రితమే చైనాతో సంబంధాలు ఉన్నాయి. తీర పట్టణంలో విశేషమైన సాంస్కృతిక సంపద, శిల్పకళా నైపుణ్యాలతోపాటు విజయమే తప్ప ఓట మి ఎరుగని నరసింహవర్మ-1 కాలంలో పల్లవ రాజ్యానికి చైనాకి సన్నిహిత మైత్రి కొనసాగిందని చరిత్ర చెబుతోంది. చోళ, పల్లవ రాజ్యాల పాలనలో మహాబలిపురం పోర్ట్ పట్టణంగా విరాజిల్లింది. దీంతో పొరుగునే ఉన్న చైనాతో వ్యాపార, రక్షణ అంశా ల్లో పల్లవ రాజులు బంధాలు కొనసాగించారు. టిబెట్‌ను శక్తివంతమైన దేశంగా పురోభివృద్ధి చెందించడంలో సహకరిస్తామని చైనాకు పల్లవ రాజులు అంగీకారం తెలిపారని చరిత్రకారులు చెబుతున్నారు. చైనాలో అత్యంత ప్రముఖమైన బౌద్ధ సన్యాసి భోధిధర్ముడు పల్లవ రాజుల్లో ఒకరి సంతానంగా భావిస్తారు. భోధిధర్ముడు కంచీపురం నుంచి మామల్లపురం మీదుగా క్రిశ 527లో చైనాకు ప్రయాణించారని చరిత్రకారులు పేర్కొంటున్నారు. పల్లవ రాజులు చైనా, శ్రీలంక, ఇతర ఆగ్నే యాసియా దేశాలతోవర్తకం నిర్వహించారని చెబుతున్నారు. చైనా, పర్షియా, రోమ్ లకు చెందిన నాణేలు మామల్లపురంలో లభ్యమయ్యాయని వివరించారు. పల్లవ రాజ్యం వాణిజ్య కేంద్రంగా కొనసాగిందంటున్నారు. ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకారం పురాతన కాలంలో ఆగ్నేయాసియా ప్రాంతంలో అతిపెద్ద పోర్ట్ పట్టణాల్లో మహాబలిపురంగా ఒకటిగా ఉంది. ఇందుకు సంబంధించిన ఆధారాలు క ూడా ఉన్నాయి. చైనా సందర్శకుడు హుయత్సాంగ్ కూడా తన ప్రయాణ గ్రంథాల్లో మహాబలిపురాన్ని పోర్ట్ నగరంగా పేర్కొన్నాడు. మరోవైపు తూర్పు తీరంలో చైనా మట్టపాత్రలు, నాణేలు లభించాయి. సంగం యుగంలో బౌద్ధక్షేత్రంగా విరాజిల్లిన కంచీపురాన్ని చైనా బౌద్ధ పర్యాటకుడు హుయేత్సాంగ్ సందర్శించారు.

### మన హెలికాప్టర్ కాదని...
### చైనా కారులోనే జిన్‌పింగ్!



**చెన్నై:** చెన్నై నగరం నుంచి ఆతిథ్య పట్టణం మహాబలిపురానికి భారతీయ హెలికాప్టర్‌లో ప్రయాణించేందుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నిరాకరించారు. చైనా నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన భారీ విలాసవంతమైన హాంగ్‌క్వీ కారులోనే రోడ్డు మార్గన దాదాపు 57 కి.మీ దూరం ప్రయాణించి మహాబలిపురం చేరుకున్నారు. ప్రధాని మోడీ చెన్నై నుంచి మహాబలిపురానికి హెలికాప్టర్‌లోనే చేరుకున్నా... అధికార కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా(సీపీసీ) విధానానికి అనుగుణంగా ఆయన చైనా బ్రాండ్ కారులోనే ప్రయాణించారు. సీపీసీ వ్యవస్థాపకుడు మావో జెడాంగ్ నుంచి పార్టీ నేతలంతా హాంగ్‌క్వీ కార్లనే వినియోగిస్తున్నారు. చైనా బ్రాండ్ హాంగ్‌క్వీ అంటే ఎర్ర జెండా అని అర్థం. అందుకే వారంతా హాంగ్‌క్వీ కార్లను ప్రయాణానికి ఎంచు కుంటున్నారు. ఇదే అంశంపై బీజింగ్‌లోని భారత విదేశాంగశాఖ అధికారులు స్పం దించారు. చైనా నాయకులు హెలికాప్టర్లు ఉపయోగించరని వివరించారు.

విమానాలు, కార్లను మాత్రమే వినియోగిస్తారన్నారు. జీ-20 సదస్సు సందర్భంగా కూడా జిన్‌పింగ్ హెలికాప్టర్‌ను వినియోగించలేదని వివరించారు. మావో జెడాంగ్ తర్వాత చైనా అత్యంత శక్తివంతమైన నేతగా గుర్తింపు పొందిన అధ్యక్షుడు వినియోగించాల్సిన కారుకు సంబంధించి రాజ్యాంగ సవరణ తీసుకొచ్చారు. అమెరికా అధ్యక్షులు దీ బీస్ట్ అనే ధృఢమైన కారును వినియోగిస్తున్న ట్టుగానే హాంగ్‌క్వీ కారు వినియోగాన్ని అధికారికంగా మార్చారు. మరో కోణంలో అంతర్జాతీయ వేదికలపై చైనా బ్రాండ్‌ను పరిచయం చేయడం కూడా జిన్‌పింగ్ ఆలోచనగా ఉంది.



### పురాతన ఆలయాల సందర్శన

7, 8వ శతాబ్దాల్లో చోళులు, పల్లవ రాజుల కాలంలో రాతి శిలా కళానైపుణ్య ంతో నిర్మించిన దేవాలయాలను ఇరుదేశాధినేతలు సందర్శించారు. అర్జున తప స్సుస్మారకకేంద్రం, పంచ రథాలు, తీర దేవాలయాన్ని సందర్శించారు. తీరా దేవా లయం ప్రాంగణంలో ఇరువురు దాదాపు అరగంటకుపై మాట్లాడారు. కృష్ణుడి కోసం వెన్న ఉంచిన ప్రదేశంగా భావించే బండరాళ్ల ప్రాంతాన్ని కూడా సందర్శిం చారు. సాయంత్రం ఆరున్నతర తర్వాత తీర దేవాలయంలో కళాక్షేత్రం ఫౌండేషన్ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. విదేశాంగమంత్రి జైశం కర్, ఎన్ఎస్ఏ అజిత్ దోవల్ కూడా జిన్ పింగ్‌ను తీర దేవాలయంలో కలిశారు.



# ఇథియోఫియా ప్రధానికి నోబెల్ శాంతి!

**ఓస్లో:** ఇథియోఫియా ప్రధాని అబీ అహ్మద్(43)ను నోబెల్ శాంతి పురస్కారం వరించింది. అంతర్జాతీయ సహ కారం, శాంతి స్థాపన కోసం అబీ అహ్మద్ చేసిన కృషికి గానూ 2019 లో నోబెల్ శాంతి పురస్కారం అందజేస్తున్నట్లు నోబెల్ కమిటీ ప్రకటించింది. ఇథియోఫియా సరిహద్దు దేశం ఎరిత్రి యాతో ఉద్రిక్తతలను తగ్గించడంలో అబీ అహ్మద్ నిర్విరా మంగా చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డును బహూ కరిస్తున్నారు. నాలుగు సార్లు ఇథియోఫియా ప్రధానిగా సేవలందించిన అబీ అహ్మద్ దశాబ్దాల కాలంలో సరిహద్దు వివాదాల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. సందర్భం వచ్చిన ప్పుడల్లా ఎరిత్రియా అధ్యక్షుడితో చర్చలు జరిపి చివరకు వివాదం సద్దుమణిగేలా చేశారు. తన హయాంలో ఇథియో ఫియా అభివృద్ధికి అనేక సంస్కరణలు చేపట్టిన అబీ అహ్మద్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అత్యవసర పరిస్థితిని ఎత్తివేశారు. జైళ్లలో మగ్గుతున్న ఖైదీలకు స్వేచ్ఛను కల్పించారు. అవినీతి అధికారులపై ఉక్కుపాదం మోపారు. ఆఫ్రికా యువ నాయకుడికి నోబెల్ శాంతి బహుమతి రావడం ఆహ్వానించదగిన పరిణామమే అయినా.. మే 2020 లో పార్లమెంటరీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అంతర్గత మతకల్లోలాలు జరిగే అవకాశముండటం ఆయన ఇంకా ఆందోళనతోనే ఉన్నారు. నోబెల్ శాంతి బహుమతికి తనను ఎంపిక చేసిన కమిటీకి ధన్యవాదాలు తెలియజేసిన అబీ అహ్మద్.. ఇతర ఆఫ్రికా దేశాల్లోనూ శాంతి, సహకారానికి కృషి చేస్తానన్నారు.

# విలీనమెలా?!

- ఆర్టీసీ విలీన ప్రక్రియపై మరో ముందడుగు
- విధివిధానాల రూపకల్పనకు కమిటీ నియామకం

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్టీసీ విలీన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ఇప్పటికే విలీన ప్రక్రియపై నిపుణుల కమిటీ సిఫారసులను ఆమోదించిన ప్రభుత్వం.. విలీన ప్రక్రి య పూర్తి చేసే క్రమంలో జాప్యాన్ని నివారించేందుకు ఉద్యో గుల విలీనం, పదవీ విరమణ వయస్సు పెంపు వంటి పలు చర్యలు తీసుకుంది. ఈ క్రమంలోనే నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ కార్మికుల గుర్తింపు, కేడర్ నిర్ధారణ, వేతన వ్యత్యాసాలు, పింఛన్లు సరిచేయడం, ఆర్టీసీ బోర్డు పునర్వ్యవస్థీకరణ తదితర అంశాలపై విధివిధానాల రూపకల్పనకు కమిటీని నియమి స్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి ఛైర్మన్‌గా, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(పరిపాలన) మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్న కమిటీలో సభ్యు లుగా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ(జీఏడీ) కార్యదర్శి(సర్వీసెస్), పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ ప్రభుత్వ కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. కమిటీ ప్రభుత్వం నిర్దేశించిన అన్ని అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి విధివిధానాలతో కూడిన నివేదికను నవంబర్ 30లోగా ప్రభుత్వానికి అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నిపుణుల కమిటీ నివేదికలో ఆర్టీసీ విలీనం తర్వాత ఉద్యోగుల విధివిధానాలు, సర్వీసు నిబంధనలు, పింఛన్, ప్రజా రవాణా శాఖ (పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టు మెంటు) ఏర్పాటుకు అవసరమై న చర్యలు తీసుకోవా లంటూ పేర్కొంది. నిపుణుల కమిటీ సిఫారసు మేరకు వివిధ అంశాలపై అధ్యయనం చేసి విధి విధానాల రూపకల్పనకు ప్రస్తుతం నియమించిన కమిటీ పనిచేస్తుంది. ఆర్టీసీ ఉద్యోగు లను ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ప్రజా రవాణా శాఖ(పీటీడీ) విధివిధానాలను కమిటీ ఖరారు చేయనుంది. ఇదే సమయంలో ఇప్పుడున్న సర్వీసు నిబంధనలు, నియమాలు కొనసాగింపు, సవరణపై కమిటీ దృష్టిసారించ నుంది. సీసీఏ(క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీలు) నిబంధనల సరవరణపై తగిన విధివిధానాలు రూపొందిం చాల్సి ఉంటుంది. ఆర్టీసీ కార్మికులకు ప్రస్తుత పింఛను, పదవీ విరమణ ప్రయోజనాలు, పథకాలు, కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, వైద్య సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలు విలీ నం, పదవీ విరమణ చేసిన వారికి వర్తింపు వంటి పలు అం శాలను కమిటీ నిర్దేశించనుంది. ఏపీఎస్ఆర్టీసీ బోర్డు పున ర్వ్యవస్థీకరణ, విలీన ప్రక్రియకు ఆమోదం, న్యాయ, ఆర్థిక, పాలనాపరమై ఇబ్బందులు, విలీనం తర్వాత తలెత్తే సమ స్యలు సహా అన్ని అంశాలపై కమిటీ తగిన విధంగా విధి విధానాలు రూపొం దించి ప్రభుత్వానికి అందజేయనుంది. ఆర్టీసీ విలీన ప్రక్రియలో ఉద్యోగులకు సంబంధించి కీలక నిర్ణ యాలు తీసుకోనున్న కమిటీలో తమను కూడా భాగస్వాము లను చేసినట్లయితే బాగుండేదని ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరా వు అభిప్రాయపడ్డారు. కార్మిక సంఘాల భాగ స్వామ్యం ఉ న్నప్పుడే తగిన న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

# ఇక పర్యాటక పరుగు!

- ప్రపంచ స్థాయిలో ఏర్పాట్లు
- ఎంపిక ప్రాంతాల్లో గ్లోబల్ సంస్థలతో అభివృద్ధి
- కార్యాచరణ సిద్ధం చేయండి
- పర్యాటకశాఖ సమీక్షలో సీఎం జగన్



**అమరావతి, ఆంధ్రప్రభ:** ప్రపంచ పర్యాటక రంగంలో ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రముఖ స్థానం వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అధికారులను ఆదేశిం చారు. రాష్ట్రంలో సుమారు 15 నుండి 20 పర్యాటక ప్రాంతాలు ఎంపి కచేసి, అంతర్జాతీయంగా పేరున్న సంస్థల సహకారంతో వాటిని అభి వృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతాల్లో సెవెన్‌స్టార్ తరహా సదు పాయాలున్న హోటళ్లు తీసుకురావాలని, అంతర్జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. టూరిజం, ఆర్కియాలజీ, యూత్ ఎఫైర్స్ శాఖలపై ముఖ్యమంత్రి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టూరిజంతో పాటు చారిత్రక ప్రాంతాల అభివృద్ధి, అన్ని జిల్లాల్లో క్రీడా సదుపా యాల ఏర్పాటుపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అనంత రం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, భారతదేశంలో అడుగుపెట్టే ప్రతి పర్యాటకుడు రాజస్థాన్ రాష్ట్రాన్ని ఎంపిక చేసుకుంటున్నాడని, అక్కడ పర్యాటక ప్రాంతాల్లో అంతర్జాతీయ సదుపాయాలు ఉండటమే దీని కి కారణమని చెప్పారు. రాష్ట్రంలో ఈ స్థాయిలో అభివృద్ధి చేయా ల్సిన ప్రాంతాలను ముందుగానే ఎంపిక చేసి తనకు వివరాలు తెలి యజేయాలని ఆదేశించారు. ఆతిథ్య రంగంలో, పర్యాటక రంగంలో అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలున్న సంస్థలు, హోటళ్లను ఏర్పాటు చేసినట్లు ఇక్కడ ఉత్తమ సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలపై సహజంగానే అంతర్జాతీయ స్థాయిలో మంచి ప్రచారం లభిస్తుందని చెప్పారు. అభివృద్ధి చేయాల్సిన పర్యాటక ప్రాంతాలను గుర్తించిన తరువాత వాటి మార్కెటింగ్‌పై కూడా దృష్టిపెట్టాలన్నారు. ఇదే సమ యంలో కళింగపట్నం, విశాఖ, కాకినాడ, రాజమండ్రి, పోలవరం, సూర్యలంక, హార్సిలీ హిల్స్, ఓర్వ కల్లు, గండికోట తదితర ప్రాంతా లను అధికారులు ప్రతిపాదించారు. పూర్తిస్థాయి నివేదికతో తనకు మళ్లీ సమాచారం అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. గండికోట అడ్వెంచర్ అకాడమీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నా మని, పలు పర్యాటక ప్రాంతాల్లో రోప్‌వేలను నిర్మించడానికి ప్రయ త్నాలు చేస్తున్నట్లుగా అధికారులు వివరించారు. తనకు సమర్పించే నివేదికలో ఈ ప్రతిపాదనలు అన్నింటినీ చేర్చాలని సూచించారు. పోలవరం, పులిచింతల, నాగార్జునసాగర్, శ్రీశైలం, సోమశిల, కండ లేరు తదితర రిజర్వాయర్లు, డ్యాంలతోపాటు విశాఖ జిల్లాలో అరకు, లంబసింగి, పాడేరు, మారేడుమిల్లి ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖలో మరో మ్యూజికం ఏర్పాటుకు రక్షణ శాఖ అధికారులు సిద్ధంగా ఉన్న విషయాన్ని ఈసమావేశంలో వెల్లడిం చారు. ఏపీటీడీసీ రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో హోటళ్లను, రిసార్టులను నిర్వహిస్తోందని, అయితే, చాలా రోజులుగా నిర్వహణ కోసం కనీసం నిధులు కూడా ఇవ్వకపోవడంతో సమస్యలు ఉన్నాయ ని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వీటి మరమ్మతులు చేపట్టి నిర్వహణ మెరుగుపర్చాలని ఆదేశించారు.

## హస్తకళలు అంతరించిపోకుండా చర్యలు

రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపునిస్తున్న హస్తకళలు అంతరించి పోకుండా వారిని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. అరుదైన హస్తకళల్లో నైపుణ్యం కలిగిన ఏటికొప్పాక, కొండపల్లి, కళంకారి తదితర కళాకారులను ఆదుకునే దిశగా కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఏటికొప్పా క, కొండపల్లి బొమ్మలు, లేసుల తయారీ, కళంకారీ తదితర అరుదైన హస్తకళలు చేస్తున్న కుటుంబాలవారికి సహాయం చేసేలా మార్గ దర్శకాలు తయారు చేయాలన్నారు. లేకపోతే ఆ కళలు బతకవని, వాటిని నిలుపుకోవాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు.

## ఆర్కియాలజీ కార్పొరేషన్ ఏర్పాటు

అలాగే రాష్ట్రంలో కూడా చారిత్రక స్థలాల అభివృద్ధి, మౌలిక సదుపాయలను కల్పించడానికి, వాటిని సరిగ్గా నిర్వహించడానికి ఆర్కియాలజీ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కొండపల్లికి రోడ్డు, లైట్ల సదుపాయం, బాపు మ్యూజికంలో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు.

## గోదావరిలో బోట్లు తిప్పడంపై చర్చ

గోదావరిలో మరలా బోట్లను తిప్పడంపై సమావేశంలో చర్చ కు వచ్చింది. నదీతీరాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటుపై ఈ సందర్భం గా సీఎం ఆరా తీశారు. నిర్దిష్టమైన నిర్వహణా పద్ధతులు, కంట్రోల్ రూమ్స్ ఏర్పాటుపైన దృష్టి పెట్టాలన్నారు. పర్యాటకులు, ప్రయాణీ కులకు సరైన భద్రతా ప్రమాణాలు ఉన్నాయని సంతృప్తిచెందిన తరువాతే అనుమతివ్వాలని అధికారులను ఆదేశించారు. దీనికోసం ఏర్పాటైన కమిటీ నివేదిక రాగానే సిఫార్సులు అమలు చేద్దామని సీఎం చెప్పారు. శిల్పారామాల్లో ప్రస్తుత పరిస్థితిపైనా సీఎం సమీక్ష చేశారు. ప్రస్తుతం ఉన్న శిల్పారామాల అభివృద్ధి, వాటిలో గ్రీనరీని పెంచడంపైన సీఎం అధికారులకు సూచనలు చేశారు. శిల్పారామాల నిర్వహణకు ఇబ్బంది లేకుండా విధానాన్ని తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

## జిల్లాకో కల్చరల్ అకాడమీ

ప్రతి జిల్లాలో కల్చరల్ అకాడమీ ఏర్పాటుకు సీఎం నిర్ణయం తీసుకున్నారు. కనీసం ఐదెకరాల స్థలంలో ఈ అకాడమీలను నిర్మిం చాలని, రెండేళ్లలోగా వీటిని పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసు కోవాలని సీఎం ఆదేశించారు. సంగీతం, నాట్యం సహా ఇతర కళల్లో శిక్షణ, బోధన, ప్రదర్శనలకు కల్చరల్ అకాడమీలు వేదిక కావాల న్నారు. మన కళలను, సంస్కృతిని నిలుపుకోవడానికి, వాటి ప్రాము ఖ్య పెంచడానికి ఈ అకాడమీలు ఉపయోగపడతాయని సీఎం చెప్పారు. సంగీత, నృత్య కళాశాల్లో బోధిస్తున్న వారికి పార్ట్‌టైమ్, ఫుల్ టైమ్ వారికి జీతాలు పెంచాలని కూడా సీఎం ఆదేశించారు.

## ప్రతి పాఠశాలలో క్రీడా మైదానం తప్పనిసరి

రాష్ట్రంలో క్రీడలు, సదుపాయాలపైన ముఖ్యమంత్రి సమీక్షిం చారు. ప్రతి పాఠశాలలో క్రీడల కోసం మైదానం ఉండేలా చూడాల న్నారు. ఇప్పటివరకూ ఎన్ని పాఠశాలలకు క్రీడా మైదానాలు ఉన్నా యి.. ఎన్నింటికి సమకూర్చాలన్న దానిపై నివేదిక తయారు చేయా లన్నారు. అలాగే ఉన్న ఆటస్థలాల అభివృద్ధిపైన కూడా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఫిజికల్ ట్రైనర్లు ఉన్నారా.. లేదా.. అనేదానిపై కూడా పరిశీలన చేసి నివేదికలో పొందుపర్చాలని సూచించారు.

## విశాఖ, రాజమండ్రి, కాకినాడ, అమరావతి, తిరుపతిల్లో అంతర్జాతీయ స్టేడియంలు

విశాఖ, రాజమండ్రి, కాకినాడ, అమరావతి, తిరుపతి అంతర్జా తీయ ప్రమాణాలతో క్రీడా స్టేడియంల నిర్మాణంపై సమావేశంలో చర్చ జరిగింది. అంతర్జాతీయ సదుపాయాలతో స్టేడియంల నిర్మాణానికి సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా ప్రతి జిల్లాలో కూడా ఒక స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఉండాలని వీటికి ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యత, అంతర్జాతీయ ప్రమాణాలు ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో కూడా క్రీడా సముదాయాల కారణంగా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిం చిన రాష్ట్రక్రీడాకారులను ఏ విధంగా ప్రోత్సహించాలి, వారికి ఎలా అండగా నిలబడాలన్నదానిపై కూడా ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. గడచిన ఐదేళ్లలో జాతీయ క్రీడల్లో పతకా లు సాధించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున నగదు ప్రోత్సహకాలు ఇచ్చే ఆలోచనలో గతంలో ఎప్పుడూ చేయలేదని, ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ కార్యక్రమాన్ని చేపట్టిందని సీఎం చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో పర్యాటక, పురావస్తు, యువజన వ్యవహా రాల శాఖా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శనివారం 12 అక్టోబర్ 2019

## ప్లాస్టిక్ నిషేధం సాధ్యమే!

సహజసిద్ధంగా పదార్థ అణువులతో కాకుండా కృత్రిమ అణు పుంజాలతో తయారు చేసే పదార్థమే ప్లాస్టిక్. వీటి వినియోగం మనుషులకే కాకుండా, జంతుజాలానికి హానికరమని శాస్త్రవేత్తలు ఎంతో కాలంగా హెచ్చరిస్తున్నారు.ప్లాస్టిక్‌లో కేన్సర్ కారకాలు ఉంటాయని కూడా వారు హెచ్చరిస్తున్నారు మన దేశంలో కేన్సర్ వ్యాధి గతంలో కన్నా ఎక్కువగా విస్తరించడానికి ప్లాస్టిక్ వస్తువుల వినియోగం కూడా ఒక కారణమని సర్వేలో తేలింది. మన దేశంలో ప్లాస్టిక్ పూర్తి నిషేధాన్ని 2022నాటికి అమలులో పెట్టనున్నట్టు గాంధీజీ 150వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటించారు.

ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం యుద్ధాన్ని ప్రకటించింది.ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందించేందుకు అటవీ,పర్యావరణ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఒకసారి వినియోగించి పారవేసే ప్లాస్టిక్ వస్తువులు, పాలథిన్ సంచుల వల్ల పర్యావరణానికి ముప్పు ఉందని పర్యావరణవేత్తలు ఎంతో కాలం గా హెచ్చరిస్తున్నా, ఇటు ప్రజలూ,అటు ప్రభుత్వాలూ సీరియస్ గా తీసుకోవడం లేదు.ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వల్ల వచ్చే అనర్థాలను గురించి ప్రజలకు వివరించేందుకు ఉద్యమ స్థాయి ప్రచారం జరగాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపు ఇచ్చారు.తెలంగాణ రాజ్ భవన్ లో ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్టు గవర్నర్ తమిళిసై ప్రకటించారు. సిఐఐ ఆధ్వర్యాన జరిగిన సదస్సులో ఆమె ప్రసంగిస్తూ ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయాన్ని కనుగొనాలని శాస్త్రవేత్తలకు పిలుపు ఇచ్చారు. గోనె,కాగిత సంచుల వినియోగం ఇప్పటికే తెలుగు రాష్ట్రా ల్లో పలు చోట్ల అమలులో ఉంది.ముఖ్యంగా, కిరాణా వస్తువులను కాగితపు సంచుల్లో ప్యాకింగ్ చేసి ఇచ్చే పద్ధతి చాలా చోట్ల అమలులో ఉంది.ఈ మధ్య కాలంలో పోలిథిన్ సంచుల వినియోగాన్ని బాగా పెంచేశారు. మాల్స్,డిపార్టుమెంటల్ స్టోర్సులతో ప్రారంభమైన ప్లాస్టిక్ వినియోగం క్రమంగా కిరాణా దుకాణాలకు విస్తరించింది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా హర్షామోదాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే,సులభంగా వస్తువులను తీసుకుని వెళ్ళేందుకు, ఒకసారి ఉపయోగించి పారవేసేందుకు ప్లాస్టిక్ వస్తువులు,పాలథిన్ సంచులైతే వీలుగా ఉంటాయని ప్రజలు ఎంతో కాలంగా వీటిపై ఆధార పడుతున్నారు. ప్లాస్టిక్ వస్తువులు,పాలథిన్ సంచులను ఆవులు,మేకలు వంటి పశువులు, తాబేళ్ళు వంటి జలరాశులు తినడం వల్ల వాటికి ప్రాణ హాని కలుగుతోంది.ఒక తాబేలు కడుపులో 104 ప్లాస్టిక్ ముక్కలు ఉన్నాయనీ, ఒడ్డున పడగానే అది ప్రాణాలను విడిచిందని గుంబోలిం బో నేచర్ సెంటర్ ప్రకటించింది.అలాగే, మనం తాగే పాలు ఇచ్చే ఆవులు,గేదెల కడుపు నిండా ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి.వీటి ద్వారా కూడా పాలల్లో కల్తీ జరుగుతోందని పరిశోధనల్లో వెల్లడైంది.రోడ్ల మీద

ప్లాస్టిక్ వస్తువులు, సంచులను విసిరి వేయడం వల్ల పాదచారులు గాయపడుతున్నారు.తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే 50మైక్రాన్ లోపు ఉన్న ప్లాస్టిక్ పై నిషేధాన్ని అమలు జేస్తోంది.ఈ తరహా ప్లాస్టిక్ వస్తువులు ప్రజలకు మరింత హాని చేస్తాయని పర్యావరణవేత్తలు హెచ్చ రిస్తున్నారు. ప్లాస్టిక్ పై నిషేధాన్ని విధించాలన్న నిర్ణయాన్ని తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం ఇతర రాష్ట్రా ల్లో దీనిని అమలు జేసేందుకు తీసుకుంటున్నచర్యలగురించి,విధి విధానాలను గురించి అధ్యయనం చేయిస్తోంది.ఆంధ్రప్రదేశ్ లో కూడా ప్లాస్టిక్ వినియోగంపై నిషేధానికి సంబంధించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.హైదరాబాద్ మహానగర పాలక సంస్థ 50 మైక్రాన్ల లోపు మందం ఉండే ప్లాస్టిక్ వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలను ఇప్పటికే మూసివేయించింది. ప్లాస్టిక్ వస్తువులు ఎక్కడ ఉత్పత్తి అవుతున్నాయో కనుగొనేందుకు అధికారుల ు ఆకస్మిక దాడులు జరుపుతున్నారు.అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో, సియాటల్ రాష్ట్రా ల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. వాషింగ్టన్ డీసీ,బోస్టన్ వంటి నగరాల్లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై పన్నులు వేస్తున్నారు.ఈ పన్నులు 30 వేల నుంచి 40వేల డాలర్ల వరకూ ఉంటున్నాయి. ఆఫ్రికన్ దేశమైన రువాండా సహా 60 దేశాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను ఇప్పటికే నిషేధించారు. కెన్యాలో 2017నుంచి ప్లాస్టిక్ నిషేధం అమ లులో ఉంది.కెనడాలో 2016 నుంచి ప్లాస్టిక్ వస్తువుల నిషేధం అమ లులో ఉంది.దక్షిణ కొరియా.తైవాన్ తదితర దేశాల్లో ప్లాస్టిక్ ను చాలా కాలం క్రితమే నిషేధించారు. బంగ్లాదేశ్ పాలథిన్ సంచులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించిన మొదటి దేశంగా గౌరవాన్ని అందుకుంది. ప్లాస్టిక్ వస్తువులను కుప్పలుగా పోయడం వల్లవాటి నుంచి విషవాయువులు వెలువడతాయని శాస్త్రవేత్తలు హెచ్చ రిస్తున్నారు.హోటళ్ళలో ఇడ్లీ, దోశవంటి అల్పాహారాలను గతంలో ఎండిన ఆకులలో ప్యాకింగ్ చేసే వారు. జనపనార సంచుల వాడకం కూడా మన దేశంలో ముఖ్యంగా, తెలుగు రాష్ట్రా ల్లో ఎక్కువగా ఉండేది. ఇప్పుడు పాలథిన్ కాగితాలను వాడుతున్నారు. టీ, కాఫీలకు ప్లాస్టిక్ కప్పుల వినియోగం ఎంత పెరిగిందో వేరే చెప్పనవసరం లేదు.ఒకసారి వినియోగించిన ఇలాంటి కప్పులు,ప్లాస్టిక్ పేట్లను సేకరించి ప్లాస్టిక్ వస్తువులను తయారు చేసే కేంద్రాలకు అప్పగించడం ఒక వృత్తిగా తీసుకున్నారు.ఈ రకమైన ప్లాస్టిక్ వస్తువుల మోసుకెళ్ళే వారిలో అధికులు అనారోగ్యం బారిన పడుతున్నారు.పాలథిన్ సంచులు, ప్లాస్టిక్ వస్తువులను భూమిలో పాతి పెడితే అవి కరిగి పోవడానికి ఎన్నో సంవత్సరాలు పట్టవచ్చునీ, వీటి వల్ల భూసారం దెబ్బతింటుందనీ, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. గతంలో భూగర్భ జలాలు మునిసిపల్ కుళాయిల లో నీటి కన్నా పరిశుభ్రంగా,తియ్యగా ఉండేవి, ఇప్పుడు ఇలాంటి విపరీత ధోరణుల వల్ల గ్రౌండ్ వాటర్ కలుషితం అవుతోంది.అలాగే, భూములు నిస్సారం అవుతున్నాయి. భూమిని దున్నినప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రత్యక్షమవుతున్నాయి.రసాయనిక ఎరువుల వాడకం వల్ల ఇప్పటికే భూసారం దెబ్బతింటోందని వ్యవసాయ శాస్త్రజ్ఞులు హెచ్చ రిస్తున్నారు మన దేశంలో ఉపయోగించే ప్లాస్టిక్,పాలథిన్ వస్తువుల్లో చిప్స్,చాక్లెట్ల సంచులు 19 శాతం, మంచినీటి సీసాలు,మూతలు 12 శాతం, ప్యాకింగ్ లో 8 శాతం,రిటైల్ బ్యాగ్స్ 7 శాతం,ఫుడ్ బ్యాగ్స్ 7 శాతం ఉన్నట్టు ఒక సర్వేలో తేలింది. గత సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా 380మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వస్తువులు వినియోగమైనట్టు 1950 నుంచి 2018వరకూ 6.3బిలియన్ టన్నుల ప్లాస్టిక్ వస్తువులు ఉత్పత్తి అయినట్టు ఐక్యరాజ్య సమితి వెలువరించిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. ప్లాస్టిక్ వస్తువులు, కేరీ బ్యాగ్ లను పశువులు తినడం వల్ల మనిషి ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం ఉంటుంది.ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ ఉంచిన పదార్థాలు తింటే గుండె సంబంధమైన వ్యాధులు కూడా సంభవించే ప్రమాదంఉంది.ఒక్క మాటలో చెప్పాలంటే ప్లాస్టిక్ పర్యావరణానికి శత్రువు,మనిషి మనుగడను సవాల్ చేస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమి వేయాలన్న పిలుపు ప్రజా ప్రతినిధులు, అధికారంలో ఉన్నవారి నోటంట తరచూ వినిపిస్తోంది. అది పెదవుల మీద పిలుపుగానే మిగల కూడదు.

కార్యాచరణలో చూపాల్సి ఉంది.రాజస్థాన్ లో బీజేపీ ఎమ్మెల్యే మదన్ దిలావర్ గతంలో ఎప్పుడో ప్లాస్టిక్ ని వినియోగించినందుకు ఐదువేల రూపాయిల జరిమానాను కలెక్టర్ కు స్వచ్ఛందంగా అందజేశారన్నవార్త ప్రజా ప్రతినిధులందరికీ స్ఫూర్తి దాయకమైనది. ప్రజలు తమకు తాము స్వచ్ఛందంగా దీన్నొక ఉద్యమంగా స్వీకరిస్తే,ప్లాస్టిక్ కనుమరుగు ఏమాత్రం కష్టం కాదు

# యుద్ధభూమిలో శాంతి కుసుమం!



సరిగ్గా పదిహేడు నెలల క్రితం అంతర్యుద్ధం, అత్యయిక పరిస్థితి, పొరుగు దేశమై నఎరిత్రియాతో రెండు దశాబ్దాలుగా కొనసా గుతున్న సుదీర్ఘ యుద్ధం, మరణాలు, పేదరికంతో అల్లల్లాడిన ఇథియోపియా ఇప్పుడు ప్రపంచం ముందు సగర్వంగా, సంతోషంగా తలెత్తుకుని నిలబడింది. ప్రశాంత చిత్తంతో... నోబెల్ ప్రశంసలతో మురిసిపోతోంది. 43 ఏళ్ల దేశ ప్రధాని అబీ అహ్మద్ అలీ అధికారంలోకి వచ్చీరాగానే తీసుకున్న చర్యలు, చేపట్టిన సంస్కరణలునోబెల్ శాంతి బహుమతిని తెచ్చిపెట్టాయన్న సంతోషం వారిలో వెల్లివిరుస్తోంది. వారి ఆనందానికి అర్థముంది. అందులో నిజమూ ఉంది. కేవలం ఏడాదిన్నరలోదేశ గతిని మార్చిన యువ ప్రధాని దీక్షగా ముందడుగు వేస్తున్నారు. వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లోఆయన జనపరీక్షను ఎదుర్కోవడానికి సిద్ధపడుతున్నారు. సంక్షోభం నడుమ చిక్కుకున్నఇథియోపియా - ఎరిత్రియాలలో ఇరవై ఏళ్లుగా ఐరాస సహా అనేక దేశాలు శాంతికోసం చేసిన ప్రయత్నాలు సఫలం కాకపోగా, కేవలం పదిహేడు నెలల్లో శాంతిని నెలకొల్పగలిగిన యువ రాజకీయ నేత అబీ ఎలా విజయం సాధించగలిగారన్నది ఇప్పుడు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది.



**ఇదీ ప్రభుత్వ స్వరూపం:** ఇథియోపియాలో ప్రస్తుతం, ప్రధానంగా నాలుగు పార్టీల సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ కూటమిని ఈపీఆర్డీఎఫ్ (ఇథియోపియన్ పీపుల్స్ రెవెల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్)గా పిలుస్తున్నారు.

దీనికి అత్యంత శక్తివంతమైన టిపీఎల్ఎఫ్ (టిగ్రియాన్ పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్) సారథ్యం వహిస్తుండగా ఒరోమో డెమోక్రటిక్ పార్టీ (ఓడీపీ) భాగస్వామి. ఓడీపీ సారథి అయిన అబీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఓ విషయం గమనించాలి. ఇథియోపియాలో మెజారిటీ జాతికి చెందిన ఇథియోపియన్లు (35 శాతం) ఓడీపీకి గట్టి మద్దతుదారులు. అయితే సంఖ్యాపరంగా తక్కువే అయినా టిగ్రియాన్ తెగకు చెందినవారికి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ టీపీఎల్ఎఫ్ సంకీర్ణానికిసారధిగా ఉంది.

ఆర్థిక, రాజకీయ, అధికారవర్గాలలో వీరిదే పైచేయి. భాష, సంస్కృతి, సంప్రదాయల పరంగా రెండువర్గాలకూ పూర్తి వైరుధ్యం ఉంది. అయితే జాతీయ ప్రాధాన్యతల నేపథ్యంలో వీరంతా ఒక్కటిగా కలసి ప్రభుత్వాన్నిఏర్పాటు చేశారు. వీరు అధికారంలోకి వచ్చేసరికి దేశంలో అత్యయిక పరిస్థితి ఉంది. రాజకీయ,పౌరహక్కుల నేతలు, పాత్రికేయుల నిర్బంధం పతాకస్థాయికి చేరుకుంది. హత్యలు, నేరాలకు అంతే లేదు. సరిహద్దు దేశమైన ఎరిత్రియాతో సరిహద్దు వివాదం రగిల్చిన యుద్ధం... ఇరవై ఏళ్లుగా కొనసాగింది. దీనికి తోడు విభిన్న జాతులు, తెగలతో ఉండే ఇథియోపియాలో అనేక రాష్ట్రాల మధ్య ఆధిపత్యపోరు అంతర్యుద్ధ పరిస్థితుల్లోకి నెట్టివేసింది. ఈ పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వచ్చిన అబీ అనూహ్య మార్పులతో కొత్త తరం రాజకీయాలను ప్రజలకు రుచి చూపించాడు.

**రాజకీయాల్లోకి అబీ ఆగమనం:** పేదరికం, ఒక్కపూట తిండి, నేలపైనే పడక వంటి పరిస్థితుల్లో సహవాసం చేసి చదువులపై దృష్టి పెట్టిన అబీ మొదట రాజధాని అడిస్ అబాబాలో ఇథియోపియన్ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో డిగ్రీ పూర్తి చేసాడు. తరువాత నాయకత్వంలో మార్పు-పారదర్శకత అనే అంశంపై గ్రీన్‌విచ్ వర్శిటీ నుంచి పీజీ,తరువాత పీహెచ్‌డీ చేశారు. దేశంలో మార్క్సిస్ట్ లెనినిస్టు ప్రభుత్వం అణచివేతను నిరసిస్తూ తన అన్న చేపట్టిన ఉద్యమంలో చేరాడు. అబీ సోదరుడి మరణం తరువాత, ఓడీపీ బాధ్యతలు చేపట్టి ఎంపీగా ఎన్నికయ్యారు. దేశంలోని పరిస్థితులు, విభిన్న జాతుల సంఘర్షణలు, ఎరిత్రియాతో యుద్ధంపై అధ్యయనం చేసిన అబీ మొత్తానికి అధికారంలోకి రాగలిగారు. ప్రభుత్వంలోని దాదాపు అన్ని కీలక పదవుల్లోను, ప్రభుత్వ ఉద్యోగుల్లోను అత్యధికులు శక్తివంతమైన టిగ్రియాన్ తెగవారుండటం దేశంలో అసంతృప్తి ఉందన్న విషయాన్ని గుర్తించాడు. అయినా ఆ పార్టీతో కలసి సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామి అయినాడు. స్వతహాగా ఒరోమో (ముస్లిం) అయిన అబీ, అవ్హారా (క్రిస్టియన్) ఆచారాలు అనుసరించే అబీ, ఈ వర్గానికి చెందిన జినాష్‌ను వివాహం చేసుకున్నారు. తన సొంత భాష ఒరోమో, తన భార్య మాతృభాష అమ్హారాతోపాటు దేశంలో కీలక తెగలకు చెందిన అఫాన్, టిగ్రియానితోపాటు ఇంగ్లీష్‌పై పట్టు సాధించిన అబీ ఫిట్‌నెస్ నిపుణుడు. మానసిక, శారీరక ఆరోగ్యానికి ఫిట్‌నెస్ మంత్రం కీలకమని భావిస్తాడు. రాజకీయాల్లోకి రాక ముందు రక్షణశాఖలో కీలకమైన ఇంటెలిజెన్స్ విభాగంలో సైబర్ విభాగంలో బాధ్యతలు నిర్వహించాడు.

**సంచలన నిర్ణయాలు:** ఇథియోపియా నాల్గవ ప్రధానిగా 2018 ఏప్రిల్ 2న బాధ్యతలు చేపట్టిన అబి అహమ్మద్ అలీ, వచ్చీరాగానే ఎరిత్రియాతో సుదీర్ఘ యుద్ధానికి తెరదించేందుకు పావులు కదిపారు. సరిహద్దు వివాదంపై, హేగ్ ఇచ్చిన రూలింగ్‌ను విభేదించిన ఇరుదేశాలు యుద్ధానికి దిగిన విషయం తెలిసిందే. ఈ రెండు దేశాల సరిహద్దుల్లోని బద్మే నగరాన్ని ఎరిత్రియాకు ఇవ్వాలన్న రూలింగ్‌ను ఇథియోపియా ప్రభుత్వం విభేదించడంతో 1998లో యుద్ధం మొదలైంది. ఇరుదేశాలకు చెందిన వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. కొన్ని లక్షలమంది నిరాశ్రయులయ్యారు. ఈ పరిస్థితుల్లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అబీ అహమ్మద్, ఎరిత్రియాతో సంప్రదింపులకు వ్యక్తిగతంగా చొరవచూపారు. అనూహ్యంగా, మంత్రిమండలికి చెప్పకుండా అనేకసార్లు ఎరిత్రియాకు వెళ్లారు. ఆ దేశం కోరుతున్న బిడ్మే నగరం వారికి ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో రెండు దేశాల యుద్ధానికి తెరపడింది. అధికారం చేపట్టిన మూడునెలల్లోనే ఇదంతా జరిగిపోయింది. 2018 జూన్ 8,9 తేదీల్లో ఎరిత్రియా అధ్యక్షుడు ఇసాయియాస్ అఫె ఎలిక్కి, ఇథియోపియా ప్రధాని అబీ అహమ్మద్ ఒప్పందం చేసుకున్నారు. అబీ ప్రయత్నాలకు అటు ఐరాస, ఇటు ఎరిత్రియా సానుకూలంగా స్పందించడంతో సుదీర్ఘ యుద్ధం ముగిసి శాంతివీచికలు మొదలయ్యాయి. ఇథియోపియాకు పెద్ద సమస్య పరిష్కారమైనట్టయింది. ఇదే సమయంలో అబీ అతివేగంగా కొన్ని నిర్ణయాలు అమలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్బంధించిన అనేక మంది రాజకీయ, పౌరహక్కులను, పాత్రికేయులను విడుదల చేశారు. వారిలో కొందరికి ప్రభుత్వంలో కీలక బాధ్యతలు అప్పగించారు. వీరిలో కొందరు తమను, తమ పార్టీని విమర్శించేవారైనా ఆయన పట్టించుకోకుండా పదవులు కట్టబెట్టారు. డేనియల్ బెకెలే అనే రాజకీయ నేత ప్రఖ్యాత హ్యూమన్ రైట్స్ వాచ్ ఆఫ్రికా ప్రతినిధిగా వ్యవహరించేవారు. ఆయనను విడుదల చేసిన అబీ, జాతీయ మానవహక్కుల సంఘానికి సారథిగా నియమించారు. అలాగే 2005నుంచి జైలుపాలైన విపక్ష నేత బిర్టుకన్ మిడెక్సాను విడుదల చేసి జాతీయ ఎన్నికల సంఘానికి సారథిగా నియమించారు. అలాగే ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలకు ప్రాధాన్యం ఇస్తూ ఇథియోపియా - ఎరిత్రియా - సోమా లియా త్రైపాక్షిక కూటమిని ఏర్పాటు చేశారు. సరిహద్దులు సహా ఏ సమస్యనైనా పరస్పర సహకారంతో పరిష్కరిం చుకునేందుకు ఈ ఏర్పాటు చేశారు. అలాగే సమీప గల్ఫ్ దేశాలైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీలతో సంబం ధాలను మెరుగుపరిచారు. తోటి ఆఫ్రికా దేశాలైన సూడాన్, జిబౌటి, కెన్యా, ఇథియోపియాలతో మరో కూటమిని ఏర్పాటు చేశారు. తను బాధ్యతలు చేపట్టిన కొత్తల్లో సూడాన్ లో కొత్తగా ఏర్పడిన సైనిక ప్రభుత్వం దమనకాండలో 200 ఇథియోపియన్లు ప్రాణాలు కోల్పోయారు. దీంతో స్పందించిన అబీ, ఆ దేశంతో సంప్రదింపులు జరిపి శాంతికి బాటలు వేశారు. అబీ ప్రతీ అడుగు వెనుక సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మద్దతుగా నిలిచాయి. ఇక ఆర్థిక సంస్కరణల దిశగా అడుగులు వేయడం ప్రారంభించారు. 10 కోట్ల జనాభా ఉన్న ఇథియోపియాలో ఏటా 20 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం సిద్ధంగా ఉంటున్నారు. ఆఫ్రికాలో అత్యధిక జీడీపీ ఉన్న ఇథియోపియాలో టెలికం, లాజిస్టిక్ రంగాల్లో సంస్కర ణల దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. చైనా, గల్ఫ్ దేశాలు, ప్రపంచ బ్యాంక్ నుంచి పెద్దమొత్తంలో పెట్టుబడులు, రుణాల కోసం ప్రయత్నిస్తున్నారు. దేశ జనాభాలో 80 శాతంమంది పల్లెల్లోనే ఉంటున్నారు. రాజధాని అడిస్ అబాబా ఒక్కటే కాదు... ప్రతీ పల్లె అభివృద్ధి సాధిం చాలన్నది తన లక్ష్యం అంటున్న అబీముందు ఎన్నో సవాళ్లు కూడా ఉన్నాయి.

కేవలం ఏడాదిన్నరలో ఎవరూ ఊహించని విధంగా ఇథియోపియా ముఖచిత్రాన్ని అబీ మార్చేశారు. అంత మాత్రాన ముందున్నది పూలబాటే అనుకుంటే పొరపాటు. దేశీయంగా ఆయన కొన్ని సమస్యలను, విమర్శలను ఎదుర్కొంటున్నారు.

**విమర్శలు... సవాళ్లు:** మంత్రిమండలికి చెప్పకుండా కీలక నిర్ణయాలు తీసుకోవడం, మంత్రిత్వశాఖలకు తెలియకుండానే నిర్ణయాలు అమలు చేయడం అబీ తీరు. ఎరిత్రియాతో యుద్ధ విరమణ ఒప్పందం వంటి విషయాల్లో ఆయన పాటించిన గోప్యత అనూహ్యం. మంత్రులే కాదు, దేశంలో అత్యంత కీలక విభాగాలు, రక్షణ శాఖకు కూడా తెలియకుండా ఆయన కొన్ని పనులు చక్కబెట్టడంపై విమర్శలున్నాయి. అయితే ఆయన ఇవేమీ పట్టించుకోవడం లేదు. అబీ అహమ్మద్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టకముందు ఇథియోపియా జీడీపీ 8 శాతంకన్నా ఎక్కువగా ఉండేది. ఆయన వచ్చాక అది నెమ్మదించింది. చైనావంటి దేశాలతో రుణాలు ఎప్పటికైనా గుదిబండలేనన్న విమర్శలున్నాయి. సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న టీపీఎల్ఎఫ్ తీవ్ర అసంతృప్తితో ఉంది. తమ జాతిని, తమ పార్టీని లక్ష్యంగా చేసుకుని అబీ అహమ్మద్ నిర్ణయాలు తీసుకుంటున్నారన్నది ఆ పార్టీ ఆరోపణ. అందులో చాలావరకు నిజం ఉంది. దేశంలోని అన్ని కీలక, పలుకుబడి కలిగిన పదవుల్లో టిగ్రియాన్ జాతివారే ఉన్నారు. పాలన చక్కగా సాగాలంటే, ఈ అసమతుల్యత సరిచేయాలన్నది అబీ నమ్మకం. అధికారంలోకి వచ్చినప్పటినుంచి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ వర్గం వారిని ఎవరినీ పదవిలో ఉంచలేదు. నిర్దాక్షిణ్యంగా బయటకు పంపేశారు. దీంతో టీపీఎల్ఎఫ్ రగిలిపోతోంది. అయితే ప్రస్తుతం అటు దేశ ప్రజలు, ఇటు ప్రపంచ దేశాలు అబీ అహమ్మద్‌ను ఆకాశాని కెత్తుతుండడంతో టీపీఎల్ఎఫ్ నోరుమెదపడం లేదు. ముందు ముందు ఈ రెండు పార్టీల మధ్య సంబంధాలు ఎలా ఉంటాయోనన్నది ఇప్పుడు వేధిస్తున్న ప్రశ్న. ఎరిత్రియాతో యుద్ధం ముగిసినా అంతర్గతంగా శాంతిభద్రతలు భేషుగ్గా ఏమీ లేవు. వివిధజాతులు, వివిధ రాష్ట్రాల మధ్య ఇంకా ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. ఎరిత్రియాతో ఎడతెగని యుద్ధం, తెగలమధ్య పోరాటాల వల్ల దాదాపు 30 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ప్రపంచంలో ఈ స్థాయి పరిణామాలు మరెక్కడా లేవు. అంతర్రాష్ట్ర ఘర్షణల వల్ల కనీసం 10 లక్షల మంది నిలువ నీడలేకుండా పోయారు. ఈ పరిస్థితులను చక్కబెట్టడానికి ప్రధాని అబీ అహమ్మద్ ప్రత్యేకంగా శాంతి మంత్రిత్వశాఖను ఏర్పాటు చేశారు. ఇది దేశీయంగాను, విదేశాలతో శాంతికోసం ప్రయత్నం చేస్తుంది. ప్రధాని అబీ ఏడాదిన్నర పాలనపై స్థూలంగా చెప్పాలంటే ఆయన రచ్చ గెలిచారు. ఇంట గెలవాలి. విదేశాంగ విధానంలో అద్భుతంగా రాణించారు. దేశీయంగా పరిస్థితులు చక్కబెట్టాలి. ఆర్థిక, పారిశ్రామిక రంగాలలో సంస్కరణలకు బాటలు వేశారు. కానీ స్థూల జాతీయోత్పత్తి దిగజారిపోకుండా చూడాలి. ఇథి యోపియాలాంటి కల్లోలిత దేశంలో కేవలం ఆరేడునెలల్లో శాంతికుసుమాలు విరిసేలా చేసిన అబీ... ఇప్పుడు ఆ దేశ ప్రజలకు ఆరాధ్యుడు. శాంతిదూత. నోబెల్ శాంతి బహుమతి వచ్చింది అబీకి కాదు... ఇథియోపియాలో శాంతికి... క్రాంతికి.

-ఎస్.కె.రామానుజం

## ప్రభుత్వ విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు!



ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైసౌకర్యాలలేమితో ఉపాధ్యాయుల కొరతతో, అనేక పాఠశాలల్లో మౌలిక వసతులు లేక ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమౌతున్న తరుణంలో తెలంగాణ రాష్ట్రం సాధన ద్వారానే మన సమస్యలకు పరిష్కారం అభిస్తుందని రాష్ట్రంలో ప్రతి ఉపాధ్యాయుడు తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాటంలో పాల్గొన్నారు. 32 రోజులు వేతనాలను, ఉద్యోగాలను సైతం లెక్కచేయక సకలజనుల సమ్మె లో పాల్గొని దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన అతి పెద్ద ఉద్యో గరంగం, ఉపాధ్యాయ రంగం.

ఎన్నో పోరాటాల ఫలితంగా ఏర్పడ్డ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోను ఉపాధ్యాయ, విద్యారంగం సమస్యలు, సమస్యలు గానే మిగిలిపోవడం బాధాకరం. రాష్ట్రం ఏర్పడి 5 సంవత్సరాలు దాటినా పాఠశాల విద్య పటిష్టత కోసం ప్రభుత్వ తీసుకున్న చర్యలు నామమాత్రం.

ఉద్యమ సమయంలో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులతో సమానంగా వేతన స్కే ళ్లు, కేజీటు పీజీ ఉద్యోగుల్లో కాంట్రాక్టు విధానం రద్దు అన్ని ప్రభుత్వం పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం, రాష్ట్రం ఏర్పడ్డాక 2పేజీలలో సర్వీసు రూల్స్ రూపొందిస్తానన్న మాటలకు



విలువ లేకుండి పోయింది.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులే ముందుకొచ్చి ఆంగ్ల మాధ్యమాన్ని బోధిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచుకుంటుంటే, ఆపాఘశాలలకు అనుమతులు ఇచ్చే విషయంలో అధికారులు ఇబ్బందులకు గురి చేయడం శోచనీయం కేజీటుపీజీలోని కేజీ తరగతులు కేవలం ప్రైవేటు పాఠశాలలకే పరిమితమైనాయి. రాష్ట్రం ఏర్పడ్డాక తెరాస నియామకాలకు నోటిషికేషన్ ఇచ్చిన ప్రభుత్వం, ఇంకా ఇప్పటి వరకు ఎస్‌జీటీలకు పోస్టింగ్ ఇవ్వలేదు. మండలంలో పాఠశాలలను పర్యవేక్షణ చేజే మండంల విద్యాధికారి (యంఇఏ) పోస్టులు, ఉన్నత పాఠశాలల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్లు, ప్రైమరీ పాఠశాలల్లో ఎస్‌జీటీల కొరత ఉండడం ప్రభుత్వ విద్యారంగం పట్ల ఎంత నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తుందో అర్థం చేసువచ్చు. విద్యారంగ సమస్యలపై గత సంవత్సరం మే 16న ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమైన ప్రభుత్వం ఆ సందర్భంగా ఇచ్చిన హామీలలో ఏ ఒక్క హామీకూడా అమలుకు నోచుకోకపోవడం విచారకరం సుమారు 73 వేల మంది ప్రభుత్వంతో తెలంగాణలో అతిపెద్ద ఉపాధ్యాయ సంఘం, ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (పిఆర్‌టియుఎస్) వరంగల్‌లో జరిగే రాష్ట్ర 33వ కౌన్సిల్ సమావేశాలలో ప్రభుత్వ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను ఈ వేదిక ద్వారా ప్రభుత్వానికి తెలియజేయడం అవసరం 33 జిల్లాలలోని మండల, జిల్లా రాష్ట్ర బాధ్యులతోపాటు, ప్రాథమిక సభ్యులు సీనియర్ కార్యకర్తలు పాల్గొంటున్న ఈ కౌన్సిల్ సమావేశాలకు ముఖ్యఅతిథులుగా పిఆర్‌టియుఎస్‌యంఎల్‌సిలు, మాజీ ఎమ్మెల్సీలు హాజరవుతున్నారు. చట్ట సభలలో ఉన్న వీరి ద్వారా ప్రభుత్వానికి విద్యారంగ, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు ప్రభుత్వ పాఠశాల స్థితిగతులు తెలిచజేసే చక్కటి వేదిక ఈ కౌన్సిల్ సమావేశం ప్రతి రెండేళ్ళకోసారి జరిగే రాష్ట్రస్థాయి కౌన్సిల్ సమావేశా లలో 1వ రోజు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ ఉపాధ్యాయుల సమస్య లపై చర్చ, భవిష్యత్ కార్యాచరణపై తీర్మాణాలు, కార్యదర్శి నివేదిక, ఆర్థికనివేదిక చర్చ ఆమోదం రెండవ రోజు 2019-20,2020-2021 రెండు సంవత్సరాలకు రాష్ట్ర సంఘ ఎన్నికలు జరుగును.

ఎన్నో ఏళ్ళుగా పరిష్కారం కాని ఏకీకృత సర్వీసు రూల్స్కు సంబంధించిన అడ్డంకులు తొలగించి వెంటనే పదోన్నతుల షెడ్యూలు ప్రకటించాలి. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

2003 డీఎస్సీ ద్వారా నియామకమైన ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయాలి. పండిత్ పిఇటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేస్తూ ఇచ్చిన జీవో నెంబర్15ను వెంటనే అమలు చేయాలి. 398 వేతనంతో పని చేస్తున్న ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి. అంతర్ జిల్లాల బదలీలు చేపట్టాలి ప్రభుత్వ పాఠశాలలోని విద్యుత్ బిల్లులను ప్రత్యేక కేటగిరి క్రింద చేర్చాలి. పాత కరెంట్ బిల్లులు మాఫీ చేసి ఉచిత కరెంట్‌ను అందించాలి. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలి. హెల్త్ కార్డులు అందించాలి. ఖాళీలు భర్తీ చేయాలి. కేజీబీవి ఉపాధ్యాయులకు టైం స్కూలు వర్తింపచేయాలి. మెటర్నిటి లీవులు, మెడికల్ లీవుల మంజూరు చేయాలి. బదిలీలు చేపట్టాలి- ఎయిడెడ్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలి. హెల్త్కార్డులు ఇచ్చి 37।2005 యాక్ట్ రద్దు చేయాలి. 2015లొ వేసవి సెలవుల్లో మధ్యాహ్న భోజన విధులు నిర్వహించినుపాధ్యాయులకు పిపిఎల్ఎస్ మంజూరు చేయాలి. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమానికి అనుమతులు ఇస్తూ,3సం॥ల వయస్సు గత పిల్లలకు పాఠశాలలోల ప్రవేశం కల్పించాలి. ఐఇఆర్‌పిల వేతనాలు స్కూల్ అసిస్టెంట్ మూల వేతనంలో సమానంగా పెంచాలి. ఎంఆర్‌సీలలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్,సిఆర్‌పిలకు ఇతర సిబ్బందిగా వేతనాలు పెంచాలి ఉద్యోగ భద్రత కల్పించాలి. నూతనంగా ఏర్పడ్డ జిల్లాలకు 20శాతం హెచ్ఆర్ఏ మరియు ఇతర అలవెన్సులు ఇవ్వాలి. ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు58 సం॥రాల నుండి 60 సం॥లకు పెంచాలి. పిఆర్‌సీ నివేదికను తెప్పించుకొని జూన్2-2018 నుండి అమలయ్యే విధానంగా ఉత్తర్వులు ఇవ్వాలి. వేసవిలో నిర్వహించిన ఎన్నికల విధులకు పిపిఎల్ఎస్ మంజూరు మొదలైన డిమాండ్లతో రాష్ట్ర కౌన్సిల్ పక్షాన ప్రభుత్వానికి విన్నమించాలని సగటు ఉపాధ్యాయులు కోరుకుంటున్నారు.

- సామంతుల సదానందం
9866136491

## పొదుపుపై వ్యాసరచన పోటీలు



మరోసారి ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమాంద్యం ఏర్పడింది. ఒకనాడు భూతల స్వర్గంలా ఓ వెలుగు వెలిగిన అమెరికా సైతం నేడు ఆర్థికమాంద్యం దెబ్బకు రకరకాలుగా ఉక్కిరిబిక్కిరవుతున్నది. వెనుకబడిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు, చిన్నా-చితకా దేశాల పరిస్థితి మరింత భయంకరంగా తయారైంది. ఈ ఆర్థికమాంద్యపు ఛాయలు మన భారతదేశం మీద కూడా స్పష్టంగా కనబడుతున్నాయి. ఇందులో భాగంగానే దేశవ్యాప్తంగా కాఫీ కింగ్‌గా, బలమైన ఆర్థిక దిగ్గజంగా కొనసాగిన కెఫే కాఫీ డే అధినేత వి.జి.సిద్ధార్థ ఆత్మాభిమానం చంపుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇలాంటి ఎన్నోరకాల ఉదాహరణలు ఉన్నాయి. అందుకే ఈ నేపథ్యంలో నేటి ఆర్థిక సంక్షోభం నుంచే కాకుండా భవిష్యత్తులో అనేక సవాళ్లను తట్టుకోవడానికి పొదుపే శరణ్యం అనేమాట అందరి నోట వినబడుతున్నది. అందుకే... 'ప్రపంచం చూపు- పొదుపు వైపు' అంశం మీద రెండు తెలుగు రాష్ట్రాలలో ముద్ర వ్యవసాయ నైపుణ్యాభివృద్ధి బహుళార్థ సహకార సంఘం (ముద్ర అగ్రికల్చర్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్) ఆధ్వర్యంలో 'భారత జాతీయ సహకార సంస్థల సమాఖ్య' (నేషనల్ కో-ఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా) సహకారంతో విద్యార్థినీ విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ భాషలలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నాము. విజేతలైన ఆరుగురికి జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా వచ్చే నెల 14వ తేదీన ఢిల్లీలో ఎన్.సీ.యు.ఐ క్యాంపస్‌నందు ఏర్పాటుచేస్తున్న కార్యక్రమంలో నగదు బహుమతులు అందజేస్తున్నాము. బహుమతుల వివరాలుః డిగ్రీ స్థాయి విద్యార్థులకు 10వేలు, ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులకు8వేలు, హైస్కూల్ స్థాయి విద్యార్థులకు 5వేలు ఇవ్వాలని నిర్ణయించడమైనది. వీరిలో తెలంగాణ నుంచి ముగ్గురిని, ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురిని ఎంపిక చేస్తున్నాము. నియమాలు- నిబంధనలుః - పోటీలో పాల్గొనేవారు పైన చెప్పిన అంశాన్ని తెలుగులో లేదా ఇంగ్లీష్‌లో ఏదో ఒక భాషలో రాయవచ్చు. హైస్కూల్ విద్యార్థులకు సంబంధించి కేవలం 10వ తరగతి విద్యార్థులు మాత్రమే పోటీలో పాల్గొనాలి. డిగ్రీ విద్యార్థులు చేతితో తెలుగులో రాసేవారు ఎ4 పేజీలో 4 పేజీల వరకు రాయాలి. కంప్యూటర్ డిటిపిలో అయితే 4 పేజీల వరకు వుండాలి. చేతితో ఇంగ్లీషులో రాసేవారు ఎ4 పేజీలో 4 పేజీల వరకు రాయాలి. కంప్యూటర్ డిటిపి అయితే 3 పేజీల వరకు వుండాలి. ఇంటర్మీడియట్ విద్యార్థులు తెలుగులో చేతితో రాసేవారు ఎ4 పేజీల్లో 4 పేజీల వరకు రాయాలి. కంప్యూటర్ డిటిపి అయితే 3 పేజీల వరకు వుండాలి. చేతితో ఇంగ్లీష్‌లో రాసేవారు ఎ4 పేజీలో 3 పేజీలు, డిటిపి అయితే 2 పేజీల వరకు వుండాలి. పదవ తరగతి విద్యార్థులు తెలుగులో చేతితో రాసేవారు ఎ4 పేజీలో 3 పేజీలు, డిటిపి అయితే 2 పేజీలు పంపాలి. చేతితో ఇంగ్లీష్‌లో రాసేవారు ఎ4లో 2 పేజీలు, డిటిపి అయితే 1 1/2 పేజీ వుండాలి. ఆయా విద్యార్థులు వారివారి స్కూల్, కాలేజీల హెడ్‌మాస్టర్లు, ప్రిన్సిపాల్స్ ద్వారా వ్యాసం చివరిలో ధృవీకరిస్తూ సంతకం చేయించాలి. సంతకం కింద విద్యాసంస్థల అధినేతల మొబైల్ నెంబర్ తప్పనిసరిగా పొందుపరచాలి.

విద్యార్థుల చిరునామా వ్యాసం చివరలో స్పష్టంగా తండ్రి పేరు, పిన్‌కోడ్‌తో సహా తెలియజేయాలి. మొబైల్ నెంబర్, మెయిల్ ఐ.డి.లు కూడా పొందుపరచాలి. పంపవలసిన చిరునామా వ్యాసాలను ఈమెయిల్ః ఇన్ఫోఅ ఎంఎఎస్ డిఎంఎస్ సిఎస్ .కామ్ కు మెయిల్ చేయవచ్చు. లేదా చైర్మన్, ముద్ర అగ్రికల్చర్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీస్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, రాఘవేంద్ర స్వామి మఠం వద్ద, హైదరాబాద్, 15-ఏ 3-4-757 15/ ఏ చిరునామాకు కొరియర్ ద్వారా, పోస్టల్ ద్వారా కూడా పంపించవచ్చు.ఎంపికైనవారికి వారివారి స్వస్థలం నుండి ఢిల్లీకి రాను-పోను రైలు ఛార్జీలు ఇవ్వడమేకాక ఢిల్లీలో ఎన్.సీ. యు.ఐ క్యాంపస్‌నందు వసతి, భోజనం ఏర్పాట్లు మేమే చేయగలం. వచ్చేనెల ఐదారు తేదీల్లో విజేతల వివరాలు తెలియజేయగలం.

- తిప్పినేని రామదాసప్పనాయుడు
చైర్మన్, ముద్ర వ్యవసాయ, నైపుణ్యాభివృద్ధి బహుళార్థ సహ కార సంఘం, 9989818212

# ఉగ్రదాడికి కుట్ర!

• ఎల్‌ఓసీ వెంట 500 మంది మిలిటెంట్లు • పాకిస్తాన్ ఆర్మీ ఆధ్వర్యంలో శిక్షణ • జమ్మూలో 200కిపైగా ఉగ్రవాదులు • హింస సృష్టించేందుకు కుట్ర • భారత్ ఆర్మీ ఉన్నతాధికారి వెల్లడి

**న్యూఢిల్లీ :** ఆర్టికల్ 370 రద్దు తరువాత భారత్, పాకిస్తాన్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ సరిహద్దు ఎల్‌ఓసీ వెంట సుమారు 500 మంది ఉగ్రవాదులు భారత్‌లో చొరబడేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఓ ఆర్మీ సీనియర్ అధికారి తెలిపాడు. వీరంతా పాకిస్తాన్ ఆర్మీ అధికారుల సమక్షంలోనే ఉగ్రవాదంలో శిక్షణ పొంది ఉన్నారని వివరించారు. ఎల్‌ఓసీ వెంట పదుల సంఖ్యలో మిలిటెంట్ల శిక్షణా శిబిరాలు ఉన్నాయని తెలిపారు. మరో 200 నుంచి 300 మంది ఉగ్రవాదులు కాశ్మీర్‌లో ఉండి పాకిస్తాన్ సహకారంతో హింసా కాండ సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆయన వివరించారు. మిలిటెంట్ల వద్ద ఆయుధాల కొరత ఏర్పడిందన్నారు. అందుకే వారు పోలీస్ స్టేషన్‌లను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడి అక్కడున్న ఆయుధాలు ఎత్తుకెళ్లేందుకు కుట్ర పన్నుతున్నారని తెలిపారు. నార్తర్న్ కమాండ్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రణబీర్ సింగ్ మాట్లాడుతూ.. బయటి నుంచి జమ్మూ కాశ్మీర్‌లోకి చొరబడిన 200-300 ఉగ్రవాదులు తమ పనిలో నిమగ్నమై ఉన్నారని, భారత సరిహద్దు దళాల కళ్లుగప్పి జమ్మూలో చొరబడేందుకు మరో 500 ఉగ్రవాదులు డేరాలు వేసుకుని కాపుకాచుకొని కూర్చున్నారని వివరించారు. శిక్షణ షెడ్యూల్ ప్రకారం.. ఉగ్రవాదుల సంఖ్య పెరుగుతూ ఉంటుందని తెలిపారు. ఎంత మంది ఉన్నా.. జమ్మూతో పాటు భారత్‌లో ఎలాంటి దాడులు జరగకుండా చూసుకునే బాధ్యత తమపై ఉందన్నారు. కానీ భారత్‌లో అశాంతి సృష్టించేందుకు పాకిస్తాన్ ప్రయత్నిస్తూనే ఉందని వివరించారు. ఇప్పటికీ పాకిస్తాన్‌లో ఉగ్రవాద శిబిరాలు కొనసాగుతున్నాయన్నారు. లాంచింగ్ ప్యాడ్‌లు కూడా ఇందులో ఉన్నాయని తెలిపారు. పాకిస్తాన్ ఇప్పటికీ ఉగ్రవా దులకు ఆర్మీలాగే అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూనే ఉందని వివరించారు. డ్రోన్ల ద్వారా పరిస్థితులు తెలుసుకునేందుకు పాకిస్తాన్ ప్రయత్నిస్తోందన్నారు. ఇది వారి ఆపరేషన్‌లో ఒకటన్నారు. పాకిస్తాన్ ఎంత రెచ్చగొట్టినా.. ఎంత ప్రయత్నించినా.. భారత్ జవాన్లు ధీటుగానే సమాధానం ఇస్తారని తెలిపారు.



## పాకిస్తాన్‌పై భారత్ గుస్సా

జమ్మూ కాశ్మీర్‌లో చిన్నారుల పరిస్థితి దారుణంగా ఉందని, యువతను ఉగ్రవాదంవైపు మళ్లేలా భారత్ చర్యలు ఉన్నాయని పాకిస్తాన్ ఆరోపణలపై ఐక్యరాజ్య సమితి మూడో అసెంబ్లీ కమిటీ సెషన్‌లో భారత్ ధీటుగా స్పందించింది. 'పిల్లల హక్కులు.. ప్రోత్సాహం.. రక్షణ' అనే అంశంపై జరిగిన సదస్సులో ఐక్యరాజ్య సమితిలో భారత శాశ్వత తొలి కార్యదర్శి పౌలామీ త్రిపాఠి మాట్లాడారు. పాకిస్తాన్ పేరు ప్రస్తావించకుండా విమర్శలు గుప్పించారు. "ఓ ప్రతినిధి బృందం మరోసారి కమిటీ దృష్టిని మరల్చేందుకు తప్పుడు వార్తలు సృష్టిస్తోంది. మోసపూరిత రాజకీయాలకు దిగుతోంది. ఓ దేశ అంతర్గత విషయాలను ప్రస్తావిస్తూ అనవసరమైన సూచనలు చేస్తోంది" అంటూ విమర్శించారు. పాకిస్తాన్ రాయబారి మలీహా లోధిపై పరోక్షంగా త్రిపాఠి ధ్వజమెత్తారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత జమ్మూలో హక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ మలీహ చెప్పుకొచ్చాడు. దీనిపై ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల హైకమిషనర్ నివేదిక ఇచ్చాడు.

# జాతీయ పార్టీలకు... ప్రాంతీయ పార్టీల షాక్!

• మహారాష్ట్రలో భారీ ఓట్ల చీలిక!
• సీట్ల సర్దుబాటులో విభేధాలు
• భవిష్యత్ రాజకీయాలపై ఫికర్
• ఒంటరిగానే పోటీకి స్థానిక పార్టీల సై
• బీజేపీ, సేనకూ తప్పని ఎదురుదెబ్బ




**ముంబై :** మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అధికార పార్టీ బీజేపీ, మిత్రపక్షం శివసేనతో కలిసి కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో చిన్న పార్టీలు కూడా ఈ కూటమిలో భాగస్వాములయ్యాయి. కొన్ని పార్టీలు మాత్రం ఒంటరిగానే పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నాయి. సీట్ల పంపకాలు, అధికారంలోకి వచ్చాక తగిన ప్రాధాన్యత ఇస్తారా..? లేదా..? నిరాశపరిస్తే తమ భవిష్యత్తు ఎలా ఉంటుందో అన్న సందేహంతో కొన్ని స్థానిక పార్టీలు విడిగానే పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. బీజేపీ, శివసేన కూటమిలో కేంద్ర మంత్రి రాందాస్ అఠావలే పార్టీ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ), వినాయక్ నేతృత్వంలోని శివ సంగ్రామ్, మహదేవ్ జన్కర్ నేతృత్వంలోని రాష్ట్రీయ సమాజ్ పక్ష, సద్భావు ఖోట్ నేతృత్వం వహిస్తున్న రాయత్ క్రాంతి సంఘటన్‌లు భాగస్వాములుగా ఉన్నాయి. ఆర్‌పీఐ బీజేపీ నీడలో పోటీ చేయదనే వార్తలు వినిపించాయి. చివరి నిమిషంలో సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ రంగంలోకి దిగడంతో కూటమిలో భాగస్వామిగా అంగీకరించింది. ఆర్‌పీఐ (ఏ) మాత్రం కూటమితో కలిసి పోటీ చేసేందుకు గతం నుంచే ఎంతో ఆసక్తి చూపింది. ఓట్ల చీలిక నివారించేందుకు కమలంతో జత కట్టి.. నామినేషన్లు కూడా దాఖలు చేసింది.

### ఆది నుంచి బీజేపీ వైపే ఆర్‌పీఐ (ఏ)

ఫల్తాన్ నియోజకవర్గం నుంచి జైలు శిక్ష అనుభవిస్తున్న మాఫియా డాన్ ఛోటా రాజన్ నిఖల్జె సోదరుడు దీపక్ నిఖల్జేతో సహా దాదాపు 8 మంది అభ్యర్థుల జాబితాను బీజేపీ తొలగించి వేరే వారిని ఎంపిక చేసింది. అఠావలే ఇప్పుడు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 2020లో పదవీ కాలం పూర్తవుతుంది. బీజేపీ సహకారం లేకుండా ఎగువ సభకు ఎన్నికయ్యే అవకాశం లేదు. అదేవిధంగా కేబినెట్‌లో స్థానం కూడా వచ్చే ఛాన్స్ లేదు. అందుకే కమలం నీడన పోటీ చేసేందుకు అఠావలే నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. సీట్ల పంపిణీలో అన్యాయం జరిగిందంటూ రాష్ట్రీయ సమాజ్ పక్ష్ (ఆర్ఎస్‌పీ) బహిరంగంగానే విమర్శలు గుప్పించింది. బీజేపీ తనను మోసం చేసిందని పార్టీ చీఫ్ జమహదేవ్ జన్కర్ నిందించారు. ముగ్గురి అభ్యర్థుల్లో ఇద్దరిని తొలగించి వారి స్థానంలో దౌండ్ నుంచి రాహుల్ కుల్, జింతూర్ నుంచి మేఘనా బోర్డికర్‌ను దింపినట్టు విమర్శించారు. కేవలం ఒక నియోజకవర్గం గంగాఖేడ్ నుంచి రత్నాకర్ గుట్టే పోటీ చేస్తున్నాడని వివరించారు.

### మహా-అఘాదికీ ఎదురుదెబ్బ

ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్, ఎన్‌సీపీకి కూడా ఇలాంటి ఎదురుదెబ్బే తగిలింది. సమాజ్‌వాది పార్టీ ఝలక్ ఇచ్చింది. ఆ తరువాత పీపుల్స్ రిపబ్లిక్ పార్టీ, సీపీఐ(ఎం), సీపీఐ, స్వాభిమాన్ షేత్కార్ సంఘటన్‌తో పాటు మరికొన్ని చిన్న పార్టీలు హ్యాండ్ ఇచ్చాయి. 288 నియోజకవర్గాల్లో తాము 50 సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్, ఎన్‌సీపీని కోరితే కేవలం మూడు మాత్రమే కేటాయిస్తామని చెప్పిందని ఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు అబు అసీమ్ అజ్మీ తెలిపారు. వాటిలో మంక్రుద్, శివాజీనగర్ నుంచి అజ్మీయే నిల్చున్నాడు. భివండీ ఈస్ట్‌లో కాంగ్రెస్ ఓ అభ్యర్థిని నిలబెట్టింది. ఔరంగాబాద్‌లో ఎస్‌పీ అభ్యర్థిని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది.

కాంగ్రెస్-ఎన్‌సీపీ (మహా అఘాది) సీపీఐ(ఎం)తో పొత్తుకు పెట్టుకునేందుకు ప్రయత్నించింది. కానీ తరువాత సోలాపూర్ సౌత్ సెంట్రల్ నుంచి సీనియర్ కమ్యూనిస్టు నేత నర్సయ్య అడమ్ను బరిలోకి దిగడంతో కాంగ్రెస్ సీనియర్ నేత సుశీల్ కుమార్ షిండే కమార్తె ప్రణతి షిండేను మహా అఘాది పోటీకి నిలిపింది. మహా అఘాదిలో భాగంగా తాము 7 మంది అభ్యర్థులను స్నేహ పూర్వక పోటీకి నిలిపామని, తాము కోరిన సీట్లు ఇవ్వలేదని ఆ పార్టీ రాష్ట్ర ప్రతినిధి పీఎస్ ప్రసాద్ తెలిపారు. ఖమ్మగావ్‌లో తమ అనుమతి లేకుండా శెట్టి అభ్యర్థికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందని, దీంతో మరింత దూరం ఏర్పడిందన్నారు.

### మజ్లిస్ నుంచి బహుజన్ అగాధి దూరం

ప్రకాష్ అంబేద్కర్ నేతృత్వంలోని వంచిత్ బహుజన్ అగాధి చిన్న మిత్రుడు అయిన ఆలిండియా మజ్లిస్ ఏ ఇత్తే హాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) కూడా అసంతృప్తిలో ఉంది. 100 స్థానాలు కోరగా.. కేవలం 8 స్థానాలు మాత్రమే కేటాయించడంతో కూటమి నుంచి వైదొలిగింది. ప్రస్తుతం ఏఐఎంఐఎం 44 స్థానాల్లో స్వతంత్రంగా పోటీ చేస్తున్నదని, పార్టీ చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ రాష్ట్రంలో ప్రచారానికి వస్తారని ప్రతినిధి వివరించాడు. కొన్ని స్థానాల్లో అనధికారికంగా కాంగ్రెస్, ఎన్‌సీపీతో పొత్తు పెట్టుకున్నాయి. కాంగ్రెస్‌లో ఎన్‌సీపీని విలీనం చేయాలన్న షిండే వ్యాఖ్యలపై ఆ పార్టీ చీఫ్ శరద్ పవార్, మాజీ డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు.


**దక్షిణ మధ్య రైల్వే**
మమ్మల్ని అనుసరించండి @SCRailwayIndia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల యొక్క వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

**ఇ-టెండరు నెం. బి/ఎస్‌జి/సివిఎన్/ ఎస్ & టి/ 9/ 2019-20 తేది: 10-10-2019 (ireps.gov.in ద్వారా)**

భారత రాష్ట్రపతి తరపున సిగ్నల్ & టెలికాం(నిర్మాణం) దక్షిణ మధ్య రైల్వే విజయవాడ వారు దిగువ తెలిపిన పనుల కొరకు టెండరింగ్ విధానం యొక్క ఓపెన్ టెండరు /సింగిల్ ప్యాకెట్ సిస్టంలో ఇ-టెండరును ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం. 1 **టెండరు నెం:** బి/ఎస్‌జి/సివిఎన్/ ఎస్ & టి/9/ 2019-20 తేది: 10-10-2019. **పని యొక్క వివరం:** జిఎన్‌టి-జిటిఎల్ డబ్లింగ్ పనితో సంబంధించి దక్షిణ మధ్య రైల్వే, జిఎన్‌టి డివిజన్ యొక్క దొనకొండ, గజ్జలకొండ మార్కాపూర్ రోడ్ & తర్లుపాడు స్టేషన్ల వద్ద సెంట్రలైజ్డ్ ఇంటర్ లాకింగ్‌తో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టం హాట్ స్టాండ్‌బై ఆర్కిటెక్చర్ యొక్క డిజైన్, సరఫరా, స్థాపన మరియు పనిచేయించుట. **టెండరు విలువ (₹)**: 6,08,49,600.08, **ఇఎండి(₹):** 4,54,300/-, **పూర్తిచేయు కాలం:** తొమ్మిది నెలలు, **టెండరు ఫారం ధర (₹):** 10,000/-, **ముగింపు తేది & సమయం:** 04-11-2019న 15.00గం.ల వద్ద.

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలు కొరకు వెబ్‌సైట్ http://ireps.gov.in నకు దయచేసి లాగిన్ కండి.
2. బయానాసొమ్ము ధరావతు మరియు టెండరు డాక్యుమెంట్ ధరను నెట్ బ్యాంకింగ్ / ఐఆర్ఇపిఎస్ లో ఆన్‌లైన్‌లో అందుబాటులోగల పేమెంట్ గేట్‌వే సదుపాయాల ద్వారా మాత్రమే చేయవలెను.
3. టెండరుదారులు వారి ఆఫర్లను టెండరు ముగింపు కాల వ్యవధి అయిన 15 రోజుల టెండరు సమర్పించు/బిడ్డింగ్ కాల వ్యవధి సమయంలో ఆన్‌లైన్‌లో సమర్పించవలెను.
4. టెండరుదారులు ఏవేని సవరణ కొరకు (ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీ చేయబడును) టెండరు సమర్పించు / బిడ్డింగ్ కాల వ్యవధి యొక్క ప్రారంభ తేదీ వరకు గమనించవలెను.

**డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, (సి), విజయవాడ**

PUB/1192

**ఇ-టెండరు ప్రకటన నెం. డిఆర్‌ఎం/పనులు/ బిజడ్ఎ/23/2019 తేది: 10-10-2019**

భారత రాష్ట్రపతి తరపున మరియు కొరకు దిగువ సంతకందారు దిగువ తెలిపిన పనుల కొరకు ఒక్కొక్క దాని ఎదురుగా సూచించిన తేదీన 15.00గం.ల వరకు ఇ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం. 1 **టెండరు నెం:** ఇ-23-సెంట్రల్- 2019 **పని యొక్క పేరు:** విజయవాడ డివిజన్: డిఇఎన్/ సెంట్రల్/బిజడ్ఎ పరిధిలో 2 సంవత్సరాల కాలవ్యవధి కొరకు ఎస్‌ఎస్‌ఇ/పి-వే/నూజివీడు, ఏలూరు, తెనాలి, బాపట్ల & చీరాల సెక్షన్‌ల క్రింద ట్రాక్ నిర్వహణ పనుల కొరకు మల్టీ యుటిలిటీ వాహనం అద్దెకు మరియు పనిచేయించుటకు. **టెండరు విలువ (₹)** : 32,06,902/-, **ఇ.ఎం.డి(₹):** 64,100/-, **పూర్తిచేయు కాలం:** 24 (ఇరవై నాలుగు) నెలలు, **టెండరు డాక్యుమెంట్ ధర (₹):** 3,000/-, **ముగింపు తేది :** 12-11-2019

క్ర.సం. 2 **టెండరు నెం:** ఇ-24-సెంట్రల్- 2019 **పని యొక్క పేరు:** విజయవాడ -విశాఖపట్నం సెక్షన్- డిఇఎన్/ సెంట్రల్/బిజడ్ఎ పరిధిలో ఎస్ఎస్ఇ లు/పనులు/ బాపట్ల, తెనాలి మరియు ఏలూరు సెక్షన్‌లలో నైపుణ్యం కలిగిన కళాకారుల సిబ్బంది యొక్క నియామకం. **టెండరు విలువ (₹)** 13,76,989/-, **ఇ.ఎం.డి(₹):** 27,500/-, **పూర్తిచేయు కాలం:** 12(పన్నెండు) నెలలు, **టెండరు డాక్యుమెంట్ ధర** (₹): 2,000/-, **ముగింపు తేది :** 12-11-2019

క్ర.సం. 3 **టెండరు నెం:** ఇ-20-నార్త్- 2019 **పని యొక్క పేరు:** విజయవాడ -విశాఖపట్నం సెక్షన్- 12 నెలల కాలవ్యవధి కొరకు సీనియర్ డిఇఎన్/నార్త్/బిజడ్ఎ పరిధిలో ఎస్ఎస్ఇ లు/పనులు/రాజమండ్రి, నిడదవోలు, సామర్లకోట, తుని సెక్షన్‌లలో నైపుణ్యం కలిగిన కళాకారుల సిబ్బంది యొక్క నియామకం. **టెండరు విలువ (₹)** : 32,89,614/-, **ఇ.ఎం.డి(₹):** 65,800/-, **పూర్తిచేయు కాలం:** 12 (పన్నెండు) నెలలు, **టెండరు డాక్యుమెంట్ ధర** (₹): 3,000/-, **ముగింపు తేది :** 15-11-2019

క్ర.సం. 4 **టెండరు నెం:** ఇ-05-టిఎం- 2019 **పని యొక్క పేరు:** విజయవాడ డివిజన్- ఇరవై నాలుగు (24) నెలలు కాలవ్యవధి కొరకు ఆర్‌జిఎం(రైల్ గ్రైండింగ్ మెషిన్)తో సంబంధించి ట్రాక్ మెషిన్ ఆర్గనైజేషన్ యొక్క వినియోగం కొరకు రైల్వే అధికారుల వినియోగం కొరకు 12 సీట్ల వాహనం అద్దెకు ప్రతిపాదన. **టెండరు విలువ(₹)** 14,49,768/-, **ఇ.ఎం.డి(₹):** 29,000/-, **పూర్తిచేయు కాలం:** 24 (ఇరవై నాలుగు) నెలలు, **టెండరు డాక్యుమెంట్ ధర** (₹): 2,000/-, **ముగింపు తేది** 08-11-2019

క్ర.సం. 5 **టెండరు నెం:** ఇ-06-టిఎం- 2019 **పని యొక్క పేరు:** విజయవాడ డివిజన్- ఇరవై నాలుగు (24) నెలలు కాలవ్యవధి కొరకు ట్రాక్ మెషిన్ ఆర్గనైజేషన్ (ఆర్‌జిఎం కొరకు) యొక్క వినియోగం కొరకు రైల్వే మెటీరియల్స్ యొక్క రవాణా వినియోగం కొరకు 6 టన్నుల సామర్థ్యం గల రోడ్డు ట్రక్కు అద్దెకు ప్రతిపాదన. **టెండరు విలువ(₹):** 13,23,312/-, **ఇ.ఎం.డి(₹):** 26,500/-, **పూర్తిచేయు కాలం:** 24 (ఇరవై నాలుగు) నెలలు, **టెండరు డాక్యుమెంట్ ధర** (₹): 2,000/-, **ముగింపు తేది :** 08-11-2019

ఆసక్తిగల టెండరుదారులు ఏదేని టెండరు కొరకు ఏవేని మార్పులు /సవరణ గమనించుటకు టెండరు ముగింపు తేదీకి ముందు వెబ్‌సైట్ www.ireps.gov.in దర్శించవలసినదిగా సలహా ఇవ్వడమైనది.

**డివిజనల్ రైల్వే మేనేజర్ (పనులు), విజయవాడ**

A1650 PUB/1193

తదుపరి టెండరు షరతులు/వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దయచేసి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways. gov.in వద్ద దర్శించండి.


# నాయర్ ప్రచారమే వేరు!

• తలపై బూటుతో బీజేపీ నేత క్యాంపెయిన్



**పాల్వాల్ (హర్యానా) :** హర్యానా, పాల్వాల్ జిల్లా హోడల్ (రిజర్వ్) నియోజకవర్గం నుంచి జగదీష్‌నాయర్ బీజేపీ తరపున పోటీ చేస్తున్నారు. ఆయన తలపై బూటు ఉంచుకుని ప్రచారంలో పాల్గొంటున్నారు. దీనికి ఓ కారణం ఉంది. జగదీష్‌పై కొన్ని వర్గాలు ఎంతో ఆగ్రహంగా ఉన్నాయి. వారిని శాంతింపజేయడానికి ఈ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టినట్టు తెలుస్తోంది. ఔరంగాబాద్‌తో పాటు ఏ గ్రామంలో కూడా నివసించే వారికి తాను వ్యతిరేకంగా మాట్లాడలేదని, వీటిపై వస్తున్న వార్తలను ఖండిస్తున్నట్టు నాయర్ చెప్పుకొచ్చాడు. ఒకవేళ తాను గెలిస్తే.. అందరికీ పాలేరులా ఉండి పని చేస్తానని వివరించడానికే తలపై బూటుతో ప్రచారం చేస్తున్నట్టు వివరించాడు. నాయర్ డ్రామాలు చేస్తున్నారని, ఓట్లు దండుకోవడానికి ఇది ఓ ఎత్తుగడ అంటూ కాంగ్రెస్ అభ్యర్థి ఉదయ్ భాన్ విమర్శించారు. చాలా వర్గాలు నాయర్‌కు వ్యతిరేకంగా ఉన్నాయన తెలిపాడు.

# కాంగ్రెస్ పరువు తీస్తోంది!

• విదేశాల్లో జమ్మూ అంశంపై చర్చా? • ఎన్నికల ర్యాలీలో రాహుల్‌పై అమిత్‌షా ఫైర్



**బుల్డానా (మహారాష్ట్ర) :** జమ్మూ కాశ్మీర్ విషయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ మరోసారి కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. జమ్మూ కాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు లేవని బ్రిటీష్ ప్రతిపక్ష లేబర్ పార్టీ నేత జెర్మీ కార్బైన్ ట్వీట్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓవర్సీస్ కాంగ్రెస్ చీఫ్ కమల్ ధలివాల్ జమ్మూ కాశ్మీర్ విషయంలో నిర్వహించిన సమావేశానికి నేతృత్వం వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అమిత్‌షా మాట్లాడుతూ.. కాశ్మీర్ పరిస్థితులు బాగా లేవని జెర్మీ కార్బైన్‌ను రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడైన కమల్ కలిసి అన్నారని, దేశ అంతర్గత విషయాలు విదేశీ నేతలతో కలిసి చర్చించడం ఏంటని, రాహుల్ అసలు ఏం కోరుకుంటున్నారని ప్రశ్నించారు. కాశ్మీర్ భారత్ అంతర్గత భాగమని, ఇందులో మధ్యవర్తిత్వం అవసరం లేదని ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో అన్నారని గుర్తు చేశారు. పార్టీ ముందు నుంచే ఈ విషయంలో ఒకే మాటపై ఉందని, ఎవరైనా విదేశీ నేతలు కాశ్మీర్ సమస్య గురించి ప్రస్తావిస్తే... అది భారత్ అంతర్గత విషయమని చెప్పాలని, అది ట్రంప్ అయినా సరే అని చెప్పుకొచ్చారు. విదేశాల్లో భారతదేశ ప్రతిష్ట మసకబారేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. భారత్ నుంచి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేతలు యూకే ప్రతినిధులతో సమావేశం అయ్యారని, కాశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలపై చర్చించామని కమల్ ట్వీట్ చేయడంపై అమిత్‌షా ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రైతులు, మహిళలకు వరాలు!

• హర్యానా కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

**హర్యానా :** రైతులు, మహిళా ఓటర్లను ఆకర్శించేలా ప్రతిపక్షపార్టీ కాంగ్రెస్ శుక్రవారం మేనిఫెస్టోను విడుదల చేసింది. వారి కోసం వినూత్న పథకాలు, కార్యక్రమాలను ప్రకటించింది. మూక దాడులు అరికట్టేందుకు బలమైన చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చింది. అన్నీ ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పుకొచ్చింది. అధికారంలోకి వచ్చిన 24 గంటల్లో రైతుల రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించింది. భూమిలేని రైతులను ఆదుకుంటామని వివరించింది. 2 ఎకరాలు వరకు సాగు చేస్తున్న రైతులకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని, విపత్తు సంభవించినా.. కరువు వచ్చినా.. ఒక్కో ఎకరానికి రూ.12,000 నష్టపరిహారం అందజేస్తామని వివరించింది. 22 పేజీల మేనిఫెస్టోను మాజీ కేంద్ర మంత్రి గులాం నబీ ఆజాద్, రాష్ట్ర అధ్యక్షుడు కుమారి సెల్జా, హుడా విడుదల చేశారు. పంచాయతీ రాజ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఇస్తామని, వికలాంగులు, వితంతువులు, పెళ్లికాని మహిళలకు నెలకు రూ.5,100 ఇస్తామని ప్రకటించారు. 1 నుంచి 10వ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ బీసీ విద్యార్థులకు ఏడాదికి రూ.12,000, 11, 12వ తరగతి వారికి రూ.15,000 స్కాలర్‌షిప్ ఇస్తామని వివరించారు.


**BKV INDUSTRIES LIMITED** "and reduced"
CIN: L05005AP1993PLC015304
Regd. Office: Bommidala House, D.No. 5-87-15/A, Lakshmipuram Main Road, GUNTUR-522007. Andhra Pradesh, India.
Ph : 91-863-2355108 & Fax: 91-863-2358453
E-mail: bkvind@bommidala.co.in
Website : bkvindustries.in

**BOARD MEETING NOTICE**

Notice is hereby given pursuant to Regulations 29 (1) (a) and 47 (1) (a) of the SEBI (LODR) Regulations and Uniform Listing Agreement entered with Stock Exchanges that a meeting no. 3/2019-20 of the Board of Directors of the Company will be held on Wednesday the 13th November 2019 at 03.30 P.M at the Registered Office of the Company to approve and take on record the Unaudited Financial Results for the Second Quarter ended 30th September, 2019

GUNTUR 11-10-2019
For BKV INDUSTRIES LIMITED
Sd/- B. Virat Vishnu
Company Secretary & Compliance Officer



**దక్షిణ మధ్య రైల్వే**
మమ్మల్ని అనుసరించండి @SCRailwayIndia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల యొక్క వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

**టెండరు ప్రకటన నెం. బి/ఇ.29/ టిఆర్‌డి/ టెండరు/36 (2019-20) తేది: 09-10-2019**

దిగువ సంతకందారుచే దిగువ తెలిపిన పనుల కొరకు IREPS పోర్టల్ ద్వారా ఇ-టెండర్లు ఆహ్వానించబడుచున్నవి.

క్ర.సం. 1 **టెండరు నెం:** బి/ఇ.29/టిఆర్‌డి/ టెండరు/36(19-20). **పనుల యొక్క వివరం:** విజయవాడ డివిజన్: అన్నవరం, పిఠాపురం, నర్సిపట్నం రోడ్డు, రావికంపాడు, గుల్లిపాడు, నర్సింగపల్లి, సామర్లకోట మరియు తుని స్టేషన్ల వద్ద అదనపు గ్యాంగ్ వే తో ఎఫ్ఓబిల విస్తరణ, కొత్త ఎఫ్ఓబిల ఏర్పాటుతో సంబంధించి ఓహెచ్ఇ నకు మార్పులు/చేర్పులు (8 నెం.లు). **సుమారు విలువ (₹)** : 10248293/-, **ఇఎండి(₹):** 201300/-, **పూర్తిచేయు కాలం:** 270 రోజులు, **టెండరు ఫారం ధర** (₹): 5000/- ,**ముగింపు తేది మరియు సమయం:** 01-11-2019న 15.00గం.ల వద్ద.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, టిఆర్‌డి/విజయవాడ**

A1647 PUB/1186

తదుపరి టెండరు షరతులు/వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దయచేసి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways. gov.in వద్ద దర్శించండి.


# ఇరాన్ ఆయిల్ ట్యాంకర్‌పై క్షిపణి దాడి



**దుబాయ్:** సౌదీ ఓడరేవు జెడ్డాలో ఇరాన్‌కు చెందిన ఆయిల్ ట్యాంకర్‌ను శుక్రవారం రెండు క్షిపణులు ఢీకొట్టాయని ఇరాన్ స్టేట్ టెలి విజన్ నివేదించింది. ఈ ట్యాంకర్ నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ (ఎన్ఐఓసీ)కి చెందిందని తెలిపింది. క్షిపణుల దాడుల కారణంగా మంటల్లో చిక్కుకున్న ట్యాంకర్ బాగా దెబ్బతినడంతో క్రూడ్ ఆయిల్ లీక్ అవుతున్నట్టు ఇరానియన్ మీడియా తెలిపింది. జెడ్డాకు 96కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన జరిగిందని వివరించింది. ఈ ఘటన ఎర్ర సముద్రం మరియు గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలను రేకెత్తించే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో ఉన్న యూఎస్ నేవీ ప్రతినిధి లెఫ్టినెంట్ పీట్ పగానో మాట్లాడుతూ మీడియా కథనం ద్వారా ట్యాంకర్‌పై రెండు క్షిపణులతో దాడి చేసినట్టు తెలిసిందన్నారు. ఈ సంఘటన గురించి అధికారులకు తెలుసన్నారు. పూర్తి సమాచారం తెలిపేందుకు పగానో నిరాకరించారు. సౌదీ అరేబియా ఈ దాడి గురించి ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. ఎర్రసముద్రం షిప్పింగ్ ప్రాంతంలో ఇప్పటికే ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇది హిందూ మహా సముద్రాన్ని సూయజ్ కాలువ ద్వారా మధ్యధరాతో కలుపుతుంది. ఈ క్షిపణి దాడి మొదటగా శుక్రవారం స్థానిక సమయం ఉదయం 5గంటలకు, మరొకటి ఉదయం 5.30గంటలకు జరిగిందని, ఓడ సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని ఓడ యాజమాన్యం ఎన్ఐఓసీ తెలిపింది. ఆయిల్‌ట్యాంకర్‌పై దాడి నేపథ్యంలో చమురు ధరలు 2శాతం పెరిగాయి. ఉగ్రవాదుల దాడిగా అనుమానిస్తున్న ఇరాన్ అధికారులు ఈ దాడికి సంబంధించి ఎవరిని అనుమానిస్తున్నది వెల్లడించలేదు. ట్యాంకర్లను రెండుసార్లు క్షిపణులు ఢీకొట్టినట్లు ఇరాన్ విదేశాంగశాఖ ధ్రువీకరించింది. క్రూడ్ ఆయిల్ లీక్ ఆగినట్టు తెలిపింది. ఈ దాడికి వెనుక ఉన్నవారు ప్రమాదకరమైన పర్యావరణ కాలుష్యంతోపాటు ప్రమాదకర తీవ్ర పరిణామాలకు బాధ్యత వహించాలని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి అబ్బాస్ మౌసావి మీడియాకు తెలిపారు. దాడికి గురైన చమురు ట్యాంకర్ సాబిటి చిత్రాలను సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. చమురు కంపెనీ అధికారులు మంటలను ఆర్పివేశారని టెహ్రాన్ నుంచి రిపోర్టు చేస్తున్న అల్ జజీరాకు చెందిన బస్రవీ తెలిపారు. ట్యాంకర్‌ట్రాకర్స్ వెబ్‌సైట్ తన కథనంలో నౌక మిలియన్ బ్యారెల్స్ క్రూడ్ ఆయిల్ లోడుతో సిరియా మార్గంలో పయనిస్తున్నట్టు తెలిపింది. అయితే ట్యాంకర్ సంస్థ ఎన్ఐఓసీ తమ సాబిటీ నౌక మార్గాన్ని మారుస్తున్నట్టు తెలిపింది.

# కర్నాటక ఐటీ దాడుల్లో రూ.5 కోట్లు స్వాధీనం

• పరమేశ్వర నివాసంలో సుమారు రూ.70లక్షల నగదు లభ్యం • కాంగ్రెస్ నేతల విద్యాసంస్థల్లో కొనసాగుతున్న సోదాలు • రాజకీయ విద్వేషంగా పేర్కొన్న కేపీసీసీ చీఫ్ గుండురావు



**బెంగళూరు:** కర్ణాటక కాంగ్రెస్ నాయకులు జి.పరమేశ్వర, ఆర్ఎల్ జలప్పకు చెందిన పలు ప్రాంతాల్లో దాడి చేసిన ఐటీ అధికారులు సమారు ఐదు కోట్ల రూపాయలు స్వాధీనం చేసుకున్నారని అధికారవర్గాలు శుక్రవారం తెలిపాయి. పరమేశ్వర, జలప్ప వారి స్నేహితులు, బంధువులతో నడుపుతున్న విద్యాసంస్థల ఆస్తులను బహిర్గతం పరచకపోవడం, పన్ను ఎగవేత ఆరోపణలపై 25 నుంచి 30 ప్రాంతాల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. గురువారం నుంచి దాడులు నిర్వహిస్తున్నట్టు అధికారులు మీడియాకు తెలిపారు. వాయువ్య బెంగళూరులోని ఉన్నతవర్గాలు నివసించే వాయువ్య సదాశివ్‌నగర్‌లో కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం పరమేశ్వర నివాసం నుంచి సువారు రూ.70లక్షల నగదు దొరికినట్టు సమాచారం. 68 ఏళ్ల పరమేశ్వర కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వ కాలంలో డిప్యూటీ సీఎంగా 14నెలలుపాటు ఉన్నారు. కర్ణాటక కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడైన పరమేశ్వర సువారు ఆరేళ్లపాటు అధ్యక్ష పదవిలో ఉన్నారు. సోదాలు ఇంకా కొనసాగుతున్నందున పత్రాలు, నగదు స్వాధీనం చేసుకున్నామని ధ్రువీకరించేందుకు అధికారులు నిరాకరించారు. దర్యాప్తు విభాగం డైరెక్టర్ జనరల్ ఐటీ ఆపరేషన్ పూర్తయిన అనంతరం అధికారికంగా ప్రకటన జారీ చేయనున్నట్టు తెలిపారు. కాగా కాంగ్రెస్ నేతలు పరమేశ్వర, జలప్ప వారి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి వైద్య, దంత, ఇంజినీరింగ్ కళాశాలలతో సహా పలు ఉన్నత విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. పరమేశ్వర ఆయన కుటుంబ సభ్యులకు బెంగళూరుకు వాయువ్యంగా 40నుంచి 70కిలోమీటర్ల దూరంలో ఉన్న నెలమంగళ, తుమకూరులో సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ పేరిట భారీ క్యాంపస్‌లు, కళాశాలలు ఉన్నాయి. మరోవైపు కోలార్‌లో జలప్ప బంధువు జీహెచ్ నాగరాజ్ నివాసాల్లో కూడా ఐటీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. మెడికల్, ఇంజినీరింగ్ ప్రవేశాలకోసం ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ), ప్రైవేట్ విద్యార్థులు నుంచి సేకరించిన భారీ విరాళాల వివరాలను నాగరాజ్ చూసుకుంటారని అధికారులు తెలిపారు. పరమేశ్వర, జలప్పల నేతృత్వంలోని ట్రస్టులు నిర్వహిస్తున్న మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీలతోపాటు పలు విద్యాసంస్థల ఖాతాల్లో జరిగిన అవకతవలకు సంబంధించి ఈ దాడులు చేస్తున్నట్టు ఐటీ వర్గాలు తెలిపాయి. పరమేశ్వర సోదరుడి కుమారుడు ఆనంద్ నివాసంతోపాటు, సిద్ధార్థ మెడికల్ కాలేజీలో కూడా అధికారులు సోదాలు నిర్వహించారు. మాజీ మంత్రికి చెందిన ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కాలేజ్ నిర్వహిస్తున్నట్టు ఐటీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ నేతలపై ఐటీ దాడులను కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు దినేష్ గుండురావు ఖండించారు. కేంద్రం, రాష్ట్రంలోని అధికార బీజేపీ ప్రభుత్వాలు రాజకీయ విద్వేషాలకు పూనుకుంటున్నాయని గుండురావు ఆరోపించారు. ఐటీ, ఈడీ, సీబీఐ తదితర కేంద్ర ఏజెన్సీలను ఉద్దేశపూర్వకంగా దుర్వినియోగం చేయడం ప్రతిపక్ష పార్టీలను బలహీనపరిచేందుకే అని గుండురావు విలేఖరుల సమావేశంలో ఆరోపించారు.


**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము**
**గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు**

నెం.19 నుండి 20/19-20 తేది:5.10.19

నరసరావుపేట పరిధిలోని సి.యస్.ఆర్ గ్రాంట్ నిధుల క్రింద మంజూరైన 2 పనులకు 2019-20 ఆర్థిక సం॥లో వార్షిక నిర్వహణ చేయుటకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. 2 పనులకు **అంచనా విలువ: రూ.33.54/21.90 లక్షలు.** టెండర్లు 15.10.2019 నుండి www.eprocurement.gov.in లో చూడగలరు. ఇతర వివరాలను ఈ కార్యాలయములో పొందగలరు. **ఫోన్ నెం.08647-222574**

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుద్ధ్య విభాగము,నరసరావుపేట
Ro No.820/CL/Advt/1/1/2019-20, Dt.11.10.2019



**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము**
**అటవీ శాఖ**
**టెండరు ప్రకటన**

**ఆర్.సి.నెం.424/2012/ఎ** **తేది: -10-2019**

అటవీ శాఖ గిద్దలూరు డివిజన్ పరిధిలోని గుండ్లకమ్మ (2) తురిమెళ్ల (7), కనిగిరి (2) మరియు ఒంగోలు (4) అటవీ క్షేత్రములలోని నరకబోయే జామాయిల్ మరియు సరుగుడు స్టెమ్, సులగ మరియు స్టంప్ వుడ్ కొనుగోలు చేయుటకు ఆసక్తి గల కాంట్రాక్టర్లు మరియు పేపర్ మిల్లుల నుండి సీలు వేయబడిన టెండర్లు కోరబడుచున్నవి. తేది: **31-10-2019**న అమ్మకము జరుపుటకు నిర్ణయించడమైనది. టెండరు షెడ్యూలు ఇచ్చు తేది మరియు సమయము **31-10-2019, ఉ.10.30 నుండి మ. 2.00 గం.ల వరకు.** టెండర్ షెడ్యూల్ ఇచ్చుటకు ఆఖరి తేది: **31-10-2019, మ.12.30 గం.వరకు.** సీలు వేసిన టెండర్లు తీసుకొనుటకు ఆఖరి తేది:**31-10-2019, మ. 03.00గం. వరకు.** టెండర్లు తెరువబడు తేది:**31-10-2019, సా.04.00గం.లకు.** తేది: **31-10-2019**న అమ్మకము పోని ప్లాంటేషన్లు తిరిగి **15-11-2019** మరియు **30-11-2019** అమ్మకము జరుపబడును. ఇతర వివరాలకు ఈ కార్యాలయము నందు సంప్రదించగలరు.

**సం/- డివిజనల్ అటవీశాఖాధికారి, గిద్దలూరు**
Ro.No.817/CL/Advt/1/1/2019-20, Dt: 11.10.2019

# ఇన్ఫీ లాభం 4019 కోట్లు



- క్యూ2లో 2.2 శాతం క్షీణత
- మధ్యంతర డివిడెండ్ రూ.8
- గైడెన్స్ 9-10 శాతం
- గతంలో 8.5శాతం నుంచి 10 శాతం

**బెంగళూరు :** ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏడాది ప్రాతిపదికన చూస్తే నికరలాభం 2.2 శాతం క్షీణించి రూ.4,019 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.4,110 కోట్లు ఆర్జించింది. ఏకీకత్ర ప్రకారం చూస్తే రెవెన్యూ రెండవ త్రైమాసికంలో 10 శాతం పెరిగి రూ.22,629 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రెవెన్యూ రూ.20,609 కోట్లు నమోదు చేసింది. స్టాండ్‌ఎలోన్ ప్రాతపదికన చూస్తే నికర లాభం రూ.3,829 కోట్లు కాగా క్రితం ఏడాది ఇదే సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.3,879 కోట్లు. క్రితం ఏడాది పోల్చుకుంటే 1.2 శాతం తగ్గింది. స్టాండ్ ఎలోన్ రెవెన్యూ మాత్రం 7.5 శాతం పెరిగి రూ.19,666 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.18,297 కోట్లు నమోదు చేసింది.

### రెవెన్యూ గైడెన్స్



సీఎఫ్ఓ నిలంజన్ రాయ్

ఈ ఆర్థిక సంవత్సరం రెవెన్యూ గైడెన్స్ కరెన్సీ నిలకడగా ఉంటే 9-10 శాతం ఉంటుందని పేర్కొంది. అలాగే ఈ ఆర్థిక సంవత్సరం నిర్వహణా మార్జిన్ గైడెన్స్ 21-23 శాతం మధ్యలో ఉంటుందని వెల్లడించింది. కంపెనీ బోర్డు మధ్యంతర డివిడెండ్‌ను ఈక్విటీ షేరుకు రూ.8గా ప్రకటించింది. రికార్డు తేదీగా అక్టోబర్ 23, 2019గా నిర్ణయించింది. ఈ నెల 30వ తేదీలోగా డివిడెండ్ వాటాదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.

### భౌగోళిక రెవెన్యూ

మొత్తం రెవెన్యూలో 60 శాతం అమెరికా మార్కెట్ నుంచి దక్కించుకుంది. బ్యాం కింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండస్ట్రీస్ లేదా బీఎస్ఎఫ్ఐ విభాగం నుంచి 32 శాతం రెవెన్యూ సాధించింది. అదే జూన్ త్రైమాసికంలో ఈ రెండు సెగ్మెంట్‌లలో వృద్ధిరేటు ఫ్లాట్‌గా నమోదైంది.

### అన్ని విభాగాల్లో మెరుగైన పనితీరు

ఇన్ఫోసిస్ క్యూ2లో అన్నీ విభాగాల్లో మెరుగైన పని తీరును కనబర్చింది. రెవె న్యూ వృద్ధితో పాటు డిజిటల్ విభాగంలో మంచి వృద్ధి కనిపిం చింది. దీంతో పాటు నిర్వహణా లాభాల మార్జిన్, నిర్వహ ణతో పాటు అతి పెద్ద కాంట్రాక్టులపై సంతకాలు కుదుర్చుకుంది. అలాగే కంపెనీ నుంచి వలసలు తగ్గించుకుంది. ఇవన్నీ పరిగణనలోకి తీసు కుంటే కంపెనీ సరైన దిశలో పయనిస్తోందని తెలుస్తోందని ఇన్ఫోసిస్ సీఈవో, ఎండీ సలీల్ పారిఖ్ చెప్పారు. క్లయింట్‌లతో పాటు వాటాదారులకు గరిష్ఠంగా లబ్దిని చేకూర్చామని ఆయన అన్నారు. ఇన్ఫోసిస్ నిర్వహణా లాభం క్యూ2లో రూ.4,912 కోట్లు కాగా, ఏడాది ప్రాతిపదికన చూస్తే 0.4 శాతం వృద్ధి కనిపించింది. నిర్వహణా మార్జిన్ మాత్రం 21.7 శాతం. క్యూ2లో ఆపరేటింగ్ లేదా నిర్వహణా మార్జిన్ పెరగడానికి ప్రధాన కారణం అన్నీ విభాగాల్లో మెరుగైన నిర్వహణతో పాటు .. వ్యయ నియంత్రణపై ఫోకస్ పెట్టడమేనన్నారు. కొత్తగా మూలధనం కేటాయింపు విధానాన్ని అమలులో భాగంగా ముందడుగుగా గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఆర్థిక సంవత్సరం మధ్యంతర డివిడెండ్‌ను 14 శాతం పెంచామని ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ నిలంజన్ రాయ్ తెలిపారు.

### డిజిటల్ రెవెన్యూ

జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ మొత్తం రెవెన్యూలో డిజిటల్ రెవెన్యూ 35.7 శాతం ఆక్రమించింది. మార్చితో ముగిసిన త్రైమాసికం రెవెన్యూ 33.8 శాతంతో పోల్చుకుంటే కాస్తా మెరుగు. అదే ఏప్రిల్ జూన్ త్రైమాసికంలో 8.1 శాతం వృద్ధితో 1,119 మిలియన్ డాలర్లు సాధించగా.. మార్చి త్రైమాసికంలో 1,035 మిలియన్ డాలర్లు నమోదు చేసింది. జూన్30, 2018లో 803 మిలియన్ డాలర్లతో పోల్చితే డిజిటల్ రెవెన్యూ 39.3 శాతం వృద్ధి కనిపించింది. వలసలు వలసల విషయానికి వస్తే ఏప్రిల్ - జూన్ త్రైమాసికంలో 23.4 శాతంగా నమోదు కాగా అంతకు ముందు అంటే మార్చి త్రైమాసికంలో 20.4 శాతంగా నమోదైంది. పోటీ కంపెనీ అయిన టీసీఎస్‌లో 11.5 శాతం వలసలు జూన్ త్రైమాసికంలో నమోదైనాయి. దీంతో పోల్చుకుంటే ఇన్ఫోసిస్‌లో వలసలు ఎక్కువే. కంపెనీలో వలసలు తగ్గించడానికి యాజమాన్యం పలు చర్యలు తీసుకుంది. వాటిలో ఉద్యోగులకు వృత్తినైపుణ్యం శిక్షణతో పాటు కొన్ని రాయితీలు ప్రకటించింది. దీంతో ఇన్ఫోసిస్‌లో నైపుణ్యం కలిగిన సిబ్బంది వల్ల వలసలను ఆపుకోగలిగింది.

### క్యూ2లో అతి పెద్ద డీల్ 2.8బి. డాలర్లు

సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో అతి పెద్ద డీల్స్ విషయానికి వస్తే 2.8 బిలియన్ డాలర్ల కాంట్రాక్టు కుదర్చుకున్నామని, దీంతో పాటు కంపెనీ నుంచి వలసలు తగ్గించామని కంపెనీ సీఓఓ ప్రవీణ్ రావు చెప్పారు. అలాగే డాలర్ ప్రాతిపదికన చూస్తే రెవెన్యూ 2.5 శాతం పెరిగింది. కరెన్సీ ఒడిదుడుకుల వల్ల 3.3 శాతం పెరిగి 3,210 మిలియన్ డాలర్లకు చేరిందని ఆయన అన్నారు. క్యూ2లో అన్నీ విభాగాల్లో వృద్ధి కనిపించిందని.. అదే సమయంలో ప్రపంచంలోని అన్నీ దేశాల నుంచి ఆర్డర్లు దక్కాయని సీఓఓ వివరించారు.



### పెరిగిన క్లయింట్లు

సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 28 మంది యాక్టివ్ క్లయింట్లున్నారు. దీంతో క్యూ1లో 1,336 నుంచి క్యూ2 నాటికి 1,364 క్లయింట్లకు చేరారు. అయితే మిలియన్ డాలర్ల క్లయింట్లు పరిమిత స్థాయిలో దక్కారు. అలాగే 100 మిలియన్ డాలర్ల కంటే పెద్ద క్లయింట్లు అస్సలు దక్కలేదు. ఉత్తర అమెరికా నుంచి కస్టమర్లు పెరిగారు. రెవెన్యూలో సుమారు 61.4 శాతం లభించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇక్కడి నుంచి 60.3 శాతం దక్కింది. మొత్తం రెవెన్యూలో ఫైనాన్షియల్ సర్వీసెస్, రిటైల్ రంగం నుంచి పెద్దమొత్తంలో వాటా దక్కింది. మిగిలిన మొత్తం కమ్యూనికేషన్స్, ఎనర్జీ, యుటిలిటి, రీసోర్సెస్ అండ్ సర్వీసెస్, తయారీరంగాల నుంచి రెవెన్యూ లభించింది.

### క్యూ2 ముఖ్యాంశాలు

- ➡ రెవెన్యూ రూ.22,629 కోట్లు
- ➡ ఏడాది ప్రాతిపదికన 9.8 శాతం వృద్ధి
- ➡ త్రైమాసికం ప్రకారం 3.8 శాతం వృద్ధి
- ➡ పెరిగిన డిజిటల్ రెవెన్యూ
- ➡ అతి పెద్ద ఒప్పందాలపై సంతకాలు
- ➡ తగ్గిన వలసలు
- ➡ బీఎస్ఈలో షేరు ధర నాలుగు శాతం పెరిగి రూ.814 వద్ద క్లోజ్

బిజినెస్ — Andhraprabha business 2019

## రూ.126 పెరిగిన పసిడి ధర



**న్యూఢిల్లీ :** బంగారం ధరలు దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం పది గ్రాములు రూ.126 పెరిగి రూ.39,160 మార్కుకు చేరింది. డాలర్ మారకంతో రూపాయి బలహీనపడ్డంతో పాటు పండుగ డిమాండ్ బాగా కలిసి వచ్చింది. గరువారం పది గాములు రూ.39,034 వద్ద ముగిసింది. వెండి కూడా కిలో రూ.380 పెరిగి రూ.46,900 మార్కుకు ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్స్ 1502 డాలర్లు వెండి ఔన్స్ 17.71 డాలర్లు పలికింది.

## నిస్సాన్ డాట్సన్ గో, గో ప్లస్

**న్యూఢిల్లీ :** నిస్సాన్ ఇండియా శుక్రవారం ఆటోమెటిక్ వెర్షన్ డాట్సన్, డాట్సన్ గో, గో ప్లస్‌ను మార్కెట్లో విడుదల చేసింది. దీని ధర రూ.5.94 లక్షల నుంచి రూ.6.58 లక్షలు (ఎక్స్‌షోరూం)గా నిర్ణయించింది. శుక్రవారం నుంచి దేశవ్యాప్తంగా ఉన్న డీలర్ల వద్ద లభిస్తాయని తెలిపింది. సీవీటీ టెక్నాలజీ (కంటిన్యూస్లీ వెరియబుల్ ట్రాన్స్‌మి షన్) వల్ల డ్రైవింగ్‌లో అలిసిపోమని నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ రాకేశ్ శ్రీవాత్సవ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మోడల్స్ ఫీచర్లు... 7 అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటెయిన్ మెంట్ సిస్టమ్‌తో పాటు వాయిస్ రికగ్నిషన్‌తో పాటు ఆం డ్రాయిడ్ ఆటో /ఆపిల్ కార్ ప్లే అందిస్తోంది. కారు క్రాష్ కాకుండా భద్రతా ప్రమాణాలను పెంచింది.

## పారిశ్రామికోత్పత్తి డీలా

- ఆగస్టులో 1.1శాతం క్షీణత



**న్యూఢిల్లీ:** పారిశ్రామికో త్పత్తి (ఐఐపీ) ఆగస్టు నెలలో 1.1 శాతానికి దిగివచ్చింది. ముఖ్యంగా తయారీరం గంతో పాటు విద్యుత్ ఉత్పత్తి, గనుల రంగంలో ఉత్పత్తి క్షీణించడంతో దాని ప్రభావం మొత్తం ఐఐపీ కనిపిం చింది. శుక్రవారం ప్రభుత్వం అధికారిక గణాంకాలను విడుదల చేసింది. క్రితం ఏడాది ఇదే ఆగస్టు నెలలో ఐఐపీ 4.8 శాతంగా నమోదైంది. మొత్తం ఐఐపీలో తయారీ రంగం వాటా 77 శాతం ఆక్రమిస్తోంది.ఈ ఏడాది ఆగస్టులో తయారీరంగంలో 1.2శాతం క్షీణించగా.. క్రితం ఏడాది ఇదే నెలలో 5.2శాతం వృద్ధి కనిపించింది. వివరాల్లోకి వెళితే విద్యుత్ ఉత్పత్తి రంగంలో ఉత్పత్తి 0.9 శాతం క్షీణించగా.. ఏడాది క్రితం 7.6 శాతంగా నమోదైంది. అయితే గనుల రంగంలో ఉత్పత్తి ఫ్లాట్‌గా 0.1 శాతంగా నమోదైంది. ఏప్రిల్ నుంచి ఆగస్టు కాలానికి చూస్తే ఐఐపీ వృద్ధి 2.4 శాతంగా నమోదు కాగా.. ఏడాది క్రితం ఇదే కాలంలో 5.3 శాతంగా నమోదైంది.

## ఫోర్బ్స్ ఇండియా సంపన్నుల జాబితా 2019లో మళ్లీ ముఖేష్

- రెండవ స్థానంలో గౌతమ్ అదానీ
- ఈ ఏడాది సంపన్నుల సంపద 8 శాతం క్షీణించింది



**న్యూఢిల్లీ :** రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ ఈ ఏడాది (2019) సంపన్నుల జాబితాలో మళ్లీ నంబర్ వన్‌గా నిలిచారు. నంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించడం అంబానీకి ఇది వరుసగా 12వ సారి. ఈ ఏడాది భారత ఆర్థిక వ్యవస్థ పలు సవాళ్లను ఎదుర్కొందని పేర్కొంది. ఈ ఏడాది ఆయన సంపద 4.1 బిలియన్ డాలర్లు పెరిగి 51.4 బిలియన్ డాలర్లకు ఎగబాకింది.. టెలికం రంగంలోకి ప్రవేశించిన తర్వాత ఆయన సంపద పెరిగిందని, భారత్ టెలికం రూపురేఖలు మారాయి.. 340 మిలియన్‌ల సబ్‌స్క్రైబర్లు జియో నెట్‌వర్క్‌కు వచ్చి చేరారని ఫోర్బ్స్ వెల్లడించింది.

### బిలియనీర్ల సంపద తగ్గింది

ఈ ఏడాది భారత ఆర్థిక వ్యవస్థ మందగించడంతో దాని ప్రభావంతో బిలయనీర్ల సంపదపై ప్రభావం చూపించింది. 2018తో పోల్చుకుంటే 8 శాతం కరిగి 452 బిలియన్ డాలర్లకు దిగివచ్చింది. దేశంలోని టాప్ 100 సంపన్నుల సంపదలో 50 శాతం మంది నికర సంపద మాత్రం తగ్గిందని ఫోర్బ్స్ పేర్కొంది. కొంత మంది సంపద తగ్గినా.. దీనికి వ్యతిరేకంగా మరి కొంత మంది సంపద మాత్రం పెరిగింది. వారిలో ప్రముఖంగా చెప్పు కోవలంటే మౌలికరంగానికి చెందిన గౌతమ్ అదానీని చెప్పుకోవచ్చు. గతేడాదితో పోల్చుకుంటే ఏకంగా 8 స్థానాలు ముందుకు జరిగి 2వ స్థానానికి ఎగబాకారు. ఆయన సంపద 15.7 బిలియన్ డాలర్లు. ఆస్ట్రేలి యాలోని బొగ్గు గనుల కోసం సుమారు 9 సంవత్సరాల పాటు ఎదురుచూసిన తర్వాత ప్రస్తుతం అన్నీ అనుమతులు దక్కించుకున్నారు. దీంతో పాటు ఆయన కొత్త వ్యాపారాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. విమానాశ్రయాలతో పాటు డేటా సెంటర్ల వ్యాపారంలోకి ప్రవేశించారు. అంబానీ, అదానీ తర్వాత హిందూజా సోదరులు మూడవ స్థానంలో ఉన్నారు. వారి సంపద 15.6 బిలియన్ డాలర్లు. పల్లోంజీ మిస్త్రీ 15 బిలియన్ డాలర్లు బ్యాంకర్ ఉదయ్ కొటక్ 14.8 బిలియన్ డాలర్లు కలిగి ఉన్నారు. ఫోర్బ్స్ ఆసియా, ఇండియా ఎడిటర్ నాజ్‌నీన్ కార్మాలీ మాట్లాడుతూ.. భారత ఆర్థిక వ్యవస్థ మందగించడంతో దాని ప్రభావంతో దేశంలో 100 మంది సంపన్నుల సంపద తగ్గితే.. మరి కొంత మంది సంపద మాత్రం బాగా పెరిగింది. ఈ జాబితాలో కొత్త ఆరుగురు వచ్చి చేరారు. అల్కేమ్ లేబరెటరీస్‌కు చెందిన సంప్రదాసింగ్ జాబితాలో 41వ స్థానంతో 3.18 బిలియన్ డాలర్లకు చేరారు. అలాగే బైజు రవీంద్రన్ నం 72. 1.91 బిలియన్ డాలర్లు సంపదకు చేరారు. మహీంద్ర ప్రసాద్, అరిస్టో పార్మాస్యూటికల్స్ నం.81 1.77 బిలియన్ డాలర్లకు, మనోహర్‌లాల్, మధుసూదన్ అగర్వాల్ నం.83 1.7 బిలియన్ డాలర్లు. ఢిల్లీ ప్రధాన కార్యాలయంగా హల్దిరామ్ స్నాక్స్ వ్యాపారం చేస్తున్నారు. రాజేశ్ మెహ్రా నం.95, సంపద 1.5 బిలియన్ డాలర్లు వారి కుటుంబం బాగా ప్రసిద్ధి చెందిన సానిటరీ వేర్ బ్రాండ్ జాక్వార్ నిర్వహిస్తున్నారు. సందీప్ ఇంజినీర్ నం.98, 1.48 బిలియన్ డాలర్లు ఆస్ట్రాల్ పోలి టెక్నిక్‌లున్నారు.సంపద తగ్గిన వారిలో ఆటో, కన్స్యూమర్ గూడ్స్ రంగానికి చెందిన వారు వ్యాపార సెంటిమెంట్ బలహీనంగా ఉన్నందు వల్ల ఆటో విడిభాగాల తయారీదారు వివేక్ చంద్ సెహగల్ సంపద తగ్గి 2.45 బి. డాలర్లకు దిగివచ్చింది.

### తెలుగు బిలియనీర్లు

ఫోర్బ్స్ సంపన్ను 100 జాబితాలో తెలుగు వారు కూడా స్థానాన్ని ఆక్రమించారు. 37వ స్థానంలో మురళి దివి ఉన్నారు. పార్మా కంపెనీని నిర్వహిస్తున్న ఆయన సంపద 3.45 బిలియన్ డాలర్లు. మౌలికరంగానికి చెందిన పీపీ రెడ్డి 39వ స్థానంలో ఉన్నారు. ఆయన సంపద 3.3 బిలియన్ డాలర్లు, 59వ స్థానంలో రాంప్రసాద్ రెడ్డి, ఆయన కూడా ఫార్మా కంపెనీని నిర్వహిస్తున్నారు. ఆయన సంపద 2.25 బి.డాలర్లు. డాక్టర్ రెడ్డీస్ కుటుంబం 82వ స్థానంలో ఉంది. సంపద 1.76 బి.డాలర్లు.

## సంక్షోభంలో ఆటో రంగం

- సెప్టెంబర్‌లో 24 శాతం తగ్గిన అమ్మకాలు
- వరుసగా 11 నెలల నుంచి తిరోగమనమే
- ఉత్పత్తి.. ఉద్యోగాల్లో కోత





**హైదరాబాద్ :** భారతీయ ఆటో రంగం కనుచూపు మేరలో గాడిలో పడే పరిస్థితి కనిపించడం లేదు. సెప్టెంబర్ నెల ఆటో అమ్మకాలను చూస్తే పరిస్థితి తెలుస్తోంది. వరుసగా గత 11 నెలల నుంచి అమ్మకాలు తిరోగమనబాట పడుతున్నాయి. అమ్మకాలు పుంజుకోకపోవడంతో ఆటో కంపెనీలు ఉద్యోగాల్లో కోత పెడుతున్నాయి. గత నెల ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 2,23,317 యూనిట్లకు దిగిరాగా.. కార్ల అమ్మకాలు మాత్రం ఏకంగా 33.4 శాతం క్షీణించి 131,281 యూనిట్లకు దిగివచ్చాయిన సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటో మొబైల్ మాన్యూఫ్యాక్చరర్స్ (సియామ్) తాజా గణాంకాలను బట్టి తెలుస్తోంది.

### మందగించిన ఆటో రంగం

దేశీయ ఆటోరంగం మందగమనంలో కొట్టుమిట్టాడుతోంది. డిమాండ్ తగ్గడంతో కంపెనీలు ఉత్పత్తి తగ్గించి.. వేలాది మంది ఉద్యోగులను కోత విధించేపనిలో పడ్డాయి. కార్లు, ఆటో విడిభాగాలు తయారు చేసే కంపెనీలు ఇప్పటికే ఉత్పత్తిని తగ్గించి వేలాది మందిని ఉద్యోగాల్లోంచి తీసేశాయి. ఆర్థిక వ్యవస్థ మందగించడంలో ప్రభుత్వం వృద్ధి రేటును బలోపేతం చేయడానికి మోడీ సర్కార్ కార్పొరేట్ టాక్స్‌ను తగ్గించింది. అయితే రాబోయే దీపావళి పండుగ సందర్భంగా అమ్మకాలు పుంజుకుంటాయన్న ఆశతో ఆటో కంపెనీలున్నాయి. అక్టోబర్ అమ్మకాల తర్వాత ఆటోరంగం భవిష్యత్తుపై తుది ప్రణాళికలు రూపుదిద్దుకుంటాయి.

### ధరలు తగ్గించినా పుంజుకోని అమ్మకాలు

ప్రభుత్వం కార్పొరేట్ టాక్స్ తగ్గించినందున కార్ల కంపెనీలు ధరలు తగ్గించాయి. ఉదాహరణకు మారుతి సుజుకి ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. సెప్టెంబర్‌లో కార్ల అమ్మకాలు గత ఏడాదితో పోల్చుకుంటే 24.4 శాతం తగ్గాయి.

### ఆటో రంగం క్షీణించడానికి కారణాలు

నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు సంక్షోభంలో కూరుకుపోవడంతో కొత్త వాహనాలరు రుణాలు ఇవ్వడం తగ్గంచేశాయి. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోకుండా ఎన్‌బీఎఫ్‌సీ వద్ద రుణాలు తీసుకునే వారికి ఎన్‌బీఎఫ్‌సీలు రుణాలు ఇచ్చేవి. అతి పెద్ద నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు దివాలా తీయడంతో చిన్న చిన్ ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలకు రుణాలు పెద్ద సవాలుగా మారాయి. ఇటీవల జరిగిన ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్షలో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ఎన్‌బీఎఫ్‌సీలకు సరిపడా నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఎన్‌బీఎఫ్‌సీ రంగం కుదటపడితేనే కానీ ఆటోరంగానికి మోక్షం కలగదు.

### నియంత్రణా సంస్థల ఒత్తిడితో ధరలు పెరుగుదల

2018-19 నుంచి 2020-21 వరకు వాహనాల ధరలు సుమారు 13-30 శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయి. దశాబ్దం క్రితంతో పోల్చుకుంటే 1-2 శాతం పెరుగుతుంది. ప్రభుత్వం భద్రతతో పాటు బీమా, కర్బన ఉద్గారాలపై కఠిన నిబంధనలు తీసుకురావడంతో కంపెనీలకు ఆర్థికభారం పడుతోంది. దీంతో వాహనాల ధరలు పెరుగుతాయి. వచ్చే ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఉన్న బీఎస్-4 వాహనాలను బీఎస్-6కు అప్‌గ్రేడ్ చేయించుకోవాల్సి వస్తుంది. దీంతో వాహనాల ధరలు గణనీయంగా పెరిగిపోతాయి.

### పెరిగిపోయిన పోటీ

గత ఐదు సంవత్సరాల నుంచి ఆటోరంగంలో పోటీ పెరిగిపోయింది. అదే సమయంలో ప్రీ-వోన్డ్ (సెకండ్ హ్యాండ్) కార్ల మార్కెట్ కూడా గణనీయంగా పెరిగిపోయింది. సెకండ్ హ్యాండ్ మార్కెట్ పెరగడంతో కొత్త కార్ల అమ్మకాలు తగ్గాయి. ముఖ్యంగా ధరలు గణనీయంగా పెరిగిపోతే దాని ప్రభావంతో అమ్మకాలు తగ్గితే.. సెకండ్ హ్యాండ్ కార్ల మార్కెట్ ఊపందుకుంటుంది.

### ఆటో రంగం భవిష్యత్తు...

ప్రస్తుతం పరిస్థితులు చూస్తుంటే గతంలో మాది రిగా అమ్మకాలు పెరిగే అవకాశాలు మాత్రం లెవు. ఒక వేళ ఆర్థిక వ్యవస్థ గాడినపడితే మాత్రం పరిస్థితులు కాస్తా మెరుగుపడవచ్చు. అమ్మకాలు పెరగాలంటే ముఖ్యంగా ద్విచక్రవాహ నాలు, ప్యాసింజర్ వాహనాలకు.. ఒరిజినల్ ఈక్విప్‌మెంట్ మేకర్స్ (ఓఈఎం)లు బీఎస్-6 వ్యయంలో కొంత భరిస్తేతప్ప అమ్మకాలు పెరిగే అవకా శాల్లే వని ఆటో రం గానికి చెందిన నిపుణులు అభిప్రాయపడుతు న్నారు.

## 24 శాతం తగ్గిన ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు

**న్యూఢిల్లీ :** ప్యాసింజర్ కార్ల అమ్మకాలు గత నెలలో ఏకంగా 23.69 శాతం క్షీణించి 2,23,317 యూనిట్లకు దిగివచ్చాయి. క్రితం ఏడాది ఇదే నెలలో 2,92,660 యూనిట్ల విక్రయాలు జరిగాయి. వరుసగా గత 11 నెలల నుంచి అమ్మకాలు తగ్గడమే కానీ.. పెరిగిన దాఖలాల్లేవు. వివరాల్లోకి వెళితే కార్ల అమ్మకాలు గత నెలలో 131,281 యూనిట్లకు దిగిరాగా.. ఏడాది క్రితం 197,124 యూనిట్ల విక్రయాలు జరిగాయని సొసైటీ ఆఫ్ ఇండియన ఆటోమొబైల్ మాన్యూ ఫ్యాక్చరర్స్ (సియామ్) శుక్రవారంవిడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. మోటార్‌సైకిల్ అమ్మకాలు గత నెలలో 23.29 శాతం క్షీణించి 10,43,624 యూనిట్లకు దిగిరాగా.. ఏడాది క్రితం 13,60,415 యూనిట్లకు దిగివ చ్చాయి. మొత్తం ద్విచక్రవాహనాల అమ్మకాలు 22.09 శాతం తగ్గి 16,56,774 యూనిట్లకు దిగి రాగా.. ఏడాది క్రితం ఇదే నెలలో 21,26,445 యూనిట్లుగా నమోదై నాయి. వాణిజ్య వాహనాల విషయానికి వస్తే అన్నీ రకాల వాహనాల అమ్మకాలు 21.41 శాతం తగ్గి 20,04,932యూనిట్లకు దిగిరాగా.. ఏడాది క్రితం 25,84,062 యూనిట్లు అమ్ముడయ్యాయి.

### హుందాయ్ వెన్యూ రికార్డు

హ్యుందాయ్ మోటార్ ఇండియాకు చెందిన కాంపాక్ట్ ఎస్ యూవా వెన్యూ ఈ ఏడాది మే నుంచి సెప్టెంబర్ కాలంలో అత్యధికంగా అమ్ముడు పో యాయి. 42,681 యూనిట్లు విక్రయించింది. కేవలం ఐదు నెలల కాలంలో 75 వేల బుకింగ్‌లు, 42,681 కస్టమర్లు తమ కారును కొనుగోలు చేసి వాడుతు న్నారన్నారు. కస్టమర్ల అభిరుచుల్లో మార్పు కనిపిస్తోందని, డిజైన్‌తో పాటు వినూ త్న మైన ఫీచర్లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ జె హా ఒక ప్రకటనలో తెలిపారు. వెన్యూను కంపెనీ ఈ ఏడాది మేలో మార్కెట్లో విడు దల చేసింది. దీని ధర రూ.6.5 లక్షల నుంచి 11.1 లక్షలుగా నిర్ణ యిం చింది. వెన్యూకు మార్కెట్లో పోటీ ఇచ్చే ఎస్‌యూవీలు ఇలా ఉన్నాయి. మారుతి సుజుకి విటారా బ్రెజ్జా, మహీంద్రా అండ్ మహీంద్రా ఎక్స్ యూవీ 300, టాటామో టార్స్ నెక్సాన్‌లున్నా యి.

## గట్టెక్కిన మార్కెట్లు

- సెన్సెక్స్ 247 పాయింట్ల జంప్
- చిగురించిన అమెరికా-చైనాల మధ్య వాణిజ్య చర్చలు

**ముంబై :** సెన్సెక్స్, నిఫ్టీలు శుక్రవారం నాడు ఎట్టకేలకు లాభాల పంటను పండించాయి. గ్లోబల్ మార్కెట్ల నుంచి అనుకూలమైన సంకేతాలు రావడంతో పాటు అమెరికా - చైనాల మధ్య వాణిజ్య చర్చలు కొలిక్కి వస్తాయన్న అంచ నాతో ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో షేర్లను కొనుగోలు చేశారు. శుక్రవారం నాటి ట్రేడింగ్ సుమారు 600 పాయింట్ల వరకు ఒడిదుడకులకు గురై చివరకు సెన్సెక్స్ 246.68 పాయింట్లు లాభపడి 38,127.08 పాయింట్ల వద్ద, నిఫ్టీ 66.70 పాయింట్ల లాభంతో 11,307.25 వద్ద ముగి శాయి. ఈ వారం మొత్తానికి చూస్తే సెన్సెక్స్ 453.77 పాయింట్లు నిఫ్టీ 126.50 పాయింట్ల వరకు లాభప డ్డాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా - చైనాల మధ్య వాణిజ్య చర్చలపై అనుకూలంగా స్పందించ డంతో గ్లోబల్ ఈక్విటి మార్కెట్లు ఊపందుకున్నాయి.



చైనాతో ఇప్పుడే చర్చలు ముగిశాయి. శనివా రం చైనా వైస్ ప్రిమియర్‌తో వైట్ హౌస్‌లో సమా వేశం అవుతున్నా నని ట్రంప్ గురువారం వైట్‌హౌస్‌లో చెప్పారు. గ్లోబల్ మార్కెట్ల నుంచి అనుకూలమైన స్పందన రావ డంతో పాటు దేశీయంగా క్యూ2 ఫలితాల సీజన్ కూడా మొదలు కావడం మార్కెట్లకు బాగా కలిసివ చ్చింది. ఇన్ఫోసిస్ ఏకంగా 4.19 శాతం లాభపడింది. వేదాంత, టాటామోటర్స్, ఒఎన్‌జీసీ, టాటాస్టీల్, హెచ్ యూఎల్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, భారతి ఎయిర్ టెల్ షేర్లు 3.96 శాతం వరకు లాభపడ్డాయి. దీనికి వ్యతిరే కంగా ఎస్ బ్యాంకు, ఎంఅండ్ ఎం, రిల్, టీసీఎస్, హీరోమోటో కార్ప్, ఇండస్‌ఇండ్‌బ్యాంకు, ఎన్ టీపీసీ షేర్లు 3.30 శాతం వరకు నష్టపో యాయి. ఈ వారం మొత్తానికి చూస్తే సెన్సెక్స్ లాభాలతో ముగిసింది.

అమెరికా- చైనాల మధ్య వాణిజ్య చర్చల్లో పురోగతితో పాటు పం డుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రభు త్వం రుణాల డిమాం డ్‌ను పెంచు కోవడానికి గట్టి చర్యలు తీసుకుం టుందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తు న్నారు. మార్కెట్ ముగి సిన తర్వాత ఇన్ఫోసిస్ క్యూ2 ఫలితాలను వెల్లడించింది. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే ఆసియా మార్కెట్లతో పాటు యూరోపి యన్ మా ర్కెట్లకు కూడా లాభాలతో ట్రేడ్ అయ్యాయి. డాలర్ మార కంతో రూపాయి స్వల్పంగా లాభపడి 71.03 వద్ద ట్రేడ్ అయ్యింది.

# 2025 నాటికి టీబీ రహిత రాష్ట్రాన్ని నిర్మిద్దాం

• గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్



**అమరావతి, ఆంధ్రప్రభ:** 2025 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను టీబీ రహిత రాష్ట్రంగా చేసేందుకు అందరం కలిసి కట్టుగా పనిచేద్దామని గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పిలుపునిచ్చారు. శుక్రవారం 70వ క్షయ నివారణ కార్యక్రమం రాజ్‌భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ హరిచందన్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ 2025 నాటికి టీబీ రహిత భారత్‌ని కాంక్షించి కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో కూడా ఆ దిశగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, నైపుణ్యం కలిగిన వైద్యులు, లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. టీబీ అనేది ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలకు సైతం సవాలుగా నిలుస్తోందన్నారు. 2017 నాటికి రాష్ట్రంలో 18 లక్షల మంది టీబీ రోగులు ఉండగా, 2018 నాటికి రాష్ట్రంలో 21.5 లక్షల మంది రోగులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయని, దీని ప్రకారం 15 శాతం రోగులు పెరగడం, ఆందోళన కలిగించే విషయమన్నారు. రాష్ట్ర టీబీ కంట్రోల్ సొసైటీ, జిల్లా టీబీ అసోసియేషన్లు, వైద్య, ఆరోగ్య శాఖల నివేదికల ప్రకారం గతంలో టీబీ నివారణకు 1985 నుంచి 12-15 నెలలు కాలపరిమితి ఉండగా 1996కు అది 6-8 నెలలుకు తగ్గడం సంతోషకరమన్నారు. ఈ విషయంలో రీవైజడ్ నేషనల్ టీబీ కంట్రోల్ ప్రోగ్రామ్ కింద ఈ ఫలితాలు రావడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 91.7 శాతం టీబీ నివారణకు అవసరమైన వసతులు ఉన్నాయన్నారు. టీబీ విషయంలో మరింత ప్రాచుర్యం కల్పించాల్సిన బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థలు, టీబీ కేంద్రాలపై ఉందన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ టీబీ నివారణకు అవసరమైన నిధుల సేకరణ వంటి కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్ ప్రదానం చేశారు. ఇందులో గుంటూరు జిల్లాకు మొదటి స్థానం రాగా, రూ.6లక్షల నగదు బెస్ట్ ఇన్‌స్టిట్యూషన్ అవార్డును డాక్టర్ అరుణ్‌కుమార్ కాంతిమహంతి, ఎఎంజీ ఇండియా ఇంటర్‌నేషనల్ ప్రసెడెంటు మరో రూ.6 లక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఆరోగ్య శ్రీ డైరెక్టర్ డాక్టర్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

# నిపుణుల కమిటీ ఎలా అంటే అలా!

• రాజధానిపై మంత్రి బొత్స



• వరల్డ్‌క్లాస్ అన్నారు... • గ్రాఫిక్స్‌లో తప్ప కన్పించలేదు • నిరాశతోనే విపక్షాల విమర్శలు

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్ర ఆదాయ, ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని 13 జిల్లాలు అభివృద్ధి చెందేట్లు 5 కోట్ల మంది అభివృద్ధికి ఆలోచన చేస్తూ నిపుణుల కమిటీ వేశామని, వారు నిర్ణయం తీసుకున్న తరువాతే రాజధానిపై నిర్ణయం ఉంటుందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ మరోమారు స్పష్టం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాజధానిపై నిపుణుల కమిటీ వేశామని, ఏదైతే శివరామకృష్ణకమిటీని వేసినప్పుడు వారి అభిప్రాయాలను తీసుకోకుండా నారాయణ అనే వ్యక్తితో కమిటీ వేసి ఒక ప్రాంతానికో, ఒక సామాజికవర్గానికో మేలు జరిగేలా చేసిన ఏర్పాటును అందరూ ఆక్షేపించారని చెప్పారు. వరల్డ్ క్లాస్ అన్నారని, అది గ్రాఫిక్స్‌లో తప్ప వాస్తవంలో కనిపించలేదని వ్యాఖ్యానించారు. ఈ ప్రభుత్వం గ్రాఫిక్స్‌తో మెప్పించాలనుకోవడం లేదని, వాస్తవికతతో పనిచేస్తోందని స్పష్టం చేశారు. గత నాలుగు నెలల కాలంలో తమ పార్టీకి చెందిన ఏ ఎమ్మెల్యే, కార్యకర్త కూడా ఇసుక దోపిడీ చేస్తున్నారనే వార్తలు రాలేదన్నారు. ఇంకా తెదేపా నేతలే అలా చేస్తున్నారని చెప్పారు. అలా దోపిడీకి అవాటు పడిపోయిన తిమింగలాలను ఎలా పట్టుకోవాలనే అంశంపై ఆలోచిస్తున్నామని వివరించారు. సీఎం కుర్చీలో పిచ్చోడ్ని కూర్చోపెట్టారని అయ్యన్న పాత్రుడు అంటున్నారని, ఇలా అంటున్నందుకే ప్రజలు వారిని ప్రతిపక్షంలో కూర్చోబెట్టారన్నారు. విశాఖ ల్యాండ్ స్కామ్‌కు అయ్యన్న పాత్రుడు సాక్షి కాదా అంటూ ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నారు కాబట్టి ఏది మాట్లాడినా సరిపోతుందనుకుంటే సరిపోదన్నారు. మద్యంపై జే టాక్స్ వేస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నారని విలేకరులు అడగ్గా, ఎక్కడైనా మద్యంపై ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారా అని ప్రశ్నించారు. కే టాక్స్, ఎల్ టాక్స్ చంద్రబాబుకు అలవాటని తమ ప్రభుత్వంలో ఎటువంటి టాక్స్ ఉండదన్నారు. ఉండేదల్లా ఒకటే విధానమని, ప్రజలకు ఏది మేలో అది చేయడమే తమ ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు.

## చంద్రబాబులో నిరాశ, నిస్పృహలు

చంద్రబాబులో నిరాశ, నిస్పృహలు ఆవరిం చాయని గత కొంతకాలంగా ఆయన చేస్తున్న ప్రకటనలు చూస్తే ఆయన మానసిక, ఆలోచనా తీరు బాగోలేదనే విషయం అవగత మవుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. చంద్రబాబులో అసహనం పెరిగిపోయిందేతప్ప వచ్చిన అవకాశాన్ని వృథా చేసుకున్నాననే భావన ఏమాత్రం ఆయనలో కనిపించడం లేదన్నారు. ఏదో తాను గొప్పగా చేశాను అని ఫీలవుతున్నట్లు కనిపిస్తోందన్నారు. ఇటీవల మాటలు చూస్తే విడ్డూరంగా ఉన్నాయని చెప్పారు. వయస్సు మీరిపోతుంది కాబట్టి డాక్టర్ల ద్వారా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం వారి కటుంబ సభ్యులకుందని సలహా ఇచ్చారు. ప్రజలకిచ్చిన ప్రతి మాటను ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని, దాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్ష తెదేపా లేనిపోని విమర్శలు చేస్తోందని మండిపడ్డారు. చంద్రబాబు ఆలోచనా సరళికి ఇది అద్దం పడుతుందన్నారు. నిజంగా తమ ప్రభుత్వ విధానాల్లో ఏమైనా లోటుపాట్లుంటే సలహాలు ఇవ్వాలిగాని, ప్రతి దానిని విమర్శించడం లేదంటే పథకాలను ఆయనే ప్రవేశపెట్టానని చెప్పుకోవడం ఏమీ బాగోలేదన్నారు. కంటివెలుగు, ఆరోగ్య శ్రీ, గ్రామ సచివాలయాలు తానే తెచ్చానని చెబుతున్న చంద్రబాబుకు కంటిచూపు మందగించినట్లుందని ఎద్దేవా చేశారు. అంతటితో ఆగకుండా 14 ఏళ్ల జైలు శిక్ష అని అధికారులను బెదిరిస్తున్న వైనం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేపై ఆరోపణలు వస్తే ప్రభుత్వం ఉపేక్షించలేదని, ఆయనను సైతం పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టడం జరిగిందన్నారు. కానీ చంద్రబాబు హయాం లోలా డీజీపీ వెంటనే మాట్లాడలేదని గుర్తుచేశారు. తహశీల్దార్ వనజాక్షి, ఐపీఎస్ బాలసుబ్రహ్మణ్యం విషయంలోగానీ, కాల్‌మనీ సెక్స్ రాకెట్ అంశంలోగానీ ఎంత మందిపై చర్యలు తీసుకున్నారో చెప్పగలరా అంటూ నిలదీశారు. విశాఖలో ఐదు నిమిషాలు కరెంటుపోతే డ్రామాలు చేశారని, రాజశేఖర్ రెడ్డి ఆయన్నుచూసి భయపడ్డారని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు చేసిన అడ్డగోలు కార్యక్రమాలను నియమనిబంధనలు లేకుండా చేసిన వ్యవహారాలను తాము భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో జరిగిన అస్తవ్యస్థ పాలన, దోపిడీని సక్రమంగా పెట్టడానికే తమకు సమయం సరిపోతోందన్నారు. రాష్ట్రానికి విభజన వల్ల జరిగిన అన్యాయం, నష్టం కంటే చంద్రబాబు దోపిడీ వల్లే ఎక్కువ నష్టం జరిగిందన్నారు.

ఖజానాను దోపిడీ చేసి దివాళా తీయించింది, ఎఫ్ఆర్‌బీఎంను మెయింటెన్ చేయకపోతే క్రమశిక్షణా లోపంతో పరిపాలన చేసినా వాటిని తాము సరిచేస్తున్నామన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు మారినప్పటికీ రూ. 5 వేల కోట్ల బకాయిలుంటే గొప్ప అని కానీ, చంద్ర బాబు హయాంలో అది రూ. 50 వేల కోట్లు చేశారని చెప్పారు.

విశాఖ బ్రాండ్‌ను చెడగొట్టారని చెబుతున్న చంద్రబాబు హుదూద్ తుపాను వస్తే ఆనందపురంలో రికార్డులు మార్చేసిన సంగతిని ఎందుకు మర్చిపోయారని ప్రశ్నించారు. భూ రికార్డులను టాంపరింగ్ చేసేందుకు ఉపయోగించుకున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు కుమారుడు, ఆయన తాబేదార్లు కలిసి విశాఖ బ్రాండ్‌ను చెడగొట్టారని విమర్శించారు.

# లక్ష్య సాధనకు కృషి

• విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలోని పాఠశాలల అభివృద్ధి, సంస్కరణలు తదితర అంశాలపై ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చడానికి ప్రణాళికతో పనిచేయాలని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలల్లో మౌలిక వసతులు, అవసరమైన ప్రతిపాదనలపై అధికారులతో చర్చించారు. అదేవిధంగా మరుగుదొడ్లు, నీటి వసతి, విద్యుత్ సదుపాయం, ప్రహరీ తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మన బడి కార్యక్రమంలో భాగంగా నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. విద్యా నవరత్నాలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పాఠశాలల ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పాఠశాల కమిటీ సభ్యులకు విధివిధానాలపై శిక్షణ ఇవ్వాలని మంత్రి అధికారులకు సూచించారు. పాఠశాలల అభివృద్ధిలో వారిని భాగస్వాములు చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ బి. రాజశేఖర్, కమిషనర్ సంధ్యారాణి, అధికారులు బాలకృష్ణన్, ప్రతాప్‌రెడ్డి, నాగరాజు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంతోనే రాష్ట్రాభివృద్ధి

• ప్రపంచ గుడ్డు దినోత్సవంలో మంత్రి తానేటి వనిత



**అమరావతి, ఆంధ్రప్రభ:** ప్రజలు ఆరోగ్యంగా ఉండి సుఖ, శాంతిగా ఉంటేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందినట్లని రాష్ట్ర మహిళా శిశు, సంక్షేమశాఖ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. ప్రపంచ గుడ్డు దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో మహిళా శిశు సంక్షేమం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ గతంలో మన రాష్ట్రంలో శిశు, బాలింత మరణాలు అధికంగా సంభవించే వని, ప్రస్తుతం ఆ మరణాల రేటు క్రమంగా తగ్గిందన్నారు. మాతా, శిశు సంక్షేమంపై వైసీపీ ప్రభుత్వం పెట్టిన దృష్టితోనే మరణాల రేటు తగ్గిందని, క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు కోడిగుడ్ల సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఇతర ఆహారాల్లో ఎందు లోనూ లేనివిధంగా కోడిగుడ్లలో శరీరానికి కావాల్సిన బలమైన లక్షణాలు ఉన్నాయన్నారు. అందువల్ల రోజుకో గుడ్డు తీసుకుని ఆరోగ్యవంతంగా మారాలని పిలుపుని చ్చారు. మన రాష్ట్రంలో కూడా గుడ్ల ఉత్పత్తి అధికంగా ఉందన్నారు. ఇక్కడి నుంచి విదేశాలకు గుడ్డు ఎగుమతులు అధికంగా జరుగుతున్నాయని, ఇతర దేశాల ప్రజలు గుడ్లను క్రమం తప్పకుండా ఆహారంలో తీసుకుంటారన్నారు. బాలబాలికలను చిన్నతనం నుంచే కోడిగుడ్లను ఆహార అలవాటుగా స్వీకరించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్నారులు, మహిళల ఆరోగ్యంపై ఎక్కువ దృష్టి పెట్టిందన్నారు. అందుకు అనుగుణంగా వివిధ సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించిందని పేర్కొన్నారు. బడ్జెట్‌లో కూడా దీనికి సంబంధించి ఎక్కువ నిధులు కేటాయిస్తూ బడుగు వర్గాల ఆరోగ్యంపై ఎక్కు శ్రద్ధ పెట్టినట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తూ అన్ని వర్గాల వారికి అండగా నిలుస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు గుడ్డులో ఉన్న పోషకాలు అందరికీ తెలిసేలా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందరి ఆరోగ్యం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు తప్పనిసరిగా చేసినట్లు పేర్కొన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థులపైనే ఆధారపడి ఉందని, అందువల్ల వారు ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అందరికి సమానమైన అవకాశాలు కల్పించేలా రాష్ట్రముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పశుసంవర్ధకశాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ ఆహారంలో కోడిగుడ్డు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఆహారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని, రాబోయే రోజుల్లో మన రాష్ట్రంలోనూ ఎక్కువ ప్రాధాన్యత ఆహారానికి ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

## గుడ్డు సంపూర్ణ ఆహారం

గుడ్డ సంపూర్ణ పోషక ఆహారమని, నాణ్యతలో రాజీపడకుండా సొంత లాభం మానుకొని పిల్లల ఆరోగ్యం కోసం ఆలోచించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆది మూలపు సురేష్ సూచించారు. ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా ఎగ్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎనికేపాడులోని బీవీ రావు కళ్యాణమండపంలో సభ జరిగింది. ఈ సభకు పశుసంవర్ధక శాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణ, శిశు సంక్షేమ శాఖ మంత్రి తానేటి వనిత, రైతు సాధికార కమిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి హాజరయ్యారు. ఈ సభలో మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యాశాఖకు నిధులు కేటాయింపులో ప్రత్యేక స్థానం కల్పించారన్నారు. అందులో భాగంగా విద్యాశాఖలో విద్యార్థులకు గుడ్డు సరఫరా కోసం దాదాపు రూ.250 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. రాబోవు రోజుల్లో ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా జిల్లాల వారీగా కేటాయింపులు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ధరలు, నాణ్యతను దృష్టిలో ఉంచుకొని నిబంధనలకు లోబడి సరఫరా చేసే వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. భవిష్యత్‌లో గుడ్డు ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. పౌల్ట్రీ యజమానులకు ప్రభుత్వ బకాయిలు ప్రాధాన్యత క్రమంలో చెల్లిస్తామన్నారు. అనంతరం పౌల్ట్రీ రైతులు అతిథులను సన్మానించారు.

# కోడెల వారసుడెవరు?

• అన్వేషణలో టీడీపీ అధిష్టానం • కోడెల శివరాంకు కేడర్ మద్దతు నో

• ప్రత్యామ్నాయ మార్గాలపై అధిష్టానం దృష్టి

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకుని చక్రం తిప్పిన మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు ప్రస్థానం అర్ధాంతరంగా ముగిసింది. రాజకీయ రాజధాని అయిన గుంటూరు జిల్లా టీడీపీలో కోడెల కీలక పాత్ర పోషించారు. పార్టీకి నమ్మిన బంటుగా వ్యవహరించిన ఆయనకు అనేక పదవులు వరించాయి. 36 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో 12 ఏళ్లపాటు మంత్రిగా, మరో అయిదేళ్ల పాటు స్పీకర్‌గా పనిచేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. వైకాపా ప్రభంజనంలో సత్తెనపల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసిన కోడెల శివప్రసాద్ ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత వైకాపా అధికారంలోకి రావటంతో ఒక్కసారిగా కోడెల చుట్టూ వివాదాలు ముసురుకోవటంతో



ఆయన ఆత్మ హత్యకు పాల్పడ్డ విషయం అందరికీ తెలిసిందే. ఆయన మరణంతో టీడీపీ గుంటూరు జిల్లాలో నష్టపోయే ప్రమా దంలో పడింది. ప్రత్యేకంగా కోడెలకు ఎంతో పట్టు ఉన్న నరసారావు పేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో కేడర్ పార్టీకి దూరమ య్యే పరిస్థితులు కనపడుతున్నాయి. ఈ నేపథ్యం లో అధిష్టానం కోడెల వారసుడ్ని వెతికే పనిలో పడింది. పల్నాటి రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేసుకున్న కోడెలకు ప్రత్యామ్నాయ నేతను ఎంపిక చేసేందుకు కార్యాచరణను రూపొందిస్తోంది. కోడెల కుమారుడైన శివరామ్‌ను సత్తెన పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమిస్తే పరిస్థితులు ఏ విధంగా ఉంటాయో అంచనాలు వేసింది. అయితే శివరా మ్‌కు ఈ బాధ్యతలు అప్పగించటపై కేడర్‌లో భిన్నా భిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోడెల శివప్రసాద రావు మరణించకముందు నుంచే ఆ నియోజకవర్గంలో రెండు వర్గాల మధ్య పోరు సాగుతోంది. రాయపాటి రంగారావు కొంతకాలంగా ఇదే నియోజకవర్గంలో ఉంటూ ఒక వర్గాన్ని నడిపిస్తున్నారు. ఆ వర్గం ఆది నుంచీ కోడెల శివరామ్‌ను వ్యతిరేకిస్తూ వస్తోంది.

కోడెల సొంత నియోజకవర్గం నరసారావుపేట అయినప్పటికీ ఆ నాటి పరిస్థితులు దృష్ట్యా 2014 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు ఆయన్ను సత్తెనపల్లి నుంచి పోటీ చేయించారు. కోడెల స్థానంలో సౌమ్యుడిగా, మంచి వైద్యుడిగా పేరుపొందిన అరవింద బాబును నరసారావుపేట నుంచి బరిలోకి దింపినప్పటికీ ఆయన ఓటమి పాలయ్యారు. అయితే సత్తెనపల్లి నుంచి కోడెల విజయం సాధించి, నవ్యాంధ్ర తొలి స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆనాటి నుంచీ గుంటూరు జిల్లా రాజకీయాలు ప్రత్యేకంగా పల్నాడు ప్రాంతమంతా కోడెల చెప్పుచేతల్లో నడిచింది. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో కోడెల తన తనయుడు శివరామ్‌ను నరసారావుపేట నుంచి బరిలోకి దింపాలని ప్రయత్నించినప్పటికీ చంద్రబాబు తిరస్కరించారు. నరసారావుపేట టికెట్‌ను అరవింద బాబుకు కేటాయించారు. అయితే ఎన్నికల్లో కోడెలతోపాటు అరవింద బాబు కూడా ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత పరిణామాల్లో కోడెల కుటుంబం కేసుల ఊబిలో చిక్కుకుంది. కోడెల కుమారుడు శివరామ్‌తో పాటు కుమార్తె విజయలక్ష్మీపై నరసారావుపేట, సత్తెనపల్లి పరిధిలో అనేక కేసులు నమోద య్యాయి. ఇదే సమయంలో అసెంబ్లీ ఫర్నిచర్ వ్యవహారం కోడెల శివప్రసాద్‌రావు మెడకు చుట్టుకుని రాష్ట్ర రాజకీయా ల్లో అభాసుపాలయ్యారు. దీంతో మనస్తాపం చెందిన కోడెల హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడ్డా రు. ఈ క్రమంలో నరసారావుపేట, సత్తెనపల్లి నియోజక వర్గాల బాధ్యతలను బలమైన నేతలకు అప్పగించాలని చంద్రబాబు నిర్ణయించారు. కోడెల మరణానంతరం ఆయన కుటుంబానికి న్యాయం చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కోడెల శివరామ్‌తో పాటు ఆయన అనుచరవర్గం నరసారావుపేట లేక సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారని ఆశతో ఉన్నారు. అయితే కోడెల శివరామ్‌పై భారీగా ఆరోపణలు ఉన్న నేపథ్యంలో అధిష్టానం ఈ నిర్ణయంపై ఆచితూచి అడుగులు వేస్తోంది. నరసారావుపేట ఇన్‌చార్జిగా అరవింద బాబును కొనసాగించాలని దాదాపుగా నిర్ణయించినట్లు సమాచారం. ఆది నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయటంతోపాటు, ప్రస్తుత పరిస్థితుల్లో కూడా చురుకుగా పనిచేస్తున్న ఆయనకే ఈ పదవి దక్కే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సత్తెనపల్లి నియోజకవర్గానికి సంబంధించి కోడెల హయాంలోనే పలువురు టీడీపీ నేతలు ఇతర పార్టీలకు వలస వెళ్లారు. ఈ నియోజకవర్గంపై రాయపాటి కుటుంబం కన్నేసింది. దీంతో ఇక్కడ కూడా నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి తీవ్ర పోటీ నెలకొని ఉంది. ఈ క్రమంలో అధిష్టానం కోడెల శివరామ్‌కు అవకాశం కల్పిస్తారా? లేక రాయపాటి కుటుంబానికి ప్రాతినిధ్యం ఇస్తారా? అన్న అంశం గుంటూరు రాజకీయాల్లో చర్చాంశనీయంగా మారింది.

# ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రంపై శ్రీవారి కటాక్షాలు ఉండాలి

• శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం

**తిరుమల, ప్రభన్యూస్:** రాష్ట్రం విడిపోయి ఇబ్బందుల్లో ఉందని కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి కృపాకటాక్షాలు రాష్ట్రంపై ఉండాలని ప్రార్థించానని శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ రెడ్డి సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నిసార్లు స్వామివారిని దర్శించుకున్నా తనివితీరదన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయి ఇబ్బందుల్లో ఉందన్నారు. మహానుభావుడైన శ్రీవేంకటేశ్వరస్వామి కటాక్షాలు రాష్ట్రంపై ఉండాలన్నారు. కాగా కొత్త ప్రభుత్వం ప్రకటించిన నవరత్నాలను, సంక్షేమానికి చాలా డబ్బులు అవసరం ఉంటుందని, సంక్షేమాన్ని చూస్తూ దాంతోపాటు రాష్ట్రఅభివృద్ధికి కూడా బాటలు వేయాలన్నారు. ఆ శక్తిని ముఖ్యమంత్రికి ఇవ్వాలని ఈ సందర్భంగా శ్రీవారిని కోరుకున్నానని చెప్పారు.

# సోలార్ పంపుసెట్ల ఏర్పాటుకు రాష్ట్రాలపై ఒత్తిడి

• ఫీడర్లు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మీటర్లు • వాణిజ్య సముదాయాలకు రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లు • విద్యుత్‌శాఖ మంత్రుల సదస్సులో కేంద్రం స్పష్టత

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** వ్యవసాయ అవసరాల కోసం రైతులకు సోలార్ విద్యుత్ మోటర్లను అందచేయటం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు సూచించింది. గుజరాత్‌లోని నర్మదా నది ఒడ్డున సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద కేంద్రం ప్రభుత్వం అన్ని రాష్ట్రాల విద్యుత్ శాఖల మంత్రులతో జాతీయ స్థాయి సదస్సును శుక్రవారం ప్రారంభించింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో గ్రీన్ ఎనర్జీ లక్ష్యంగా రాష్ట్రాలకు దిశానిర్దేశం చేస్తోంది. తొలిరోజు సమావేశంలో విద్యుత్ సంస్కరణలను వేగవంతంగా అమలు చేయాలని రాష్ట్రాలకు సూచించింది.దేశమంతటా ప్రతి ఇంటికీ నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని కోరింది. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని ఆదిశగా వేగవంతమైన కృషి జరగాలని సూచించింది. దేశంలో మొత్తం పదివేల మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం మేరకు సోలార్ పంప్‌సెట్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాని కోరింది. ఒక్కో రాష్ట్రానికి ఎన్ని సోలార్ వ్యవసాయ పంప్‌సెట్లు అవసరమో తెలపాలని కోరింది. కుసుమ్ పథకం కింద మొత్తం 17లక్షల పంపు సెట్ల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో గత జులై నుంచే పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విధానం చేపట్టింది. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి పలు కంపెనీలు ఉత్సాహం చూపుతున్నాయి. అయితేభూముల కేటాయింపులు, భూమి వినియోగపు మార్పిడిలో (నాన్ అగ్రికల్చర్) ఎదురవుతున్న సమస్యలు కొంత ప్రతిబంధకంగా ఉన్నాయి. ఇందుకు సంబంధించిన నిబంధనలను సరళతరం చేయాలని పునరుత్పాదక ఇంధన వనరుల డెవలపర్స్ కోరుతున్నారు. ఈ అంశాలపై రాష్ట్రాలు తగిన దృష్టిపెట్టాలని కేంద్రం ఈ సదస్సు ద్వారా రాష్ట్రాలకు సూచించింది. రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు డిస్కమ్‌లు ఈ దిశగా వేగవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. వర్తక , వాణిజ్య సముదాయాలపై రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్రోత్సాహం దిశగా రాష్ట్రాలు ప్రత్యేక పోర్టల్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. విద్యుత్ సరఫరా , పంపిణీలో పారదర్శక, ఖచ్చితత్వం పాటించేందుకు విద్యుత్ ఫీడర్స్ వద్ద , విద్యుత్ పంపిణీ సెంటర్ల వద్ద మీటర్లు ఏర్పాటు చేసుకుని , మీటర్ల నుంచి డాటా సేకరణ చేసుకుంటే ఆ డాటాను ఆధారంగా చేసుకుని తగిన విశ్లేషనలద్వారా వచ్చే ఏడాదికి విద్యుత్ అవసరాల అంచనాలు రూపొందించుకోవచ్చని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. పీపీఏలు కుదుర్చుకున్న విద్యుత్ ఉత్పత్తి సరఫరా సంస్థలకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించే దిశగా అన్ని రాష్ట్రాల డిస్కమ్‌లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్రం హెచ్చరించింది. 2020 మార్చినాటికి అన్ని రాష్ట్రాల్లో విద్యుత్ వ్యవస్థల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని తెలిపింది.

# టీఎస్ ఈఎస్ఐ స్కామ్... ఏసీబీ దూకుడు

• మరో ముగ్గురి అరెస్ట్ • స్కామ్ వెనుక పెద్దలు?

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో సంచలనం సృష్టిం చిన ఈఎస్ఐ స్కామ్ దర్యాప్తులో ఏసీబీ దూకుడు కొనసాగు తూనే ఉంది. ఏసీబీ అధికారుల విచారణలో ఎప్పటికప్పుడు ఈఎస్ఐ స్కాంలో కొత్తకోణాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. తవ్వేకొద్దీ అక్రమాలు బయటపడు తున్నాయి. ఈఎస్ఐలో పై స్థాయి నుంచి కింది స్థాయి వరకూ ఈ స్కామ్‌ను నిరాటంకంగా కొనసా గించినట్లు ఏసీబీ అధికారుల దర్యాప్తులో వెల్ల డైనట్లు తెలిసింది. ఈఎస్ఐ డైరెక్టర్ దేవికారాణి కనుసన్నల్లో ఈ వ్యవహారమంతా సాగి నప్పటికీ.. ఈ వ్యవహారం వెనుక పెద్దలెవరు? అన్న దిశగా ఏసీబీ అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. మొత్తంగా స్కామ్ వెనుక ఎవరున్నారన్నదానిపైనే ఏసీబీ అధికారులు కూపీ లాగుతున్నారు. తాజాగా ఈఎస్ఐ స్కామ్‌లో మరో ముగ్గురిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. తేజ ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, చర్లపల్లి ఫార్మాసిస్ట్ లావణ్య, వరంగల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా ఉన్న పాషాలు అరెస్టయిన వారిలో ఉన్నారు. రూ.28 కోట్ల మందుల కొనుగోళ్ల అవకతవకలకు రాజేశ్వర్‌రెడ్డి పాల్పడినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ కేసులో ఏసీబీ సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. అయితే ఈ ముగ్గురు పెద్ద మొత్తంలో ఈఎస్ఐ మందులను ప్రయివేటు ఆసుపత్రులకు తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరికంటే ముందు గత సోమవారం అరెస్ట్ అయిన వెంకటేశ్వర హెల్త్ కేర్ ఎండీ అరవింద్‌రెడ్డితో పాటు కె.లిఖిత్‌రెడ్డి, కె.రామిరెడ్డిలు ఇచ్చిన సమాచారం మేరకు వీరిని అదుపులోకి తీసుకోవడంతో ఈ స్కామ్‌లో మొత్తం అరెస్టుల సంఖ్య 16కు చేరాయి. ఈఎస్ఐ డైరెక్టర్ పద్మతో కలిసి అరవింద్‌రెడ్డి అక్రమాలకు పాల్పడినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈఎస్ఐకి పరికరాలు సరఫరా చేసినట్లుగా నకిలీ పత్రాలను సృష్టించి అవినీతికి పాల్పడ్డారని ఏసీబీ అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. ఓ వైపు ఈ స్కామ్‌లో ఎవరి పాత్ర ఎంతనే దానిపై ఏసీబీ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తూనే మరోవైపు ఈ స్కాం వెనక వుండి నడిపించిందెవరు? అన్నదానిపైనా ఫోకస్ పెట్టినట్లు సమాచారం. ఇక వరుస అరెస్ట్‌ల నేపథ్యంలో మిగతా అధికారుల్లో సైతం ఆందోళన వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. ఈఎస్ఐ డైరెక్టర్ దేవికారాణితో పాటు మరో ఆరుగురు నిందితులను రెండ్రోజుల పాటు ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారించిన సంగతి తెలిసిందే. అదే సమయంలో తాము ముందుగా రూపొందించుకున్న ప్రశ్నా వళిని, సోదాల సందర్భంగా సేకరించిన సాక్ష్యాలను సదరు నిందితుల ముందుం చి వారిపై ఏసీబీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. అయినప్పటికీ నిందితుల వద్ద నుంచి పూర్తి స్థాయిలో సమాచారాన్ని రాబట్టలేకపోయారని సమాచారం. ఏసీబీ అధి కారులు ఈఎస్ఐ స్కామ్‌లో తమ దూకుడును ఏమాత్రం తగ్గించడం లేదు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తూ మొత్తంగా కోట్లాది రూపాయల్లో జరిగిన ఈ స్కామ్‌ను నిగ్గుతేల్చే పనిలో పడ్డారు. గతంలో విజిలెన్స్ అధికారులు, ఏసీబీ అధికారులు, ఆడిటింగ్ అధికారులు ఈఎస్ఐలో నిర్వహించిన సోదాల్లో దాదాపు 300 కోట్ల మేర స్కామ్ జరిగిందని నిర్ధారించినట్లు తెలుస్తోంది. దీంతో ఇందుకు సంబంధించిన నివే దికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదించి చర్యలు తీసుకోవాలని కోరినట్లు సమా చారం. అనంతర కాలంలో ఏసీబీ అధికారులు ఈఎస్ఐ డైరెక్టర్ దేవికారాణితో పాటు 23 మంది ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన సంగతి విదితమే. ఈ సోదాల నిర్వహణలో ఏసీబీ అధికారులకు అసలు విషయాలు వెల్లడైనట్లు తెలుస్తోంది. తదనంతర పరిణామాల్లో తొలుత నిర్ధారించినట్లుగా చెప్పబ డుతున్న రూ.300 కోట్లు కాదు.. దాదాపు రూ.700 కోట్లపైబడే ఈఎస్ఐ స్కాం చోటు చేసుకుని ఉండొచ్చని ఏసీబీ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

## మెఘాపై ఐటీ దాడులు..!

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హైదరాబాద్‌లో ప్రముఖ నిర్మాణ సంస్థ మెఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్‌పై ఐటీ దాడులు నిర్వహించింది. తెలుగు రాష్ట్రాలలో రెండు ప్రభుత్వాల ముఖ్యమంత్రులు చేపడుతున్న, చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలను ఈ కంపెనీయే నిర్మించింది. నిర్మిస్తోంది. రెండు రాష్ట్రాల ముఖ్య మంత్రులు కేసీఆర్, జగన్‌లకు సంస్థ యజమా నులు సన్నిహితులనే ప్రచారం కూడా ఉంది. 15 కార్లలో 30 మంది అధికారులు వచ్చి మెఘా సంస్థ యజమానుల నివాసంలో గురు వారం అర్ధరాత్రి నుంచి తనిఖీలు చేయడం చర్చనీయాంశంగా మారింది. వివిధ మీడియా సంస్థల్లో, సోషల్ మీడియాల్లో జరుగుతున్న ప్రచారం ప్రకారం మెఘా కృష్ణారెడ్డి ఇల్లు కార్యాల యాల్లో సోదాలను ఏకకాలంలో ఐటీ అధికారులు చేపట్టారు. నగరంలోని జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులోని కార్యాలయం, బాలానగర్‌లోని కార్యా లయం, ఎంసీహెచ్ఆర్డీ సమీపంలోని ఇంట్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహి స్తున్నారు. ఈ వార్త పెద్ద వైరల్ అయింది.

**దాడులు కాదు, సాధారణ సోదాలే.. మెఘా సంస్థ వివరణ...**

తమ కార్యాలయాల్లో ఐటీ సోదాలు నిజమని మెఘా సంస్థ తెలిపింది. అయితే ఇవి సాధారణ తనిఖీలు మాత్రమేనని ఐటీ శాఖ ప్రకటించింది. ఈ తనిఖీలను సాధారణ మైన అంశాలుగా మాత్రమే పరిగణించాలని, ఫార్వర్డ్ మెసేజ్‌లను పట్టించుకోవద్దని కోరింది.

# ముట్టడితో దిగొచ్చిన సర్కార్



• బాధితుల డిమాండ్లపై ఎస్సీ కార్పొరేషన్ అధికారుల హామీ • నెలరోజుల్లో పరిష్కరిస్తామని వెల్లడి

**అమరావతి, ఆంధ్రప్రభ:** 2018-19 సంవత్సరంలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ బ్యాంక్ లింకు, నాన్ బ్యాంకు లింకు రుణాలు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ఎస్సీ కార్పొరేషన్ ఎండీ కార్యాలయం ముట్టడి ఉద్రిక్తంగా మారింది. తాడేపల్లిలోని కార్యాలయానికి వందలాదిగా తరలివచ్చిన దరఖాస్తుదారులను పోలీసులు నిలిపివేశారు. దీంతో ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం నినాదాలు నిరసనలతో దద్దరిల్లింది. కార్పొరేషన్ ఆవరణలో బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రుణార్థులను పోలీసులు నిర్బంధించడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ సమయంలో కార్పొరేషన్ అధికారులు వచ్చి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఇరువర్గాలు శాంతించాయి. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ 2018-19 సంవత్సరంలో రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం వేలాది మంది ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్నవారిలో 35 వేల మందిని అన్ని జిల్లాల కలెక్టర్లు రుణాలు పొందేందుకు ఎంపిక చేసినట్లు వివరించారు. ఎంపికైన వారిలో వందల మందికే రుణాలు మంజూరయ్యాయని, మిగిలినవారికి అందలేదన్నారు. బ్యాంకు లింకు రుణాలకు ఎంపికైన వేలాది మంది రూ. 40 వేల నుంచి రూ. 60 వేల వరకు వివిధ బ్యాంకుల్లో డిపాజిట్ చేశారని అన్నారు. అంతేగాక ఆన్‌లైన్ చేసుకునే సమయంలో వేల రూపాయలు ఖర్చు చేసుకున్న సంగతిని గుర్తు చేశారు. ఇలాంటి సమయంలో గత సంవత్సర రుణాలు నిలిపివేశామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి విశ్వరూప్ ప్రకటించడంతో రుణార్థత కలిగి, డబ్బులు ఖర్చుపెట్టుకున్న దరఖాస్తుదారులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారని వాపోయారు. తక్షణమే ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అర్హులందరికీ రుణాలిప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యారావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎఫ్డీసీ, ఎన్ఎస్ఎఫ్ కెడీసీ(నాన్‌బ్యాంకు లింకు)కు సంబంధించిన రుణాలు పొందేందుకు అర్హత కలిగిన వారు 2017-18, 2018-19కి సంబంధించిన వారు కూడా ఉన్నారన్నారు. వీరంతా ఆన్ లైన్, ఇంటర్వ్యూలు, కొటేషన్, ప్రాజెక్టు రిపోర్టు పేరుతో వేలాది రూపాయలు ఖర్చు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇవిగాక లబ్దిదారుల వాటాగా రూ. 10 వేల నుంచి రూ. 50 వేల వరకు ప్రభుత్వానికి చెల్లించారని వివరించారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు ఎండీ కార్యాలయం నుంచి కదిలేది లేదన్నారు. అంతకుముందు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన చలో ఎస్సీ కార్పొరేషన్ ఎండీ కార్యాలయంలో వందలాదిగా తరలివచ్చిన బాధిత దరఖాస్తుదారులు పాల్గొని ఎస్సీ కార్పొరేషన్ కమిషరరేట్ ను ముట్టడించారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ కార్యాలయం వద్ద రుణార్థులు, కెవిపిఎస్, డివైఎఫ్ఐ నాయకులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జి నటరాజ్, కృష్ణమోహన్, జి. క్రాంతిక ుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నెలరోజుల్లో పరిష్కరిస్తాం: కార్పొరేషన్ ఈడీ తులసీదేవి

రుణాల మంజూరు విషయంపై ఉన్నతాధికారులతో చర్చించిన అనంతరం నెల రోజుల్లో సమస్యని పరిష్కరిస్తామని కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీదేవి రుణార్థులకు, నాయకులకు హామీ ఇచ్చారు. నవంబర్ 15లోపు 15 వేల మందికి రుణాలు గ్రౌండింగ్ చేస్తామన్నారు. మిగిలిన రుణాల విషయంపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. సమస్యను పరిష్కరించేందుకు త్వరగా స్పందించిన తులసీదేవికి కెవిపిఎస్, డివైఎఫ్ఐ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన 20 వేల రుణాలపై అధికారులు తక్షణమే సానుకూలంగా స్పందించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆందోళనలు చేపట్టే పరిస్థితులు రాకుండా ఉండేందుకు ప్రయత్నిస్తామని అధికారులు తెలుపడంతో చలో ఎస్సీ కార్పొరేషన్ ఎండీ కార్యక్రమం ముట్టడిని విరమించారు.

## జగన్ గేట్లు తెరిస్తే తెదేపా ఖాళీ

• మంత్రి అవంతి శ్రీనివాస్



**అమరావతి, ఆంధ్రప్రభ:** వైకాపా అధినేత జగన్ గేట్లు తెరిస్తే తెలుగుదేశం పార్టీ ఖాళీ అవుతుందని, చంద్రబాబు తప్ప ఎవ్వరూ మిగలరని, టూరిజం శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. శుక్రవారం సాయంత్రం సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఫిరాయింపులకు తమ అధినేత జగన్ వ్యతిరేకమన్నారు. ఆయన గేట్లు తెరిస్తే బాబు ఎమ్మెల్యేలు, మాజీలు ఉంటారో లేదో తెలియని పరిస్థితి ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన స్థాయిని దిగజారి మాట్లాడుతున్నారని మంత్రి ధ్వజమెత్తారు. గత నెల రోజులుగా చంద్రబాబు వ్యవహారశైలి, భాష పరిశీలిస్తే బాధ్యత గల ప్రతిపక్షనాయకుడిగా వ్యవహరించడం లేదన్నారు. రౌడీ రాజ్యమని, పోలీసులు వైకాపాలో చేరితే బావుంటుందని చంద్రబాబు వ్యాఖ్యానించడం విచారకరమన్నారు. జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో విశాఖలో అదే పోలీసులు ఎయిర్‌పోర్టు నుంచి సిటీలోకి రానివ్వకుండా అడ్డుకున్న విషయం మరిచారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం మారినా వ్యవస్థ మారదన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. మూడు నెలల కాలంలో సీఎం జగన్ నాలుగు లక్షల ఉద్యోగాలు ఇవ్వడం రౌడీ రాజ్యమా అని ప్రశ్నించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, ఆటోడ్రైవర్లకు రూ.10వేల ఆర్థిక సహాయం, కంటి వెలుగు, వైఎస్ఆర్ రైతు భరోసా లాంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు చంద్రబాబు అనుకూలమా? వ్యతిరేకమా? అనే విషయాన్ని స్పష్టం చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో నిధులు దుర్వినియోగమయ్యాయని, తమ ప్రభుత్వ హయాంలో నిధులు దుర్వినియోగం కాకుండా ముఖ్యమంత్రి జగన్ పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కావడం తమ అధినేతకు ఇష్టం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికైనా తన స్థాయిని గుర్తెరిగి, ప్రజా సంక్షేమానికి సంబంధించి సలహాలు, సూచనలు స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి అవంతి స్పష్టం చేశారు. అంతకుముందు పర్యాటక, సాంస్కృతిక శాఖలపై ముఖ్యమంత్రి జగన్ చేసిన సమీక్షను మీడియాకు మంత్రి వివరించారు. గుంటూరులోని ఆర్కియాలజీ గ్రంథాలయంలో పరిశోధకులకు విలువైన పుస్తకాలు ఉన్నా సిబ్బంది లేకపోవడంతో వారంలో నాలుగు రోజులు మూసివేయడాన్ని మంత్రి దృష్టికి తీసుకురాగా ఈ విషయంపై పరిశీలిస్తామన్నారు.

## పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేం

• డీజీపీ గౌతమ్ సవాంగ్



**అమరావతి, ఆంధ్రప్రభ:** ప్రతి ఒక్కరూ ఎటువంటి ఆపదలో అయినా ఆశ్రయించేది పోలీసులనే అని, పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేమని, ఏపి డీజీపీ దామోదర గౌతమ్‌సవాంగ్ అన్నారు. పోలీసుల అమరవీరుల దినోత్సవం ఈ నెల 21న నిర్వహించనున్న సందర్భంగా ద్రోణ కన్సల్టెన్సీ అధినేత సురేష్ బేత రూపకల్పన చేసిన శౌర్యం, స్మృతి కరపత్రాలను డీజీపీ గౌతమ్‌సవాంగ్ విడుదల చేశారు. ఏపీ డీజీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో కరపత్రాల విడుదల అనంతరం డీజీపీ సవాంగ్ మాట్లాడుతూ పోలీసుల విధినిర్వహణ చాలా శ్రమతో కూడుకున్నదని, పోలీసు ఉద్యోగం 24 గంటలు సాగుతుందన్న విషయం ప్రజలకు తెలిసిందేనని అన్నారు. విధినిర్వహణలో పోలీసులు చేస్తున్న త్యాగాలు చాలా వరకు ప్రజలకు తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే పోలీసులు మాత్రం నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడంలో ముందుంటారని, పోలీసుల సేవాతత్పరత వల్లనే సమాజం సురక్షితంగా ఉంటోందని అన్నారు. అంతర్గత కలహాలు, మతవిద్వేషాలు, తీవ్రవాదుల ముప్పు, వివిధ రకాల నేరాలు, ప్రకృతి వైపరీత్యాలు, ఎన్నికల్లో విధుల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, విఐపిల భద్రత వంటి ఎన్నో సంక్లిష్టమైన విధుల్లో పోలీసులు పాల్గొంటున్నారని సవాంగ్ అన్నారు. అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నార్, ఏఐజీ భాస్కరభూషణ్, స్టాఫ్ ఆఫీసర్ అనిల్‌కుమార్ తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైతు భరోసాలో పేరుపై స్పందించిన మంత్రి సురేష్



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రప్రభుత్వ అమలు చేయనున్న వైఎస్ఆర్ రైతు భరోసా పథకంలో తన పేరు నమోదుపై విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ స్పందించారు. అధికారుల తప్పిదం వల్ల ఇలా జరిగిందన్నారు. విషయం తెలిసిన వెంటనే వ్యవసాయ అధికారులతో మాట్లాడి వివరణ కోరారు. జరిగిన తప్పిదంపై విచారణ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కాగా మంత్రి పేరుతో వెబ్‌ల్యాండ్‌లో వెంకటసుబ్బమ్మ ఆధార్ నంబరు(486703988746) నమోదు అయినట్లు అధికారులు విచారణలో తేలింది. మంత్రి పేరు వద్ద సీడింగ్ జరిగిందని గుర్తించిన అధికారులు జాబితాలో మంత్రి పేరు తొలిగించినట్లు ప్రకటించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఈ పథకంలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు మంత్రి సూచించారు.

## పదకొండు కేసుల్లో ముద్దాయికి సీబీఐకి లేఖ రాసే అర్హత ఉందా?

• డీజీపీ ద్వంద్వ వైఖరి వీడాలి
• టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య



**అమరావతి, ఆంధ్రప్రభ:** ప్రతి శుక్రవారం కోర్టు మెట్లెక్కుతూ, పదకొండు సీబీఐ కేసుల్లో, అయిదు ఈడీ కేసుల్లో ఏ2 ముద్దాయిగా ఉన్న విజయసాయిరెడ్డికి సీబీఐకి లేఖ రాసే అర్హత ఉందా? అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ధ్వజమెత్తారు. శుక్రవారం విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముద్దాయిగా బెయిల్‌పై ఉన్న విజయసాయిరెడ్డి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తన కేసుల విషయంలో లేఖ రాసుకునే స్వేచ్ఛ ఆయనకు ఉందని, అయితే ఇతరుల విషయాల్లో తలదూర్చటం ఎందుకని ప్రశ్నించారు. బెయిల్ రద్దైతే ఆక్షణాన జైలుకు వెళ్లాల్సిన ఆయన ఇలాంటి లేఖలు రాయటం దారుణమైన తప్పిదమన్నారు. సోషల్ మీడియాలో ప్రభాకర్ రెడ్డి అనే వైకాపాకు చెందిన వ్యక్తి మహిళా టీడీపీ నేతలపై నీచమైన పోస్టులు పెడుతున్నారని అతనిపై పోలీసులు చర్యలు ఎందుకు తీసుకోవటం లేదని వర్ల రామయ్య ప్రశ్నించారు. తమ పార్టీ నేతలు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు సరిగ్గా స్పందించటం లేదని, ప్రభాకర్ రెడ్డి అమెరికాలో ఉన్నారని సమాధానం చెప్పి తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. ఇదే విషయాన్ని శనివారం గుంటూరు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వర్ల రామయ్య తెలిపారు. ఇప్పటి వరకు టీడీపీ తరపున యాభై ఫిర్యాదులు సోషల్ మీడియా పోస్టులపై ఇచ్చామని అయినప్పటికీ ఒక్క కేసు కూడా నమోదు చేయకపోవటం, అరెస్టులు చూపించకపోవటం అత్యంత దారుణమన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉందని, ఏ పార్టీలకు తొత్తులుగా వ్యవహరించకూడదని వర్ల రామయ్య పేర్కొన్నారు. డీజీపీ స్థాయి వ్యక్తి ద్వంద్వ వైఖరి అవలంభించటం సరికాదన్నారు. అత్యున్నతస్థాయి అధికారులు ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా విధులు నిర్వర్తించాలన్నారు. సభ్యసమాజం సిగ్గుపడేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఎన్నారై ప్రభాకర్ రెడ్డిని అరెస్టు చేయాలని వర్ల డిమాండ్ చేశారు.

## గవర్నర్‌ను కలిసిన ప్రముఖులు



**అమరావతి, ఆంధ్రప్రభ:** గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ను పలువురు ప్రముఖులు శుక్రవారం రాజ్‌భవన్‌లో కలిసారు. ఎంపీ రఘురామకృష్ణంరాజు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ సీవీ రావులు గవర్నర్‌ను మర్యాపూర్వకంగా కలిసారు.

ఈ సందర్భంగా ఎంపీ రఘురామకృష్ణంరాజు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అలాగే మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ గవర్నర్‌ను కలిసి పలు విషయాలపై చర్చించారు.

## ఆధార్ వివరాల వెల్లడిలో అప్రమత్తం

• జాగ్రత్తలు పాటించండి • ఐఎస్‌బి డీన్ రాజేంద్ర హెచ్చరిక

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆధార్ వివరాల వెల్లడిలో అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ రాజేంద్ర శ్రీవాస్తవ హెచ్చరించారు. శుక్రవారం ఐఎస్‌బీలో డిజిటల్ ఐడెంటిటీ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీన్ రాజేంద్ర శ్రీవాస్తవ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలు, నగదు లావాదేవీల గుర్తింపు కార్డులు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు, ఆరోగ్య పరమైన అంశాలు, ఇతర వ్యక్తిగత సమాచారం ఆధార్‌తో అనుసంధానించటంపై ఇప్పటికే ఎంతో పురోగతి సాధించినట్టు తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే ఎంతో వ్యయం జరిగిందన్నారు. ఆధార్‌తో వ్యక్తిగత సమాచారం అనుసంధానించటం వల్ల ఉన్న ఉపయోగాలు, అప్రమత్తంగా లేకపోతే ఎదురయ్యే సమస్యలను వివరించారు. ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానించాలని కేంద్ర ఎన్నికల సంఘం కూడా నిర్ణయం తీసుకుందన్నారు. ఆధార్ వివరాలను ప్రభుత్వ పరమైనవాటికి అనుసంధానించటం వల్ల తగిన రక్షణ చర్యలు మరింత పటిష్టంగా ఉండాలన్నారు. అయితే ఆధార్ వివరాలు ఎక్కడ పడితే అక్కడ ప్రైవేటు వ్యక్తులకు, ప్రైవేటు సంస్థలకు ఇచ్చేటపుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆధార్ వివరాలను తెలుకుని వాటిని దుర్వినియోగం చేయకుండా తగిన చట్టాలు ఉన్నాయన్నారు. విదేశీ సంస్థలు, విదేశీ వ్యక్తుల చేతికి ఆధార్ వివరాలు వెళ్లినప్పుడు అక్కడ దుర్వినియోగం జరిగితే నియంత్రించే పదునైన చట్టాలు రావాల్సిన అవసరం ఉంద న్నారు. సుప్రీంకోర్టు వ్యక్తిగత సమాచార భద్ర తకే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. డాటా రెగ్యులేటరీ చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫేస్ బుక్, ట్విట్టర్, సోషల్ మీడియా పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డిజిటల్ ఐడెంటిటీలో ఎప్పటికప్పుడూ పరిశోధనల ఫలితాలు అప్‌డేట్ కావాల్సిన అవసరం ఉందని డీన్ రాజేంద్ర శ్రీవాస్తవ పేర్కొన్నారు.

## 2022 నాటికి ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయిలు

• వాటర్ గ్రిడ్ సమీక్షా సమావేశంలో మంత్రులు



**అమరావతి, ఆంధ్రప్రభ:** 2022 సంవత్సరం నాటికి రాష్ట్రంలో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయిల ఏర్పాటే లక్ష్యంగా పనిచేయనున్నట్లు మంత్రులు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో వాటర్ గ్రిడ్‌పై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, బొత్స సత్యనారాయణ, అనిల్ కుమార్ యాదవ్, ఉన్నతాధికారులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు, మాట్లాడుతూ రూ.46,675 కోట్లతో 30 ఏళ్ళ పాటు వినియోగపడేలా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 46,982 గ్రామీణ ప్రాంత హ్యాబిటేషన్లకు, 99 అర్బన్ ప్రాంతాలకు నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. మొదటి దశ రూ.37,475 కోట్లు, రెండో దశలో రూ.9200 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ద్వారా రూ.9,200 కోట్లు రుణం తీసుకోవడం జరుగుతుందన్నారు. రిజర్వాయర్ల నుంచి తాగునీటి అవసరాలకు పైపులైన్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాభావం కారణంగా భూగర్భ జలాలు అడుగంటుతున్న పరిస్థితులో అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో 1,110 అడుగులకు పడిపోయిన నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ఈ సందర్భంగా అధికారులు మంత్రులకు వివరించారు. అలాగే శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో చాలా కాలంగా భూగర్భ జలాల వినియోగం ఉన్న నేపథ్యంలో సర్ఫేస్ వాటర్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోదావరి జిల్లాల్లో ఆక్వా కల్చర్ కారణంగా భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని, ఇందుకు ప్రత్యామ్నాయంగా పైపులైన్ల ద్వారా త్రాగునీటిని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కడప, నెల్లూరు, జిల్లాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని, చిత్తూరు, కర్నూల్, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో తాగునీటి నాణ్యతలో ఇబ్బందులు ఉన్నాయని అధికారులు వివరించారు.

చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం, అనంతపురం జిల్లాల్లో ట్యాంకర్ల వినియోగం గణనీయంగా పెరిగిందని ఈ జిల్లాల్లో 2011లో 591 హ్యాబిటేషన్లు ఉండగా ఈ ఏడాదికి 6,267 హ్యాబిటేషన్లకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. జలజీవన్ మిషన్, ఎంజీఎన్ ఆర్ఈజీఎస్ పథకాలను వినియోగించుకుని అందులో తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా నిర్ణయం తీసుకున్నారు. జిల్లాల్లో జలాశయాలు, నదులు, నీటి వనరుల సభ్యతపై సమగ్ర అంచనాలు తయారు చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.

## టీఎస్ఆర్టీసీ కార్మికులకు ఏపీఎస్ఆర్టీసీ కార్మికుల మద్దతు

• రేపు డిపోల ఎదుట రాష్ట్రవ్యాప్త ధర్నాలు



**అమరావతి, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ కార్మికుల సమ్మెపై తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఆదివారం ఏపీఎస్ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో తొలిదశ ఆందోళనకు నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 128 డిపోల ఎదుట ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జేఏసీ కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు, కో-కన్వీనర్లు సిహెచ్.సుందరయ్య, వి.వరహాల నాయుడు తెలిపారు. తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెపై శుక్రవారం జేఏసీ, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గాల సమావేశం వేర్వేరుగా జరిగింది. ఆయా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల మేరకు తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని, అవసరమైతే దశలవారీ ఆందోళనా కార్యక్రమాల నిర్వహణ ద్వారా తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధంగా ఉండాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా అవసరమైతే దేశవ్యాప్త మద్దతు కూడగట్టనున్నట్లు తెలిపారు. దేశంలోని రవాణా రంగంలో పనిచేస్తున్న సంఘటిత, అసంఘటిత కార్మికుల మద్దతు కోసం కేంద్ర కార్మిక సంఘాలతో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. జేఏసీ నేతలు వైవిరావు, సుందరయ్య, వరహాల నాయుడు మాట్లాడుతూ తెలంగాణ సాధనకు కారకులైన ఆర్టీసీ ఉద్యోగుల ఆత్మాభిమానం దెబ్బతీసే విధంగా తెలంగాణ సీఎం కేసీఆర్ వ్యవహరించడం బాధాకరమన్నారు. తెలంగాణ ఆర్టీసీ జేఏసీతో చర్చలు జరిపి సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఏపీ ఆర్టీసీ కార్మికుల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. తొందరలోనే ఆర్టీసీ హౌస్ వద్ద నిరహారదీక్షలు చేయడంతో పాటు జేఏసీగా సీఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసి కేసీఆర్‌తో చర్చించడం ద్వారా డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు స్పష్టం చేశారు.

## దేశంలోకి ఈశాన్య రుతుపవనాలు

• విస్తారంగా వర్షాలకు అవకాశం • నైరుతి నిష్క్రమణ

**అమరావతి, ఆంధ్రప్రభ:** దేశంలోకి ఈశాన్య రుతుపవనాలు త్వరలో ప్రవేశించనున్నాయి. ఈ నెల 15 నుంచి 20వ తేదీ మధ్య ఈశాన్య రుతుపవనాలు దేశంలోకి ప్రవేశిస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాలు నిష్క్రమిస్తున్న తరుణంలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించడం వల్ల పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని, ముఖ్యంగా దక్షిణ కోస్తాంధ్రలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే అవకాశం లేకపోలేదని అధికారులు చెబుతున్నారు. ఇక ఈశాన్య రుతుపవనాల ప్రభావం రాష్ట్రంపై ఇప్పటికే పడింది. ఈ కారణంగా కోస్తా తీరం వెంబడి ఈశాన్య గాలులు వీస్తున్నాయి. ఈశాన్య రుతుపవనాల ప్రవేశ కాలంలో కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురవనున్నాయి. ఇదిలా ఉండగా శుక్రవారం నాడు కర్నూలులో, తెలంగాణా జిల్లాలు కొన్నింటిలో భారీ వర్షాలు కురిశాయి.

# విశాఖలో ముగ్గురి సజీవ దహనం

• గ్యాస్ లీకేజ్‌తో అగ్నిప్రమాదం
• ఉలిక్కిపడ్డ సాగర్‌నగర్ శాటిలైట్ సిటీ



**సాగర్‌నగర్ (విశాఖపట్నం), ప్రభన్యూస్:** విశాఖనగర శివారు బీచ్ రోడ్డును ఆనుకొని ఉన్న సాగర్‌నగర్ శాటిలైట్ సిటీ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున సంభవించిన గ్యాస్ లీకేజ్ ఘటనలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, అన్న, చెల్లి మొత్తం ముగ్గురు సజీవ దహనమయ్యారు. తండ్రి చల్లా ఉమామహేశ్వరరావు(65), కొడుకు సతీష్‌చంద్ర (38), కూతరు లావణ్య(32) మృతిచెందారు. అన్నాచెల్లి అగ్నికీలలకు 95శాతం కాలిపోయి అక్కడిక్కడే మృతిచెందారు. వృద్ధుడైన తండ్రి ఉమా మహేశ్వరరావును పోలీసులు కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. అయినప్పటీ ఫలితం లేకపోయింది. అక్కడ చికిత్స పొందుతూ ఆయన ప్రాణాలు కోల్పోయాడు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ సీఐ కృష్ణకిశోర్‌కుమార్ విలేకర్లకు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తండ్రి చల్లా ఉమామహేశ్వరరావు ఆర్టీసీలో జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ రిటైర్మెంట్ అయ్యారు. కూతురు, కొడుకు ఇంజనీరింగ్ పూర్తి చేసి ఖాళీగానే ఉంటున్నారు. సాగర్‌నగర్ హెచ్ఐజీ-2/101లో ముగ్గురూ కలిసి గత నాలుగేళ్ల నుంచి నివాసముంటున్నారు. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఇంటి నుంచి హఠాత్తుగా మంటలు, పొగలు, అరుపులు రావడంతో ఇరుగు పొరుగు నివాసులు ఉలిక్కిపడి వెళ్లారు. ఇంట్లో అగ్నికీలలు అలుముకున్న మంటలను కిటికీల నుంచి వస్తున్న పొగలు, చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే లోపల గదుల్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు మంటల్లో చిక్కుకుని హాహాకారాలు చేస్తూ సగం కాలిపోయారు. స్థానికులు లోపల ఉన్నవారిని రక్షించడానికి ప్రయత్నించినా బయట గుమ్మం గేటుకు తాళాలు వేసి ఉన్నాయి. దీంతో బాధితులను కాపాడేందకు స్థానికులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈలోగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు రాగానే పక్కింటి వాళ్లంతా హడలిపోయి వారి ఇంటి విద్యుత్‌ను నిలిపి వేసుకున్నారు. చీకట్లోనే అగ్నిమాపక సిబ్బంది బ్యాటరీ లైట్లతో లోపల ఎగిసిపడుతున్న గ్యాస్ మంటలను నివారించే ప్రయత్నం చేసి లోపలకు వెళ్లారు. అప్పటికే కొడుకు సతీష్‌చంద్ర, కుమార్తె లావణ్య మృతిచెందారు. తీవ్రంగా గాయపడి కొనఊపిరితో కొట్టుమిట్టులాడుతున్న వృద్ధుడైన ఉమామహేశ్వరరావును ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇంటి ఆవరణలో వంట గది పక్కనే రెండు గ్యాస్ సిలెండర్ల పైపులు ఆన్ చేసి ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనలో బెడ్‌రూమ్‌లోని బీరువా, ఫ్రిజ్, విలువైన సోఫాలు, సీలింగ్ ఫ్యాన్లు, పుస్తకాలు, ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. అలాగే ఇంటి కిటికీలు, తలుపులు కాలిపోయాయి. అంతేకాకుండా వీరి ఇంటి వెనుక నివాసముంటున్న హెచ్ఐజీ-2/102 ఫ్లాట్‌లో కూడా గ్యాస్ లీకేజ్ చోటు చేసుకోవడంతో వారింట్లోని కొన్ని వస్తువులు కూడా కాలిపోయి అస్తవ్యస్తంగా మారింది. ఆ ఇంటి గృహిణి సరితకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనపై నగరం నుంచి క్లూటీమ్ కూడా హుటాహుటిన వచ్చి విచారణ చేపట్టింది. వారి దర్యాప్తులో కొన్ని కీలకమైన ఆధారాలు లభించినట్టు పోలీసులు చెబుతున్నారు.

### గ్యాస్ లీకేజ్ ఘటనపై ఎన్నో అనుమానాలు

గ్యాస్ లీకేజ్ సంఘటనపై పోలీసులు, స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. క్లూటీమ్‌కు కొన్ని ముఖ్యమైన ఆధారాలు లభించినట్టు పోలీసులు చెబుతున్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా కావాలనే ప్రణాళికాబద్ధంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. ఏ సమయంలో ఏ పనిచేయాలనే అంశంపై చిన్న చీటి రాసికొని ఉంచుకున్నారని క్లూటీమ్ వివరించారని పోలీసులు అంటున్నారు. ఇదే ఇంట్లో నివాసముంటున్న తండ్రి, కొడుకు, కూతురుకు కూడా ఇరుగుపొరుగు వారితో ఎలాంటి సన్నిహిత సంబంధాలు ఉండేవి కాదని, బయటకు వచ్చి వెంటనే తలుపులు వేసుకొని లోపలే ఉండేవారని పక్కింటివాళ్లు చెబుతున్నారని తెలిపారు. పోలీసులు ప్రాథమిక విచారణ మేరకు అర్ధరాత్రి ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీక్ చేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్నారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? లేక ఆత్మహత్యాయత్నమా? అన్న దానిపై భిన్న కోణాల్లో విచారణ చేపట్టారు. ఈ కుటుంబానికి చెందిన బంధుమిత్రులు రాయపూర్‌లో ఉన్నట్టు తెలిసిందని, వారికి సమాచారం అందించామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

# ఉన్మాది పాలనలో అన్నీ కష్టాలే!

- తెదేపా ఓటమికి జనసేన కారణం కాదు
- మందుబాబుల రక్తమూ తాగేస్తున్న జగన్
- స్థానిక ఎన్నికల్లో తెదేపాదే విజయం
- విశాఖ జిల్లా తెదేపా సమీక్షలో చంద్రబాబు



**విశాఖపట్నం, ప్రభన్యూస్:** తెలుగుదేశం పార్టీ గత సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోవడానికి జనసేన పార్టీ కారణమని జరుగుతున్న ఊహాగానాలు నిజం కాదని మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా రెండు రోజుల సమీక్షా సమావేశం ముగింపు శుక్రవారం విశాఖ ఎన్టీఆర్ భవనంలో జరిగింది. శుక్రవారం తెల్లవారు జామున నాలుగు గంటల వరకూ సమీక్ష జరిపిన తొలి రోజు కార్యక్రమం తరువాత తిరిగి పదకొండు గంటలకు రెండో రోజు సమీక్ష జరిపిన చంద్రబాబు నాయుడు పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపారు. అలాగే కార్యకర్తలూ అధినేతకు పలు ప్రశ్నలు సందేహాలను సంధించారు. దీనికి చంద్రబాబునాయుడు సంయమనంతో సమాధానాలు చెప్పారు. సిటీలోని నాలుగు నియోజక వర్గాల్లోనూ గెలిచినా మిగిలిన అన్ని స్థానాల్లోనూ ఓడిపోవడానికి కారణం పవణ్ కల్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ గెలుపు కోసం తెదేపా సానుకూలంగా వ్యవహరించడమేనన్న సందేహాలను ఆయన నివృత్తి చేసారు. అదే నిజమైతే, నేరుగానే పొత్తు పెట్టుకునేవారమని చంద్రబాబు వివరణ ఇచ్చారు. పార్టీలో లోపించిన సమన్వయం, కార్యకర్తలను పట్టించుకోని నాయకులూ వంటి సమస్యలను కూడా కార్యకర్తలు ప్రస్తావించగా బాబు సమాధానాలిచ్చి సంతుష్టిని పంచారు. అనంతరం శుక్రవారం రాత్రి ఇదే ప్రాంగణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్మాది జగన్ పాలనలో ప్రజలు కష్టాలు పడుతున్నారని చెప్పారు.

కరెంటు కష్టాలు, ఇసుక కష్టాలు, మద్యం పేరుతో రక్తం తాగేస్తుండడం, జే టాక్స్(జగన్ టాక్స్) బాధలు, అభివృద్ధికి రీటెండరింగ్ పేర తిలోదకాలివ్వడం, పోలవరాన్ని నిలిపివేయడం, అమరావతికి ఆటంకాలు, అన్నక్యాంటీన్ల నిలిపివేత, హామీలిచ్చిన ఏ ఒక్కటీ చేయకపోవడం వంటి వాటితో జగన్మోహన్ రెడ్డి పాలన ప్రజాకంటకంగా ఉందన్నారు. ప్రజలను చైతన్యం పరిచి, వారిలో విస్తృత చర్చ జరిగేలా చేయాల్సి ఉందన్నారు. ఈ విషయంలో తెదేపా శ్రేణులూ గట్టి ప్రయత్నం చేయాలని ఆయన భావించారు. రాబోయే నవంబరు, డిసెంబరు నెలల్లో పార్టీ సంస్థాగత ఎన్నికలు జరగనున్నాయని చెబుతూ అన్ని స్థాయిల్లోనూ పార్టీని పటిష్టంగా పునర్నిర్మాణం చేస్తామని చెప్పారు. ఈ విషయంలో పార్టీ ప్రతిభకూ, ప్రజలతో మమేకమయ్యేవారికే ప్రాధాన్యం ఇస్తుందన్నారు. పనిచేయని, ప్రజలకు దూరంగా ఉండే వారిని రీకాల్ చేసుకుని సరైన వారిని తిరిగి ఎన్నుకునే అవకాశం కూడా కల్పించి పార్టీ పటిష్టతకూ, ప్రజా సేవకూ కట్టుబడి ఉండే వారినే పార్టీ ఇకమీదట గుర్తించి ప్రోత్సహిస్తుందని వివరించారు. ఏ రోజున ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండేలా కూడా పార్టీ కేడర్‌ను సిద్ధం చేస్తామని, స్థానిక ఎన్నికల్లో తెదేపా విజయ కేతనం ఎగరేసి తీరుందని ఆయన ప్రగాఢ విశ్వాసం వెలిబుచ్చారు. అనుకోని విధంగా జమిలి కారణంగా ఎన్నికలు వచ్చినా తెదేపా తిరిగి అధికారం పొందేలా పార్టీని సంసిద్ధం చేసుకుంటామని చంద్రబాబునాయుడు వెల్లడించారు. జగన్, కేసీఆర్‌లు కలసి గోదావరి నీళ్ల విషయంలో రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో నీళ్ల విషయంలో గొడవలు జరిగే పరిస్థితి రాకూడదన్నారు. నాలుగు నెలలుగా ప్రజా వ్యతిరేక విధానాలుతో నీచంగా, అత్యంత దారుణంగా జగన్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని చెప్పారు. తెలియకపోతే తెలుసుకుని చేయాలని చెబుతూ ఇది తప్పు అని చెబితే అణచివేతకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేసులు పెట్టి వేధిస్తున్నారని చెబుతూ జగన్ అండ చూసుకుని రెచ్చిపోయే పోలీసులు అతిగా ప్రవర్తిస్తే చట్టపరంగా కేసులు పెడతామని చెప్పారు. ఇప్పటికే జగన్ కూడా ఉన్నవాళ్లు జైల్‌లో ఉండి వచ్చారని, వీరికీ అదేగతి పట్టవచ్చన్నారు. పార్టీ అధినేతగా నాకు స్వాగతం చెప్పేందుకు వచ్చిన వారిని అడ్డుకుని ఇదేంటని అడిగిన మా పార్టీ ఇద్దరు ఎమ్మెల్యేలపై కేసులు పెడతారా అని ప్రశ్నించారు. జగన్ పాదయాత్రకూ ఇలాగే తమ పార్టీ వ్యవహరిస్తే ఆయన ముందుకు అడుగు వేసేవారా? అని గుర్తు చేసారు. మంచి పనులు చేసినా తమను ఓడించిన ప్రజలు ఇప్పుడు చేసిన తప్పిదం పట్ల బాధపడుతున్నారని, కానీ అభివృద్ధి ఆగిపోవడానికి కూడా కారణం అయ్యారని చెప్పారు. ఓటమికి కారణం తెలియడం లేదన్నారు. విశ్లేషణకు అందని ప్రజల ఆలోచన ఎందుకు చేసారో వాళ్లే తెలుసుకుంటారని చెప్పారు. కార్యకర్తలే తెదేపాకు నాయకులని వారే రాబోయే రోజుల్లో ప్రజలతో మెలిగి అధికారంలోకి వస్తారన్నారు.

జమ్ముకాశ్మీర్ అంశం గురించి మీడియా అడిగిన ప్రశ్నకు చంద్రబాబు నాయుడు తామూ మద్దతిచ్చామని చెప్పారు. వెల్ఫేర్‌కు కొత్త అర్థం చెప్పిన వాడినని చంద్రబాబునాయుడు చెబుతూ తెలంగాణలో తెదేపాను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లుగా వివరించారు. వరుసగా నాలుగేళ్లు 11 శాతం వృద్ధినిచ్చి దేశంలోనే నెంబర్ వన్‌గా తమ హయాంలో పాలన చేసామన్నారు. స్థానికంగా ఉన్న చిన్న చిన్న అంతర్గత నాయకత్వ సమస్యలను సర్దుబాటు చేస్తానని చెప్పారు. కార్యకర్తలపై అధికార పార్టీ పెడుతున్న కేసుల నేపథ్యంలో లీగల్‌గా సపోర్టు ఇస్తూ ఆర్థికంగా కూడా అండగా ఉంటామని చెప్పారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకటరావు, హోంశాఖ మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, వాసుపల్లి గణేష్ కుమార్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణ మూర్తి, పీలా గోవింద సత్యనారాయణ, కేఎస్ఎన్ రాజు, గండి బాబ్జి, ఇతర నాయకులు శ్రీ భరత్, డాక్టర్ బంగారయ్య, దాసరి వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతున్నాం!

- పెండింగ్‌లో రూ. 42 వేల కోట్ల బిల్లులు
- మరో రూ.23 వేల కోట్ల అప్పులు
- తెదేపా హయాంలో డిస్కంలకు రూ.20 వేల కోట్ల బకాయిలు
- ఆర్థిక మంత్రి బుగ్గన వెల్లడి



**అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో:** రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందులు వెంటాడటానికి గల కారణం గత ప్రభుత్వ విధానాలే ప్రధాన కారణమని, ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి మరింత ప్రమాదకరంలో పడటానికి కూడా వారి నిర్ణయాలే కారణమని ఆర్థికశాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ స్పష్టం చేశారు. రూ. 42 వేల కోట్ల పెండింగ్ బిల్లులతో కలిపి విచ్చలవిడిగా అప్పులు చేసి ఏకంగా రూ. 65 వేల కోట్లు అప్పులు మిగిల్చారని, వాటన్నింటినీ ఒక్కొక్కటిగా చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి వివరించారు. ఈమేరకు ఆయన శుక్రవారం సచివాయలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు తెదేపా ప్రభుత్వం రూ.14,857 కోట్ల మేర బకాయిలు పడిందని, అలాగే డిస్కంలకు మరో రూ. 20 వేల కోట్లతోపాటు 45 రోజుల్లో 36 పీపీఏలకు 25 ఏళ్లకు ఒప్పందాలు కుదుర్చుకుందని, ఫలితంగానే విద్యుత్ రంగంలో కొత్త సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. వాటన్నింటినీ సీఎం జగన్ పరిష్కరించుకుంటూ చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నారన్నారు. మధ్యాహ్న భోజన పథకం, డైట్ ఛార్జిలు, విద్యార్థుల ఉపకార వేతనాలు, స్థానిక సంస్థలు, ఆస్పత్రుల్లో మందులు, చివరికి వైద్యశాలలో దూది వంటి వాటికి కూడా గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా ఏకంగా రూ. 42 వేల కోట్లు బకాయిలు పడిందన్నారు. అలాగే ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా 9 నెలల నుండి 12 నెలలపాటు వేతనాలను కూడా చెల్లించలేదన్నారు. వీటితోపాటు వివిధ కార్పొరేషన్ల కింద తీసుకున్న అప్పులను కూడా దారి మళ్లించిందన్నారు. అన్ని అప్పులు కలుపుకుంటే ప్రస్తుతం చెల్లించాల్సిన బిల్లులు రూ. 65 వేల కోట్లు మేర ఉన్నాయన్నారు. వాస్తవానికి ఏ ప్రభుత్వమైనా దిగిపోయే ముందు రూ. 5 వేల కోట్లకు మించి బిల్లులు పెండింగ్‌లో ఉంచదని, తెదేపా మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించిందని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, అవకతవకలన్నింటినీ ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ వస్తున్నామని వెల్లడించారు. అలాగే విద్యుత్ సంస్థలకు సబ్సిడీకానీ, ఇతర బిల్లులుగానీ సక్రమంగా చెల్లించలేదని వివరించారు. గత ప్రభుత్వం మొత్తం రూ. 14,857 కోట్లు బకాయిలు పడిందని, మరోవైపు విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు రూ. 20 వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. కేవలం 45 రోజుల్లో 25 ఏళ్లకోసం 36 విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకుని రాష్ట్రానికి తీరని నిష్టాని తెచ్చిపెట్టిందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, విద్యుత్ సరఫరాలో స్వల్ప అంతరాయాలు, మద్యం విక్రయాలపై టీడీపీ అధినేత చంద్రబాబు, అప్పటి ఆర్థిక మంత్రి యనమలరామకృష్ణుడుతోపాటు పలువురు తెదేపా నేతలు చేస్తున్న ఆరోపణలు, విమర్శలపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. రాష్ట్ర విద్యుత్ ఆర్థిక సంస్థ రూ. 3 వేల కోట్ల అప్పులకోసం ఎస్‌బీఐని ఆశ్రయిస్తే క్రిసల్, బ్రిక్ వర్క్ సంస్థలు రేటింగ్ ఇవ్వకపోవడంతో తిరస్కరించాయని తెదేపా ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. వాస్తవానికి ఆ రేటింగ్ చాలా గోప్యంగా ఉంటాయని, అలాంటప్పుడు అవి బయటకు ఎలా వచ్చాయో తెలియజేయాలని డిమాండ్ చేశారు. అయితే, నిజానికి ఎస్‌బీఐ ప్రభుత్వం అవుట్ స్టాండింగ్, గ్యారెంటీని మాత్రామే ప్రస్తావించిందని వివరించారు. 2017లో కేవలం రూ. 9,665 కోట్లు ఉన్న ఆ గ్యారెంటీ మొత్తం 2018 నాటికి రూ. 35,964 కోట్లకు పెరగడాన్ని బ్యాంకు ప్రశ్నించిందని, ఆ సమయంలో అధికారంలో ఉంది తెదేపా ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రప్రభుత్వం రెగ్యులర్‌గా ఆర్‌బీఐ నుండి తీసుకునే రుణంలో భాగంగా ఈఏడాది అక్టోబరు 7న రూ. వెయ్యి కోట్లు కావాలని కోరితే అది రూ.2,500 కోట్లుగా ఓవర్ సబ్‌స్క్రైబ్ అయిందని వివరించారు. ఇది తమ ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి ప్రతిరూపమని, ఎంతో నమ్మకం ఉంటేనే అంత మొత్తం రుణంగా ఇస్తారని చెప్పారు. అలాగే 2018-19లో తెదేపా ప్రభుత్వం 43 రోజులు ఓడీకి వెళ్లగా అందులో ఒక్క ఏప్రిల్, మే నెల్లోనే 14 రోజులున్నాయన్నారు. ఇంకా తమ ప్రభుత్వం అధికారం చేపట్టడానికి ముందు ఈఏడాది జూన్‌లో కూడా 8 రోజులు ఓడీకి వెళ్లారన్నారు.

## విద్యుత్ రంగంపై అసత్యాలు ఆపండి

రాష్ట్రంలో విద్యుత్ రంగంపైన తెదేపా అనేక అసత్యాలు ప్రచారం చేస్తోందని, వాటిని ఇకనైనా ఆపాలని ఆయన సూచించారు. గత ప్రభుత్వం నిర్వాహం వల్లే ఈ రంగంలో ఇబ్బందులెదురవుతున్నాయన్నారు. డిస్కంలకు సబ్సిడీ బకాయిలను కూడా చెల్లించలేదన్నారు. 2018-19లో విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ. 6,030 కోట్లు సబ్సిడీ చెల్లించాల్సి ఉండగా బడ్జెట్‌లో రూ.2,500 కోట్లు మాత్రమే కేటాయించారని చెప్పారు. చివరకు అందులో సగమే అంటే రూ. 1,250 కోట్లు మాత్రమే ఇచ్చారని, ఆ సబ్సిడీ ఇప్పుడు ఏకంగా రూ. 4,780 కోట్లకు చేరిందన్నారు. 2014 నుండి 2019 వరకు తెదేపా ప్రభుత్వం విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కంలకు) మొత్తం రూ. 9,256 కోట్లు సబ్సిడీ బకాయి పడిందని మంత్రి తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం వాడుకున్న విద్యుత్ బిల్లులు మరో రూ. 5,601 కోట్లు ఉన్నాయన్నారు. మరోవైపు విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు రూ. 20 వేల కోట్లు బకాయిపడిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగంలో నష్టం రూ. 7,200 కోట్ల నుండి రూ. 14 వేల కోట్లకు పెరిగిందన్నారు. చౌక ధరకే థర్మల్ విద్యుత్ అందుబాటులో ఉన్నా పవన విద్యుత్ కొనుగోలుచేసి ఆ రంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీశారన్నారు. ఫలితంగా రూ.2,767 కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు.

## మద్యం ధరలు పెంచింది బాబే

రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధానికి కట్టుబడిన వైసీపీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోందన్నారు. అందుకే మద్యం షాపులను 3,500కు తగ్గించామని చెప్పారు. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా నేరుగా అమ్మకాలు సాగించడం ద్వారా రిటైలర్ల కమిషన్ కూడా ప్రభుత్వానికి ఆదాయంలా వస్తుందన్నారు. మద్యంపై చంద్రబాబు 2015లో 78 శాతం ఎక్సైజ్ డ్యూటీ విధించారన్నారు. ఆ తరువాత 2017 జూలైలో అదనంగా విధించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 2014లో తెదేపా అధికారంలోకి వచ్చేసరికి 1.23 లక్షల కోట్లు అప్పులు ఉండగా అది రూ.2.58 లక్షల కోట్లకు గడచిన ఐదేళ్లలో పెరిగిందన్నారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న అప్పులను కూడా పరిగణలోకి తీసుకుంటే మొత్తం రూ. 3.62 లక్షల కోట్లకు అప్పులు చేరాయని తెలిపారు. అదే విధంగా కాంట్రాక్టర్లకు, పౌర సరఫరాల సంస్థలకు ఇష్టానుసారంగా నిధులు దారి మళ్లించి బిల్లులు చెల్లించారని, ఫలితంగానే నేడు ఆర్థికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

తలసరి ఆదాయంలో కూడా గతంలో పోల్చుకుంటే తెదేపా హయాంలో ఆశించిన స్థాయిలో పెరగలేదన్నారు. ఎన్నికల ముందు హడావిడిగా రూ.38 వేల కోట్లు గ్రాంటు తీసుకుని వివిధ పథకాలకు దుబారా చేశారన్నారు. అయితే, గత ప్రభుత్వం చేసిన తప్పిదాలవల్ల ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందుల్ని తమ ప్రభుత్వం ధీటుగా ఎదుర్కొంటోందని, వాటన్నింటినీ ఒక్కొక్కటిగా చెల్లిస్తూ వస్తున్నామని వచ్చే డిసెంబరు నాటికి వీలైనంత వరకు క్లియర్ చేస్తామని వివరించారు.

# మాజీ మంత్రి కొల్లు రవీంద్ర దీక్ష భగ్నం

- అరెస్టు చేసిన పోలీసులు
- నివాసంలోనే దీక్ష కొనసాగింపు
- మచిలీపట్నంలో ఉద్రిక్తత



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రవ్యాప్తంగా ఇసుక కొరతపై తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర చేపట్టిన 36 గంటల నిరసన దీక్షను పోలీసులు భగ్నం చేశారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర దీక్షకు పోటీగా వైకాపా నేతలు దీక్షకు సిద్ధపడటంతో మచిలీపట్నంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే సమయంలో డీఆర్‌సీ సమావేశం కూడా ఉండటంతో పోలీసులు కొల్లు రవీంద్ర దీక్షకు అనుమతించలేదు. అయినప్పటికీ శుక్రవారం మచిలీపట్నంలోని కోనేరు సెంటర్‌లో దీక్షకు సిద్ధమైన ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, తెదేపా నేతలు, కార్యకర్తలకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకొని ఆర్‌ఆర్‌పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. అంతకు ముందు కొల్లు రవీంద్ర దీక్షకు హాజరుకాకుండా మరికొందరు తెదేపా నేతలను కూడా పోలీసులు ముందస్తు గృహ నిర్బంధంలో ఉంచారు. ఎమ్మెల్సీ, జిల్లా తెదేపా అధ్యక్షుడు బచ్చుల అర్జునుడుతో పాటు మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణను గృహ నిర్బంధం చేశారు. అరెస్టు అనంతరం కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ ఇసుక కొరతపై అహింసా మార్గంలో దీక్ష చేపడితే పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమన్నారు. గురువారం రాత్రి నుంచే వేధింపులకు పాల్పడినట్లు ఆయన ఆరోపించారు. రెండు పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పి తనను నివాసానికి తీసుకొచ్చారని తెలిపారు. సీఎం జగన్ నియంతలా వ్యవహరిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నట్లు మండిపడ్డారు. ఇసుక కొరతతో రాష్ట్రంలో 20లక్షల మంది కార్మికులు రోడ్డున పడ్డారని, కొత్త పాలసీ వచ్చి రెండు నెలలు గడిచినా ఇంతవరకు సామాన్యులకు ఇసుక అందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైకాపా నేతలు ఇసుకను తరలించి జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. ఇదే విషయాన్ని నిరసన ద్వారా ప్రభుత్వానికి, ప్రజలకు తెలియజేయాలని తాను ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, పోలీసులు బెదిరింపులకు ఏ మాత్రం భయపడేది లేదని, తాను నివాసంలోనే 36 గంటల దీక్ష కొనసాగిస్తానని చెప్పారు.

# నిరసన తెలిపే హక్కు లేదా?

## టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావ్



**అమరావతి, ఆంధ్రప్రభ:** ఇసుకకొరతను ప్రశ్నించి నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పాశవికంగా వ్యవహరిస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావ్ విమర్శించారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర నిరసనను భగ్నం చేసి అరెస్ట్ చేయటం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన గుంటూరులోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మీడియాకు ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సృష్టించిన కృత్రిమ ఇసుక కొరత వల్ల సుమారు 30 లక్షల మంది ఉపాధిని కోల్పోతే ప్రశ్నించటం, నిరసన తెలియచేయటం తప్పా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే 144 సెక్షన్ విధించి నిరసనను భగ్నం చేశారన్నారు. లారీ ఇసుకను 80 వేల రూపాయలకు అమ్ముతూ నిలువునా దోచుకుంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ విషయంలో కనీసంగా స్పందించకపోవటం దుర్మార్గమన్నారు. ప్రజల ఆకలి తీర్చమని ప్రతిపక్షాలు రోడ్డెక్కుతున్నాయంటే వైసీపీ పరిపాలన ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ఉపాధి కల్పించమని అడిగితే ఈడ్చుకెళ్ళి పోలీస్ స్టేషన్లలో బంధిస్తున్నారని అన్నారు. అరెస్ట్ చేసిన టీడీపీ నేతలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఇసుక కొరతను నిలువరించాలి.. లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని వెంకట్రావ్ హెచ్చరించారు.

# కొల్లు దీక్షతో ప్రభుత్వానికి వణుకు

## మాజీ మంత్రి దేవినేని ఉమా

**అమరావతి, ఆంధ్రప్రభ:** మాజీ మంత్రి కొల్లు రవీంద్ర దీక్షతో ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుట్టిందని, శాంతియుతంగా దీక్షకు దిగిన ఆయనను పోలీసులు అత్యుత్సాహంతో అరెస్టు చేశారని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము ఏ కార్యక్రమం తలపెట్టినా దానికి పోటీగా వైకాపా రావడం హాస్యాస్పదంగా ఉందని, వారు అధికారంలో ఉన్న విషయం తెలియక వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. తమ పార్టీ నేతలు డీజీపీకి ఫిర్యాదు చేసినా, తమ అధినేత చంద్రబాబు ఛలో ఆత్మకూరు కార్యక్రమాన్ని చేపట్టినా పోటీకి వచ్చారని, ఇదంతా ప్రతిపక్షం తరహాలో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఇసుక దొరక్క లక్షలాది మంది ఉపాధి కోల్పోతే వైకాపా నేతలు మాత్రం ఇసుకతో సొమ్ము చేసుకొంటున్నారని ఆరోపించారు. రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్లు సీఎం జగన్ వీడియో గేమ్‌లు ఆడుకుంటున్నారని విమర్శించారు. మరోవైపు మద్యం దోపిడీ జరుగుతున్నా రాత్రి ఎనిమిది గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు వైకాపా నేతలే అక్రమ అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టుల పనులు ముగిసిపోవడంతో 78వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో జగన్ కుమ్మక్కై పోలవరం ఎత్తు తగ్గించారని ఆరోపించారు.

# సంక్షోభంలో విద్యుత్ రంగం

## మాజీ మంత్రి ఆలపాటి ధ్వజం

**అమరావతి, ఆంధ్రప్రభ:** విద్యుత్ రంగంలో అస్తవ్యస్థ విధానాలు అనుసరిస్తూ సీఎం జగన్ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. గుంటూరులోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీపీఏల సమీక్షల వల్ల విద్యుత్ రంగం లో సంక్షోభం నెలకొందని ఆయన అన్నారు. విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన చంద్రబాబు ప్రతిష్టను ఏదో విధంగా మసకబార్చేందుకు ప్రయత్నించటం తప్ప ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆలోచిస్తున్న దాఖలాలు లేవన్నారు.

# గంగ ప్రక్షాళన పోరాటానికి బాసట నా బాధ్యత

## జన సేనాని పవన్ కల్యాణ్



**అమరావతి, ఆంధ్రప్రభ:** గంగ ప్రక్షాళన పోరాటానికి బాసట నా బాధ్యత అని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తెలిపారు. శుక్రవారం హరిద్వార్‌లోని పవన్ సదన్ ఆశ్రమంలో జరిగిన జీడీ అగర్వాల్ సంస్మరణ సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. ప్రకృతిని పరిరక్షించాలని తపన పడే జీడీ అగర్వాల్ వంటి మహనీయుడిని కోల్పోవడం జాతి చేసుకున్న దురదృష్టమన్నారు. గంగను స్వేచ్ఛగా ప్రవహించనివ్వాలని, గంగా నదిలోకి కాలుష్యం చేరకుండా నియంత్రించాలని ప్రొఫెసర్ జీడీ అగర్వాల్ సాగించిన పోరాటం గురించి తాను ఎప్పటికప్పుడు తెలుసుకునేవాడినన్నారు. ఆయన ఆమరణ నిరాహర దీక్షకు కూర్చున్నారని తెలిసి ఆయన ఆత్మ త్యాగం చేయకుండా ప్రభుత్వం స్పందిస్తుందని భావించానని అయితే దురదృష్టవశాత్తు ఏ ప్రభుత్వం ఆయనను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం గంగను పరిరక్షించాలన్న సంకల్పాన్ని కనపరిచిందని ఆయినా ప్రభుత్వం జీడీ అగర్వాల్ ఆత్మ త్యాగాన్ని ఆపలేకపోయిందన్నారు.

అగర్వాల్ మరణవార్త తనను విపరీతంగా కలిచివేసిందని భారతదేశం తన ఆత్మను కోల్పోతుందన్న వేదన కలిగిందన్నారు. అగర్వాల్ మృతిపై దేశం మొత్తం తిరగపడుతుందని భావించానని అయితే కనీసం ఉత్తరప్రదేశ్ నుంచి కూడా స్పందన లేకపోవడం విస్మయానికి గురిచేసిందన్నారు. గంగా నది ఉత్తర భారతదేశానికో పశ్చిమ, తూర్పు ప్రాంతానికో చెందింది కాదని, అది భారత్ మొత్తానికి సంబంధించిందన్నారు. మనకు అన్నీ ఇచ్చే ప్రకృతిని కాపాడేందుకు ఆత్మ త్యాగం చేసిన జీడీ అగర్వాల్ స్ఫూర్తితో గంగను పరిరక్షించుకోవడం తన ప్రాథమిక హక్కు అని భావిస్తున్నట్లు తెలిపారు. అగర్వాల్ లాంటి మహాత్ముని ఆశయల సాధనకు అండగా నిలవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తాము ప్రభుత్వంతో పోరాడేందుకు కాకుండా, తమ వాణిని ప్రభుత్వం చెవిని సోకేవరకు పోరాడతామన్నారు. శరీరాన్ని నడిపించే ఆత్మ అత్యంత శక్తివంతమైందని ప్రొఫెసర్ అగర్వాల్ తన దేహాన్ని వదిలి ఆత్మను ఇక్కడే వదిలి మరింత శక్తి వంతంగా తయారన్నారు. ఆయన శక్తి తనను ఇక్కడికి వచ్చేలా మేల్కొల్పిందని, అగర్వాల్ సందేశాన్ని భారతదేశం మొత్తానికి చేర్చేందుకు అవసరమైన భాద్యతను తప్పకుండా నిర్వహిస్తామని పవన్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర సింగ్, ప్రొఫెసర్ విక్రమ్ సోని, యుసెఫ్ ఆర్బాం ఖాన్, బొలి శెట్టి సత్య, బసవ రాజ్ పాటిల్ , రమేష్ శర్మ, మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదం అభివృద్ధికి అడ్డుగోడ

## కేమరోస్ పార్లమెంట్‌లో ఉపరాష్ట్రపతి వెంకయ్య

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** ఉగ్రవాదం మానవాళికి పెనుముప్పుగా, అభివృద్ధికి అడ్డుగోడగా మారడం వల్ల అంతర్జాతీయ ఉగ్రవాదంపై ఐక్యరాజ్యసమితి సమగ్ర సదస్సు వీలైనంత త్వరగా ముగిసే విషయంలో అంతర్జాతీయ సమాజం చొరవ తీసుకోవాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. కేమరోస్ రాజధాని మొరోనీలో ఆ దేశ పార్లమెంటును ద్దేశించి భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఆయన ప్రసంగించారు. ప్రపంచ శాంతికి ఉగ్రవాదం పెనుసవాల్‌గా మారిందని, ఈ పోరాటంలో ప్రపంచ దేశాలు పరస్పర సహకారంతో నడవటం తక్షణావసరమన్నారు. 'పైరసీ, సముద్రంలో సవాళ్లు, సీమాంతర ఉగ్రవాదం, సైబర్ నేరాలు మరింత సమస్యాత్మకంగా మారాయని, ఇలాంటి హెచ్చరికలను మరీ ముఖ్యంగా సముద్రంలో ఎదురవుతున్న సమస్యలను ఎదుర్కొనే క్రమంలో కేమరోస్‌తో జతకట్టి ముందుకెళ్లేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు. హిందూ మహాసముద్ర భద్రత విషయంలో ఈ సముద్రంలోని అన్ని దేశాలను కలుపుకునిపోయే సంకల్పంతో ప్రధాని నరేంద్రమోదీ పని చేస్తున్నారని ఆయన అన్నారు. భారత్, కేమరోస్ దేశాల మధ్య వాణిజ్య బంధాలు బలపడేందుకు విస్తృత అవకాశాలున్నాయని.. అందుకే కేమరోస్ ఆర్థికాభివృద్ధిలో భారత్ విలువైన భాగస్వామిగా మారనుందని వెంకయ్య స్పష్టం చేశారు.

అంతర్జాతీయ సౌరకూటమిలో భాగంగా భారత్ - కేమరోస్ మధ్య కుదిరిన భాగస్వామ్యం కారణంగా మారుమూల ప్రాంతాల్లోని ఇళ్లలోనూ వెలుగులు నిండుతాయన్నారు. ఇరుదేశాల్లోనూ యువత ఎక్కువ సంఖ్యలో ఉన్న విషయాన్ని ఆయన గుర్తుచేస్తూ.. 'యువతకు సరైన నైపుణ్యాన్ని అందిస్తే.. వారి శక్తి సామర్థ్యాలను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఆఫ్రికాలో ఈ-నెట్‌వర్క్ కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ.. ఈ-విద్యాభారతి, ఈ-ఆరోగ్య భారతి ప్రాజెక్టుల్లో భాగంగా ఆఫ్రికా వ్యాప్తంగా 15 వేల మందికి టెలి-ఎడ్యుకేషన్, వెయ్యిమంది డాక్టర్లు, పారామెడిక్స్‌కు టెలి-మెడిసిన్‌ను భారత్ తరపున ఉచితంగా అందిస్తున్నామని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి వెంకయ్య ప్రసంగానికి కామరోస్ పార్లమెంటు సభ్యులనుంచి అద్భుతమైన స్పందన కనిపించింది.

ప్రసంగం మధ్యలో పలుమార్లు సభ్యులు నిలబడి చప్పట్లతో అభినందించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి సంజీవ్ కుమార్ బాల్యాన్, రాజ్యసభ ఎంపీ రాంవిచార్ నేతమ్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. వెంకయ్య నాయుడు, కేమరోస్ అధ్యక్షుడి సమక్షంలో రక్షణ రంగంలో సహకారం, వైద్యం, సంస్కృతి, కళారంగం మొదలైన ఆరు అంశాలపై ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందాలు జరిగాయి.

### వెంకయ్యకు కేమరోస్ అత్యున్నత పౌర పురస్కారం



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** ఆఫ్రికా పర్యటనలో ఉన్న ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడికి కేమరోస్ దేశ అత్యున్నత పౌర పురస్కారం లభించింది. ఆ దేశాధ్యక్షుడు అజాలీ అసౌ మని చేతుల మీదుగా ద ఆర్డర్ ఆఫ్ ద గ్రీన్ క్రెసెంట్ గౌరవాన్ని ఆయన అందుకున్నారు. ఈ పురస్కారాన్ని అందుకోవడాన్ని గౌరవంగా భావిస్తున్నానని ఉపరాష్ట్రపతి తెలిపారు. మన దేశానికి దక్కిన ఈ అపూర్వ గౌరవాన్ని 130 కోట్ల భారతీయుల తరపున వినయపూర్వకంగా స్వీకరిస్తున్నానని చెప్పారు. కేమరోస్ రాజధాని మొరోనీలో భారత్ - కేమొరోస్ మైత్రికి గుర్తుగా ఈ పురస్కారాన్ని అందుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. సంయుక్త లక్ష్యమే మమ్మల్ని కలిపిందని, ఇరు దేశాలను కలిపే హిందూ మహా సముద్రం కూడా ఒక్కటేనని, సముద్రమంత స్నేహమిది... పరస్పర పురోగతి స్వప్నమిది అని వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు.

# విశ్వాసం పెరిగితేనే ఫిర్యాదులు తగ్గుతాయి

## ప్రామాణిక ఆపరేటివ్ విధానాన్ని పాటించాలి: సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం

**అమరావతి, ఆంధ్రప్రభ:** ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ప్రామాణిక ఆపరేటివ్ విధానాన్ని అన్ని శాఖలు పాటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో సీఎస్ అధ్యక్షతన స్పందన సొల్యూషన్స్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చే స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో శాఖల వారీగా అనుసరించాల్సిన స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్‌పై సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు చేశారు. అనంతరం సీఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖలు, ఫిర్యాదుదారుల మధ్య పరస్పర విశ్వాసం పెరిగితేనే ఫిర్యాదుల సంఖ్య తగ్గుతుందని అన్నారు. ప్రతి ఫిర్యాదు పరిష్కారానికి ఒక నిర్దిష్ట కాలవ్యవధి పెట్టి, ఆ గడువులోగా సదరు ఫిర్యాదును పరిష్కరించడతో పాటు ఆ సమాచారాన్ని ఫిర్యాదు దారునికి తెలియజేయాలని ఆదేశించారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారానికి వివిధ శాఖలు అనుసరించే ప్రామాణిక ఆపరేటివ్‌విధానం ఒకేరీతిలో ఉండేలా చూడాలని క్వాలిటీ, రిడ్రస్సల్ ఉండాలని సీఎస్ స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదు ఆమోదానికి ముందు లబ్ధిదారుల ఎంపిక అనంతరం సోషల్ ఆడిట్ తప్పనిసరని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో పాటు విద్యావంతులైన యువత ఉద్యోగ విధుల్లో చేరిందన్నారు. అందుకు సంబంధించిన శాఖలు గ్రామ, వార్డు సచివాలయాలతో పూర్తిగా ఇంటిగ్రేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల కార్యదర్శులను సీఎస్ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. విభిన్న ప్రతిభా వంతులకు వారి అంగవైకల్యం నిర్ధారిస్తూ జారీ చేసే సదరమ్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు మరిన్ని సధరమ్ సర్టిఫికెట్ జారీ కేంద్రాలు ఏర్పాటుకు ఆదేశాలు ఇస్తామని ఆయన వివరించారు. గృహ నిర్మాణం చేపట్టే ముందు సంబంధిత లబ్ధిదారుల పేర్లను గ్రామ లేదా వార్డు సచివాలయంలో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించిన తర్వాతే నిర్మాణ పనులను చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు మన్మోహన్ సింగ్, పూనం మాల కొండయ్య, ప్రభుత్వ సలహాదారు శామ్యూల్ , లోకేశ్వర్, హరికృష్ణ, ముఖ్య కార్యదర్శులు కె.దమయంతి, బి.రాజశేఖర్, అజయ్ జైన్, సిఎం కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్య రాజ్, తదితరులున్నారు.

# కోహ్లీ డబుల్

పుణె టెస్టులో రికార్డుల హోరు

- కెప్టెన్‌గా 9సార్లు 150 పైగా పరుగులు
- టెస్టుల్లో 26వ సెంచరీ
- 7వ డబుల్ సెంచరీ
- టెస్టు కెప్టెన్సీలో దాదాను దాటేశాడు

7000 పరుగుల మైలురాయి

కోహ్లీ 254 నాటౌట్

*ఎవడు కొడితే రికార్డులు బద్దలవుతాయో... ఆ ఆటగాడే కోహ్లీ. రికార్డులకు పర్యాయపదంగా మారిన కోహ్లీ శుక్రవారం మరోసారి తన ప్రతాపాన్ని ప్రదర్శించాడు. దక్షిణాఫ్రికా బౌలర్లను ఆటాడుకుంటూ టెస్టులలో తన అత్యధిక స్కోరును నమోదు చేశాడు. అంతేగాక డాన్‌బ్రాడ్‌మన్, పాంటింగ్, సచిన్, సెహ్వాగ్‌లాంటి దిగ్గజాల రికార్డులను సొంతం చేసుకున్నాడు. టెస్టులలో 7వేల పరుగులు మైలురాయినికూడా చేరుకున్నాడు. రికార్డులను ఒక్కొక్కటి దాటుకుంటూ రికార్డుల రారాజు పేరును సార్థకం చేసుకుంటున్నాడు. కోహ్లీ దెబ్బకు సఫారీ లకు మరో పరాభవం తప్పేలా లేదు. ఈ టెస్టులోనే సిరీస్‌ను సొంతం చేసుకునేందుకు టీమిండియా రంగం సిద్ధం చేసుకుంది.*



## టెస్టుల్లో విజయవంతమైన నాయకుడిగా చరిత్ర

**పుణె :** కింగ్ కోహ్లీ గర్జించాడు. ఈ ఏడాది తొలి సెంచరీని డబుల్‌గా మలచి క్రికెట్ ప్రపం చం తనను ఎందుకు మేటిగా గుర్తిస్తుందో రుజువుచేశాడు. దక్షి ణాఫ్రికాతో జరుగు తున్న రెండో టెస్టు రెండో రోజు కోహ్లీ టెస్టులలో తన అత్యధిక స్కోరును నమోదు చేయడమేగాక, పలు రికార్డులను సమం చేస్తూ, కొన్ని కొత్త రికార్డులనుకూడా సొంతం చేసుకున్నాడు. ఈ ఏడాది ఆడిన ఎనిమిది ఇన్నింగ్స్‌లలో రెండు అర్ధ సెంచరీలు సాధించిన కోహ్లీ శుక్రవారం ఏకంగా డబుల్ సెంచరీ నమోదు చేసి సౌతాఫ్రికా బౌలర్లకు చుక్కలు చూపించాడు. తొలి టెస్టులో మయాంక్ అగర్వాల్ డబుల్ సెంచరీతో కదంతొక్కగా, ఈసారి ఆ బాధ్యతను కెప్టెన్ స్వీకరించాడు. కెరీర్ అత్యుత్తమ స్కోరు సాధించిన కోహ్లీ(336 బంతుల్లో 254 నాటౌట్, 33 ఫోర్లు, 2 సిక్సర్లు)... రవీంద్ర జడేజా సెంచరీ చేరువలో అవుట్ కాగానే భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 601 పరుగులవద్ద డిక్లేర్ చేశాడు. తాను ట్రిబుల్ సెంచరీ చేసే అవకాశం ఉన్నప్పటికీ అలసిన సౌతాఫ్రికా జట్టులో వీలైనన్ని వికెట్లు దక్కించుకునేందుకు ఇన్నింగ్స్ డిక్లేర్ చేశాడు. అతని వ్యూహం ఫలించి ఆట ముగిసేసరికి సౌతాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌లో 36 పరుగులకే మూడు ప్రధాన వికెట్లు కోల్పోయింది. తొలి టెస్టులోవలె సౌతాఫ్రికా దాసోహమంటే నాలుగు రోజుల్లోనే ఈ టెస్టు ముగిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

టీమిండియా భారీ స్కోరును అందుకునే ప్రయత్నంలో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన సౌతాఫ్రికాను ఉమేశ్ యాదవ్ వరుస ఓవర్లలో చావుదెబ్బతీశాడు. తన తొలి ఓవర్ రెండో బంతికే మార్క్రమ్, రెండో ఓవర్లో డీన్ ఎల్గర్‌లను బలిగొన్నాడు. దీనితో సౌతాఫ్రికా 13 పరుగులకే ఓపెనర్లిరువురినీ కోల్పోయింది. పదో ఓవర్లో షమి బవుమ వికెట్ దక్కించుకున్నాడు. ఆటను నిలిపివేసే సమయానికి బ్రుయిన్(20), నార్జె(2) ఆటలో కొనసాగుతున్నారు. సౌతాఫ్రికా భారత్ స్కోరుకు ఇంకా 568 పరుగుల వెనుకంజలో ఉండగా చేతిలో ఏడు వికెట్లు ఉన్నాయి.

అంతకుముందు 3 వికెట్లకు 273 పరుగులతో రెండో రోజు ఆటను ఆరంభించిన ఇండియాకు తొలుత రహానెతో, అనంతరం రవీంద్ర జడేజాతో కలిసి సెంచరీ భాగస్వామ్యాలు నెలకొల్పాడు. తొలి రోజు ఒక్కో సెషన్‌లో ఒక్కో వికెట్ దక్కిన సౌతాఫ్రికాకు రెండో రోజు లంచ్‌లోపు వికెటే దక్కలేదు. ముఖ్యంగా కోహ్లీ పరిస్థితులకు అనుగుణంగా తన బ్యాటింగ్‌ను మలచుకుంటూ చూడ ముచ్చటైన షాట్లతో స్కోరును పరుగెత్తించాడు. ప్రతి అర్ధసెంచరీకి బంతులను తగ్గించుకుంటూ తొలుత సెంచరీ, ఆతరువాత డబుల్ సెంచరీలు నమోదు చేశాడు. ఈ క్రమంలో పలు రికార్డులు అతని పాదాక్రాంతమయ్యాయి. లంచ్ తరువాత అర్ధసెంచరీ పూరించిన రహానె మహరాజ్ బౌలింగ్‌లో కీపర్ డికాక్‌కు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. నాలుగో వికెట్‌కు కోహ్లీ, రహానె 178 పరుగులు జోడించారు. రహానె వికెట్ లభించిన ఆనందం సౌతాఫ్రికాకు ఎంతో సేపు నిలువలేదు. కోహ్లీ సాహచర్యంలో జడేజా బౌలర్లపై ఎదురుదాడికి దిగి డబుల్ సెంచరీ భాగస్వామ్యంలో పాలుపంచుకున్నాడు. వీరిరువురూ బౌలర్లను ఊచకోతకోస్తూ యథేచ్ఛగా పరుగులు పిండుకున్నారు. ఈ నేపథ్యంలో కోహ్లీ టెస్టులలో తన ఏడో డబుల్ సెంచరీ పూరించాడు. ఇన్నింగ్స్ 150 ఓవర్లో కోహ్లీ, జడేజా రెండు సిక్సర్లు, రెండు బౌండరీలు సాధించి వన్డే మ్యాచ్‌ను తలపించారు. చివరి డ్రింక్స్ బ్రేక్ తరువాతి ఓవర్లో జడేజా 91(104 బంతులు, 8 బౌండరీలు, 2 సిక్సర్లు) పరుగులకు అవుటవగానే కోహ్లీ భారత ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. కోహ్లీ, జడేజా అయిదో వికెట్‌కు కేవలం 39.1 ఓవర్లలోనే 225 పరుగులు జోడించారు.

### స్కోర్‌బోర్డు

**ఇండియా మొదటి ఇన్నింగ్స్:** మయాంక్ అగర్వాల్ (సి) డుపెస్లిస్ (బి) రబాడా 108, రోహిత్ శర్మ (సి) డికాక్ (బి) రబాడ 14, పుజారా (సి) డుప్లెసిస్ (బి) రబాడా 58, విరాట్ కోహ్లీ నాటౌట్ 254, అజింక్య రహానె (సి) డికాక్ (బి) మహరాజ్ 59, రవీంద్ర జడేజా (సి) బ్రుయిన్ (బి) ముత్తుసామి 91, ఎక్స్‌ట్రాలు 17, మొత్తం (5 వికెట్లకు)601 డిక్లేర్డ్.

**వికెట్ల పతనం :** 1-25, 2-163, 3-198, 4-376, 5-601.

**బౌలింగ్ :** వెర్నాన్ ఫిలాండర్ 26-6-66-0, కగిసో రబాడ 30-3-93-3, ఆన్రిచ్ నార్జె 25-5-100-0, కేశవ్ మహరాజ్ 50-10-196-1, సెనురన్ ముత్తుసామి 19.3-1-97-1, డీన్ ఎల్గర్ 4-0-26-0, మార్క్‌రమ్ 2-0-17-0.

**సౌతాఫ్రికా మొదటి ఇన్నింగ్స్ :** డీన్ ఎల్గర్ (బి) యాదవ్ 6, మార్క్‌రమ్ (ఎల్బీ) యాదవ్ 0, బ్రూయిన్ బ్యాటింగ్ 20, టెంబ బవుమ బ్యాటింగ్ 2, ఎక్స్‌ట్రాలు 0, మొత్తం (3 వికెట్లకు)36.

వికెట్ల పతనం : 1-2, 2-13, 3-33.

**బౌలింగ్ :** ఇషాంత్ శర్మ 4-0-17-0, ఉమేశ్ యాదవ్ 4-1-16-2, రవీంద్ర జడేజా 4-4-0-0, మహ్మద్ షమి 3-1-3-1.

## రికార్డులు దాసోహం

శుక్రవారం కోహ్లీ ధాటికి రికార్డులు దాసోహమన్నాయి. తొలి రోజు ఆటలో అర్ధసెంచరీతో నాటౌట్‌గా నిలిచిన కెప్టెన్ కోహ్లీ రెండో రోజు డబుల్ సెంచరీ సాధించి అజేయంగా నిలిచాడు. టెస్టులలో అతనికిది 26వ సెంచరీకాగా, ఏడో డబుల్ సెంచరీ. ఈ ఏడాది సాధించిన తొలి సెంచరీ. ఈ నేపథ్యంలో అతడు పలువురి రికార్డులు సమం చేస్తూ, కొన్ని రికార్డులను అధిగమించాడు. తొలుతగా ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు రికీ పాంటింగ్ కెప్టెన్‌గా సాధించిన 19 సెంచరీల రికార్డును సమం చేశాడు. ఈ విషయంలో సౌతాఫ్రికా మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్ కెప్టెన్‌గా 25 సెంచరీలతో అగ్రస్థానంలో ఉన్నాడు. అనంతరం 150 పరుగులకు చేరుకోగానే ఆసీస్ దిగ్గజం సర్ డాన్ బ్రాడ్‌మన్ టెస్టులలో ఎనిమిదిసార్లు 150పైగా పరుగులు చేసిన రికార్డును అధిగమించాడు. కోహ్లీ టెస్టులలో 150పైగా పరుగులు సాధించడం ఇది తొమ్మిదోసారి. అయితే డబుల్ సెంచరీ చేయడంతో 150పైగా పరుగుల రికార్డులో బ్రాడ్‌మన్‌తో సమంగానే ఉంది. కెప్టెన్‌గా 150ప్లస్ పరుగులను ఏడుసార్లు సాధించి మైకేల్ క్లార్క్(ఆస్ట్రేలియా), మహేల జయవర్ధనే(శ్రీలంక), బ్రయాన్ లారా(వెస్టిండీస్) మూడో స్థానంలో ఉన్నారు. డబుల్ సెంచరీలలో బ్రాడ్‌మన్‌దే రికార్డు. బ్రాడ్‌మన్ టెస్టులలో 12 డబుల్ సెంచరీలు నమోదు చేసి టాప్‌లో ఉన్నాడు. కాగా టెస్టులలో అత్యధిక డబుల్ సెంచరీలు సాధించిన భారత క్రికెటర్లలో కోహ్లీ అగ్రస్థానానికి చేరుకున్నాడు. సచిన్ టెండూల్కర్, వీరేందర్ సెహ్వాగ్ టెస్టులలో ఆరుసార్లు డబుల్ సెంచరీలు సాధించగా, ఏడో డబుల్‌సెంచరీతో కోహ్లీ వారిని అధిగమించాడు. డబుల్ సెంచరీ సాధించిన నేపథ్యంలో కోహ్లీ టెస్టులలో 7వేల పరుగుల మైలురాయిని అధిగమించాడు. అంతేగాక టెస్టులలో అత్యధిక పరుగులు సాధించిన తొలి 50మందిలో చోటు దక్కించుకున్నాడు. సచిన్ 15,921 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. కోహ్లీ 239 వన్డేలలో 43 సెంచరీలతో 11,520 పరుగులు సాధించాడు.

### కోహ్లీ ఒక్కో అర్ధసెంచరీ పూరించిన వైనం

తొలి రోజు నిలకడ ప్రదర్శించిన కోహ్లీ రెండో రోజు సొగసైన బ్యాటింగ్‌తోపాటు, ప్రతి అర్ధసెంచరీకి బంతులను తగ్గించు కుంటూ డబుల్ సెంచరీని వేగంగా పూరించాడు. అతడి ఒక్కో అర్ధసెంచరీకి పట్టిన బంతుల వివరాలు...

- తొలి అర్ధసెంచరీ - 91 బంతులు
- రెండో అర్ధసెంచరీ - 82 బంతులు
- మూడో అర్ధసెంచరీ - 68 బంతులు
- నాలుగో అర్ధసెంచరీ - 54 బంతులు
- అయిదో అర్ధసెంచరీ - 39 బంతులు



## ద్యుతీ జాతీయ రికార్డు

**రాంచీ:** భారత స్టార్ స్ప్రింటర్ ద్యుతీ చంద్ కొత్త జాతీయ రికార్డును నమోదు చేసింది. జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా శుక్రవారం ఇక్కడ జరిగిన మహిళల 100మీ సెమీఫైనల్స్ పరుగులో ద్యుతీ చంద్ 11.22 సెకన్లలో రేసును పూర్తి చేసుకొని మొదటి స్థానంలో నిలిచి ఫైనల్లో ప్రవేశించింది. ఫలితంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో ద్యుతీ నమోదు చేసిన అత్యుత్తమ టైమింగ్(11.25సె)ను తాజాగా తానే బ్రేక్ చేసింది.

## పంచ్ పడుద్ది!

**సెమీస్ పోరుకు నలుగురు భారత బాక్సర్లు రెఢీ**

**మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్**



**ఉలాన్-ఉడే:** మహిళల ప్రపంచ బాక్సింగ్‌లో భారత అమ్మాయిలు జోరును ప్రదర్శిస్తున్నారు. దిగ్గజ బాక్సర్ మేరీకోమ్‌తో సహా మరో ముగ్గురు బాక్సర్లు సెమీస్‌లో ప్రవేశించారు. శనివారం వీరందరూ తమతమ వెయిట్ కేటగిరిలలో ప్రత్యర్థులతో పోటీపడనున్నారు. భారత్‌కు ఎన్నో బంగారు పతకాలు అందించిన మణిపురి బాక్సర్ మేరీకోమ్ ఈసారి ఏడో స్వర్ణంపై గురి పెట్టింది. 51 కిలోల విభాగం క్వార్టర్స్‌లో కొలంబియాకు చెందిన వాలెన్సియా విక్టోరియాను 5-0తో చిత్తు చేసిన మూడో సీడ్ మేరీ సెమీస్‌లో యూరోపియన్ చాంపియన్ అయిన టర్కీ బాక్సర్ రెండోసీడ్ బుసెనాజ్ కాకిరోగ్లుతో తలపడనుంది. తొలిసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అడుగుపెట్టిన యువ బాక్సర్లు మంజురాణి (48 కేజీలు), జమున బోరో (54 కేజీలు) అద్భుతమైన ప్రదర్శనలతో సత్తా చాటుతున్నారు. క్వార్టర్ ఫైనల్లో మంజు 4-1తో టాప్ సీడ్ కిమ్ హయాంగ్ (సౌత్ కొరియా)ను ఓడించి సంచలనం సృష్టించింది. సెమీస్‌లో ఈమె థాయ్‌లాండ్‌కు చెందిన చుతామత్ రక్సాత్‌తో తలపడనుంది. 22 ఏళ్ల అస్సాం బాక్సర్ జమున శనివారం జరిగే సెమీస్ పోరులో చైనీస్ తైపీకి చెందిన టాప్ సీడ్ హువాంగ్ హెసియావో వెన్‌తో ఢీ కొననుంది.



## ఊహించలేదు..

**న్యూఢిల్లీ:** పురుషుల ఆధిపత్యం ఉన్న బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లో ఓ మహిళా క్రికెటర్‌కు ప్రాతినిధ్యం దక్కుతుందని తాను ఎప్పుడు కలలో కూడా ఊహించలేదని మాజీ క్రికెటర్ శాంత రంగస్వామి అన్నది. బీసీసీఐ తొమ్మిది మంది సభ్యుల అత్యున్నత మండలిలో శాంత రంగాస్వామికు చోటుదక్కింది. భారత క్రికెటర్ల సంఘం (ఐసీఏ) ఎన్నికల్లో ఆమె పోటీ లేకుండానే ఎంపికయ్యారు. దీనిపై స్పందించిన రంగస్వామి జస్టిస్ లోధా సిఫార్సుల వల్లే ఇది సాధ్యమైందని చెప్పింది. అత్యున్నత మండలి ఏర్పాటు కాగానే మహిళల క్రికెట్ అభివృద్ధి కోసం బోర్డు ముందు పలు అంశాల దార్శనికతను ఉంచనున్నట్లు శాంత రంగస్వామి పేర్కొంది.

## దివిజ్‌కు టాప్ ర్యాంక్

**న్యూఢిల్లీ:** భారత నెంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ దివిజ్ శరణ్ ఇప్పుడు డబుల్స్‌లో ఆసియా ట్యాంప్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. కొంత కాలంగా నిలకడగా ఆడుతున్న శరణ్ ఏటీపీ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో ఆసియా డబుల్స్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. ప్రస్తుతం రోహన్ బోపన్నతో జోడీ కట్టిన దివిజ్ టాటా ఓపెన్ టైటిల్‌ను కూడా గెలుచుకున్నాడు. టాప్ ర్యాంక్ దక్కడంపై దివిజ్ శరణ్ ఆనందం వ్యక్తం చేశాడు. ఈ మైలురాయిని చేరుకోవడం చాలా గొప్పగా ఉందని అన్నాడు. వచ్చే ఏడాది జరగనున్న టోక్యో ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే తన లక్ష్యమని దివిజ్ పేర్కొన్నాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో దివిజ్ శరణ్-బోపన్న జోడీ 44వ ర్యాంక్‌లో ఉంది.

## మిథాలీసేనదే వన్డే సిరీస్



**రెండో వన్డేలో 5వికెట్లతో విజయం**

**వదోదర :** దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో వన్డే సిరీస్‌ను మిథాలీ రాజ్ నేతృత్వంలోని భారత మహిళల జట్టు ఇంకా ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే గెలుచుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో బుధవారంనాటి తొలి వన్డేను గెలుచుకున్న భారత్ శుక్రవారం రెండో వన్డేలోకూడా గెలుపొంది సిరీస్‌ను సొంతం చేసుకుంది. మూడో వన్డే సోమవారం ఇక్కడే జరుగనుంది. తొలుత దక్షిణాఫ్రికాను 247 పరుగులకు పరిమితం చేసిన భారత్, కెప్టెన్ మిథాలీ రాజ్(66), పూనమ్ రావత్(65) అర్ధసెంచరీలతోపాటు మూడో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం(129)తో భారత్ విజయాన్ని ఖరారు చేశారు. పూనమ్ రావత్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకుంది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0తో ముందంజ వేసింది.

లక్ష్య ఛేదనలో భారత్ ఓపెనర్లు ప్రియా పూనియా, జెమీమా రోడ్రిగ్స్‌లను తక్కువ స్కోర్లకే కోల్పోయింది. మిథాలీ, పూనమ్ ఆచితూచి ఆడుతూ ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించారు. ఇరువురూ అర్ధసెంచరీలు పూరించడమేగాక, సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పడంతో భారత్ విజయం దిశగా పయనించింది. వీరిరువురూ ఒక్క పరుగు తేడాతో పెవిలియన్ చేరినా హర్మన్‌ప్రీత్‌కౌర్ 27 బంతుల్లో 5 బౌండరీలు, ఒకసిక్సర్‌తో త్వరితగతిన అజేయంగా 39 పరుగులు సాధించి ఇంకా రెండు ఓవర్లు మిగిలి ఉండగానే ఇండియాకు విజయాన్నందించింది. ఖాకా 3 వికెట్లు దక్కించుకుంది.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాకు ఓపెనర్లు లిజెల్లీ లీ(40), లారా వోల్‌వర్త్(69) తొలి వికెట్‌కు 76 పరుగులతో శుభారంభం అందించారు. ఆ తరువాత త్రిషా చెట్టి, వాల్‌వర్త్ రెండో వికెట్‌కు మరో అర్ధసెంచరీ(51) భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే వీరిరువురినీ శిఖా పాండే అవుట్‌చేసి భారత్‌కు బ్రేక్ అందించింది. ఆపై ప్రీజ్(44), గుడాల్(38)స్కోరును 200 దాటించారు. నిర్ణీత ఓవర్లలో సౌతాఫ్రికా 247 పరుగులు చేసింది. శిఖా పాండే, ఏక్తా బిస్త్, పూనమ్ యాదవ్ రెండేసి వికెట్లు దక్కించుకున్నారు.

**సంక్షిప్త స్కోర్లు :** దక్షిణాఫ్రికా - 247/6 (వోల్‌వర్త్ 69, ప్రీజ్ 44, లిజెల్లీ లీ 40, శిఖా పాండే 2/38, ఏక్తా బిస్త్ 2/45, పూనమ్ యాదవ్ 2/42). ఇండియా - 248/5(పూనమ్ రావత్ 65, మిథాలీ రాజ్ 66, అయబొంగ ఖాక 3/69).

## పంజాబ్ కోచ్‌గా కుంబ్లే

**న్యూఢిల్లీ:** టీమిండియా మాజీ కోచ్, దిగ్గజ క్రికెటర్ అనిల్ కుంబ్లే మళ్లీ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంఛైజీ కింగ్స్ ఎలెవన్ పంజాబ్ అనిల్ కుంబ్లేను ప్రధాన కోచ్‌గా నియమించినట్లు అధికారిక ప్రకటన విడుదల చేసింది. కుంబ్లేతో రెండేళ్ల ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. దీంతో వచ్చే ఐపీఎల్ సీజన్‌లో పంజాబ్ జట్టుకు కుంబ్లే ప్రధాన కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఇక ఇప్పటివరకు కోచ్‌గా ఉన్న మైక్ హసన్ కాంట్రాక్ట్ ముగిసింది. మైక్ హయాంలో కింగ్స్ పంజాబ్ పేలవమైన ప్రదర్శనలు చేయడంతో అతనికి ఉద్వాసన పలికి కొత్త కోచ్‌గా కుంబ్లేను నియమించింది.

## ఫైనల్లో సౌరవ్ కొఠారి

**మెల్‌బోర్న్:** డిఫెండింగ్ చాంపియన్ సౌరవ్ కొఠారి ప్రపంచ బిలియర్డ్స్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం ఇక్కడ జరిగిన సెమీఫైనల్లో కొఠారి 1090-594తో ఇంగ్లండ్ దిగ్గజ ఆటగాడు, మాజీ ప్రపంచ చాంపియన్ మైక్ రస్సెల్‌ను ఓడించి ఫైనల్లో ప్రవేశించాడు. శనివారం జరిగే టైటిల్ పోరులో కొఠారి సింగాపూర్‌కు చెందిన పీటర్ గిల్‌క్రిస్ట్‌తో తలపడతాడు.

**ముగిసిన లీగ్ దశ పోటీలు**



## దబాంగ్ ఢిల్లీ టాప్

**14న ఎలిమినేటర్ మ్యాచ్‌లు.. ప్రొ కబడ్డీ లీగ్-7**

**గ్రేటర్ నోయిడా:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్ లీగ్ దశ పోటీలు ముగిసాయి. ఈ సీజన్‌లో అద్భుతంగా ఆడిన దబాంగ్ ఢిల్లీ జట్టు 85 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో నిలిచింది. ఢిల్లీ మొత్తం 22 మ్యాచ్‌లలో 15 విజయాలు సాధించి 4 ఓటములను చవిచూసింది. 14 విజయాలు సాధించిన బెంగాల్ వారియర్స్ 83 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. మరోవైపు యు ముంబా (72 పాయింట్లు), హరియాణా స్టీలర్స్ (71 పాయింట్లు), యూపీ యోధ (69 పాయింట్లు), డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు బుల్స్ (64 పాయింట్లు) వరుసగా మూడు నుంచి ఆరు స్థానాలలో నిలిచాయి. తెలుగు టైటాన్స్ జట్టు (45 పాయింట్లు) చివరి నుంచి రెండో స్థానంలో నిలిచింది. ఇక సోమవారం నుంచి అహ్మదాబాద్ వేదికగా ఎలిమినేటర్ మ్యాచ్‌లు జరగనున్నాయి. తొలి మ్యాచ్‌లో యూపీ యోధ-బెంగళూరు బుల్స్, రెండో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్- యు ముంబా ఢీ కొంటాయి.

**బుల్స్‌పై యోధా గెలుపు..**

శుక్రవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో యూపీ యోధ 45-33తో బెంగళూరు బుల్స్‌పై గెలిచింది. యూపీ జట్టులో శ్రీకాంత్ జాదవ్, సురెందర్ గిల్ చెరో 9 పాయింట్లతో విజృంభించగా.. అశు సింగ్ 5, రిశాంక్ 4 పాయింట్లతో పర్వాలేదనిపించారు. బుల్స్ తరపున పవన్ కుమార్ 13 పాయింట్లు సాధించినా లాభం లేకుండా పోయింది. దబాంగ్ ఢిల్లీ, యు ముంబా జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్ 37-37గా టై అయింది.

*Printed & Published by* ***MOOTHA GOUTAM*** *on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.*
*Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.*

epaper.prabhanews.com

Lively Interaction For Ever
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్ I
శనివారం 12 అక్టోబర్ 2019

# సోలో ట్రిప్ ప్లాన్ చేస్తున్నారా?

షాదీ మాటే వద్దు గురూ..సోలో లైఫే సో బెటరూ....అన్నాడో సినీ కవి. దాని మాట అటుంచితే.. సమాజం గురించి తెలుసుకోవాలి....అనుకునే వారు మాత్రం సోలో ట్రిప్ అదే నండి ఒంటరిగా ప్రయాణించడం ఇష్టపడతారు. ఎందుకంటే...జంటగా ఉన్నప్పుడు ఒకరి అభిప్రాయాలను గౌరవించాల్సి ఉంటుంది. ఒంటరి జీవితం అనలేము. కానీ ఒంటరిగా వివిధ ప్రదేశాలకు ప్రయాణం చేయడం వల్ల..మనమేంటో, మన శక్తి ఏంటో మనకు తెలుస్తుంది. ముఖ్యంగా మహిళలకు ఇది చాలా అవసరం. ఇంటిదగ్గర,పనిచేసే చోట ఏకాంతం లభించడం అంతసులభం కాదు...కానీ ఒంటరి ప్రయాణం వల్ల మాత్రం ఏకాంతం లభిస్తుంది. మరి సోలో ట్రిప్ వెళ్లాలను కునేవారికి దేశంలో సురక్షితమైన, ఏకాంతంగా గడిపేందుకు అనువైన ప్రదేశాలు చాలా ఉన్నాయి. అందులో కొన్నింటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

➲ సోలో ట్రిప్ వెళ్లాలనుకునే వారికి అద్భుతమైన ప్రదేశం జమ్ము-కశ్మీర్‌లోని లఢాక్. ఇక్కడ నిటారుగా ఉండే ఎత్తయిన పర్వత శిఖరాలు, గాలిలో రెపరెపలాడుతూ స్వాగతం పలికే రంగురంగుల ప్రార్థన జెండాలు...మనకు ఆహ్లాదాన్ని ఆనందాన్ని కల్గిస్తాయి. మిమ్ములను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. వాటిని చూస్తూ ఉంటే మన చుట్టు జనం ఉన్నారన్న సంగతి మరిచిపోయి ఏకాంతంలోకి వెళ్లిపోతాం. మానసిక ప్రశాంతత లభిస్తుంది.



➲ సోలో ట్రిప్‌కు మరో అను కూలమైన ప్రదేశం అస్సాంలోని కజిరంగా నేషనల్ పార్కు. ప్రతిరోజు రణగొణ ధ్వనులతో కాలం గ డిపే మనకు ఇది మరో ప్రపంచా న్ని , ప్రకృతి రమణీయతను పరిచయం చేస్తుంది. దీనిని సందర్శిస్తే అరుదైన వన్య ప్రాణులను చూసే అవాశం దొరుకుతుంది. ఒంటి కొమ్ము ఖడ్గమృగానికి ఈ పార్క్ ప్రఖ్యాతి. అలాగే బ్రహ్మపుత్ర నది వయ్యారాల నడుమ ఉన్న సవన్నా గడ్డిమై దానాల అందాలు తిలకించ వచ్చు. ఆకు రాల్చే అడవులు, చిత్తడి నేలలు,నది ద్వీపాలతో కూడిన సుందర ప్రదేశం ఈ పార్కు. అరుదైన పక్షులకు నెలవు. వన్యప్రాణుల అన్వేష ణ, ప్రకృతి మధ్య జీవిం చడం అనేది ఇష్టమైన వారు, ఫొటో గ్రఫీ ఇష్టపడే వారు తప్పక సందర్శించాల్సిన ప్రదేశం.

కన్నవారు తమ మీద పెట్టుకున్న ఆశలు అడియాసలు కానీయవద్దనే పట్టుదల ఓవైపు.. తమవంతుగా సమాజానికి ఏదో చేయాలనే తపన మరో వైపు.....ఈ రెండు వైవిధ్య భరితమైన మానసిక సంఘర్షణల ప్రతిఫలమే.. వీబీఐటీ కళాశాలలో ..స్ట్రీట్ కాజ్ స్వచ్ఛంద విద్యార్థి సంస్థ పురుడు పోసుకుంది. ఇంతింతై వటుడింతై అన్నట్లు హైదరాబాద్ మహానగరంలో 48 కళాశాలల్లో విస్తరించింది. చదువుకు భంగం వాటిల్లకుండానే.. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇంజనీరింగ్ విద్యార్థులను సమాజాభివృద్ధిలో భాగస్వా ములను చేసింది. నల్లమలలో సోలార్ ల్యాంప్ వెలుగులు నింపింది. భాగ్యనగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాలకు సర్వం తానై నిలిచింది. ఓ కుగ్రామానికి విజ్ఞాన పరిమళాలు వెదజల్లుతోంది. ఏ చిన్న కార్యక్రమం చేయాలన్నా ఎంతో కొంత డబ్బు కావాలి. మరి విద్యార్థులకు మనీ ఎక్కడ నుంచి వస్తుంది? అసలు స్ట్రీట్ కాజ్ ఎలా రూపుదిద్దుకుంది? పూర్తి వివరాలు స్ట్రీట్ కాజ్-వీబీఐటీ కార్యనిర్వాహక మండలి సభ్యులు, బీటెక్ సెకండ్ ఇయర్ విద్యార్థి సంహిత్ మాటల్లోనే..!

## ఈ విద్యార్థులు...

# సమాజ హితార్థులు!



నా పేరు ఎం.సాయి సంహిత్..నేను వీబీఐటీలో బీటెక్ చదువుతున్నాను. మా నాన్న శ్రీనివాస్...బ్యాంక్ ఉద్యోగి..మాది హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్. చదువులకు భంగం కలుగకుండా సమాజానికి మా వంతు సేవచేయాలనే ఆలోచనతో 2009లో శ్రీనిధి కాలేజ్‌కు చెందిన విద్యార్థి అఖిలేష్ జుక్కారెడ్డి ..స్ట్రీట్‌కాజ్ పేరుతో స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థకు వీబీఐటీ విభాగానికి నేను ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్‌ను. ఈబీ మెంబర్లు నాతో సహా ఎనిమిది మంది ఉంటారు. ప్రస్తుతం నగరంలో మొత్తం 48 ఇజనీరింగ్ కాలేజీలకు విస్తరించింది. ప్రతి శని,ఆదివారాల్లో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో అందరం సమావేశం అవుతాము. చేయాల్సిన కార్యక్రమాల గురించి చర్చిస్తాము. నిర్ణయాలు తీసుకుంటాము. దానిప్రకారం ముందుకు వెళుతుంటాము. స్ట్రీట్ కాజ్ సంస్థలో నాలుగు విభాగాలున్నాయి. ..జంతు సంక్షేమం కోసం పా(పీఏడబ్ల్యూ), పర్యావరణ పరిరక్షణ కోసం ఇ-ఫోర్స్, ఉద్యోగుల సంక్షేమం కోసం స్ట్రీట్ కాజ్ -గోల్డ్ పనిచేస్తున్నాయి. ఇక నాలుగోది హైదరాబాద్ యూత్ అసెంబ్లీ..(హెచ్‌వైఏ)..,ఇదే కీలకం.,.ఇది సంస్థ చేయాల్సిన అభివృద్ధి లక్ష్యాలపై చర్చిస్తుంది. చర్చల సారాంశం ఆధారంగా భవిష్యత్తు నిర్ణయాలు తీసు కోవడం జరుగుతుంది.

### గిరిజన ఆవాసాల్లో..

కమ్మన్ పెంట, కొల్లం పెంట, బండల్ రేవు...ఇవి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని మున్ననూర్ నుంచి దాదాపు గంటసేపు దట్టమైన నల్లమల అడవిలో ప్రయాణంచేస్తే ఉన్న చెంచుగూడాలు. ఈ మూడింటిలో దాదాపు 150మంది ప్రజలు ఉంటారు. వీరికి కరెంటు అంటే ఏంటో తెలీదు. సాయంత్రం ఆరు దాటితే గుడిసెలలోంచి బయటకు రారు. పాములు,అడవి జంతువులు భయం...అది తెలిసి థ్రైవ్ సోలార్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ సహకారంతో మా స్ట్రీట్ కాజ్-వీబీఐటి సభ్యులం..ఇల్యూమినేషన్ ప్రాజెక్టు కింద ఆవాసాల్లో 7సోలార్ స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేశాము. ఇవి చీకటి పడగానే ఆటోమేటిక్‌గా ఆన్ అవుతాయి. దీనికోసం లైఫ్ టైమ్ బ్యాటరీని అమర్చాము. ఇంతకాలం సమాజానికి దూరంగా చీకట్లో మగ్గుతున్న గిరిజన గూడాలలో వెలుగులు నింపగలిగాము. మేము ఈ ప్రాజెక్టును జీవితకాలం నిర్వహిస్తాము. మధ్యమధ్యలో ఫాలో అప్ చేస్తున్నాము.

### రెండు సంవత్సరాలుగా

గత రెండు సంవత్సరాలుగా స్ట్రీట్ కాజ్- వీబీఐటీ శాఖ తరుపున పలు కార్యక్రమాలు చేపడుతున్నాము. ఇంటర్ కాలేజ్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నాము. విద్య,వైద్యం,స్త్రీ శక్తి తదితర సామాజిక సమస్యలపై స్వచ్ఛందంగా స్పందించి మా శక్తిమేర సహాయ సహకారాలు అందిస్తున్నాము. హైదరాబాద్‌లోని సుల్తాన్ బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకున్నాము. అప్పటి నుంచి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించుకుంటున్నాము. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తాము. పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపరిచేందుకు పాటుపడుతు న్నాము. అలాగే నిర్మల్ జిల్లాలోని అటవీ ప్రాంతంలోని వేంకటాపూర్ ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకున్నాము. పాఠశాలకు 8 బెంచ్‌లు, విద్యార్థుల కోసం 36 బ్యాగులు అందించాము. అలాగే టీచింగ్ ఎయిడ్స్ సమకూర్చాము. డాక్టర్ మల్లా చారిటబుల్ ట్రస్టు సహకారంతో మెడికల్ క్యాంప్ నిర్వహించాము.

మహబూబాబాద్ జిల్లా తంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామంలోని ప్ర భుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం కల్పించాము. గ్రామంలో ఫ్లోరోసిన్ సమస్య ఉన్నందున పాఠశాల విద్యార్థుల కోసం వాటర్ ప్యూరిఫికేషన్ ట్యాంక్ నిర్మించడం ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరించగలిగాము. అలాగే కామారెడ్డి జిల్లా దోమకొండ గ్రామంలో 2000 పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు చేశాము. అందులో కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు ఉన్నాయి. అలాగే పోటీ పరీక్షలకు ఉపయోగ పడేవి ఉన్నాయి.



### పునర్భవ..

పునర్భవ అనే ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నాము. వేస్ట్ వెంచర్స్ అనే సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాము. మనం వాడిన పుస్తకాలు, నోట్ బుక్‌లో, ఇతరత్రా సేకరించి ఆ సంస్థకు అందిస్తాము. వారు వాటిని రీసైక్లింగ్ చేసి, నోటు బుక్స్ తయారు చేసి ఇస్తారు. వాటిని పేదవిద్యార్థులకు అందజేస్తు న్నాము. అంతేకాకుండా అనాథ శరణాలయాలకు, వృద్ధాశ్రమాలకు బియ్యం, ఇతర సరుకులు ఉచితంగా పంపిణీ చేశాము. ముఖ్యం గా వారికి ఆరోగ్య పరమైన సహాయ సహకారాలు అందిస్తున్నాము. రెండు సంవత్సరాలుగా హైదరాబాద్ నగరంలోని నిరాశ్రయులు, దిక్కుమొక్కులేక వీధుల్లో ఫుట్‌పాత్‌ల మీద నిద్రించేవారికి.. చలి కాలంలో దుప్పట్లు అందజేస్తున్నాము.





### నిధుల కోసం ఈవెంట్స్....

ఎలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నా నిధులు అవసరం..మేము విద్యార్థులం.. పాకెట్ మనీతో ఇలాంటి కార్యక్రమాలు చేయలేము. అందుకే నిధుల కోసం ఈవెంట్లు నిర్వహిస్తాము. తద్వారా వచ్చిన డబ్బులతోనే సేవా కార్యక్రమాలు చేస్తున్నాము. ఈవెంట్ల నిర్వహణ ద్వారా ఆర్థిక సమస్యను అధిగమించలుగుతున్నాము. ఇక్కడ మీకో విషయం చెప్పాలి..నాకు అవకాశం వచ్చింది కాబట్టి మీతో విషయాలు పంచుకున్నాను. కానీ ఈ కార్యక్రమాలన్నీ నేను ఒక్కడినే చేయడం లేదు.

ఇది మా స్ట్రీట్ కాజ్ సంస్థలోని సభ్యులందరి సమష్టి కృషిఫలితం. ఇందులో సెకండ్, థర్డ్ ఇయర్ విద్యార్థులు ఉంటారు. మేము పై చదువులకు వెళ్లిపోతే.. మాతర్వాత వచ్చే విద్యార్థులు ఇందులో సభ్యులుగా మారి కార్యక్రమాలు కొనసాగిస్తారు. అంటే ఇది నిరంతరం సాగే ప్రక్రియ. మా బ్యాచ్‌తో ఈ సేవాకార్యక్రమాలు ఆగిపోవు. మా తర్వాత వచ్చే విద్యార్థులు పాత ప్రాజెక్టులను కొనసాగిస్తూ.. కొత్తవి చేపడుతుంటారు.

ఇంటికి అతిథులు వచ్చారా? ఏదైనా స్వీట్ వండి వడ్డించాలనుకుంటున్నారా? ఎక్కువ టైం లేదు..స్వీట్ చేయాలంటే టైం పడుతుంది. మీరేమి కంగారు పడకండి..సులభంగా తయారు చేసి, మీ బంధువుల మనసుదోచే మార్గం ఉంది. అదే గసగసాల పాయసం. ఏంటీ పాయసం అనగానే నోరు ఊరుతోందా? ఎలా తయారుచేయాలో తెలీదా? అయితే ఇది చదవండి... పాపయసం రెడీ చేసుకోండి!

# గసగసాల పాయసం!



### కావలసిన పదార్థాలు

- 150గ్రాముల గసగసాలు
- 200గ్రాముల బియ్యం
- 30 గ్రాముల తురిమిన కొబ్బరి
- 500మిల్లీలీటర్ల పాలు
- 5గ్రాముల పచ్చని ఏలకులు
- 10గ్రాముల బెల్లం
- 20మిల్లీలీటర్ల నెయ్యి
- 2 రెండు వేయించిన జీడిపప్పులు
- 10గ్రాముల వేయించిన ఎండు ద్రాక్ష

### తయారు చేసే విధానం

మొదట గసగసాలు, బియ్యం కలిపి, ఒక పాన్ మీద గోదుమ రంగు వచ్చేవరకు వేయించుకోవాలి. తర్వాత వాటిని రవ్వలా ఉండేలా రుబ్బి,దానికి తురిమిన కొబ్బరి, తగినంత నీరు పోసి మెత్తగా రుబ్బుకొని పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత మరో గిన్నెలో పాలను వేడి చేసి, అందులో కొబ్బరి తురుము,ఏలకులు, బెల్లం వేసి మరిగించుకోవాలి. అందులో రుబ్బిన బియ్యం,గసగసాల మిశ్రమాన్ని కలుపాలి. మరో పాత్రలో నెయ్యి ,జీడిపప్పు,వెండుద్రాక్ష, ఏలకులును కలిపి 15 నిమిషాలు ఉడికించాలి. పైనతయారు చేసుకున్న మిశ్రమంతో కలుపుకోవాలి. ఇంకేంటీ వేడివేడి గసగసాల పాయసం రెడీ!

కాపురంలో చిరు కలహాలు ఉండడం అనేది దాంపత్య బంధాన్ని బలోపేతం చేస్తుంది. అలాగని ప్రతి రోజు గొడవపడితే మాత్రం అది సంసారాన్ని కూలదోస్తుంది. ఒక అంశంమీద అభిప్రాయాన్ని మీ భాగస్వామికి చెప్పడం ద్వారా దంపతుల మధ్యసమాచార మార్పిడి జరగాలి. అది మీ భాగస్వామికి చాలా ఇబ్బంది కల్గించేదైనా, ఇష్టం లేనిదైనా సరే! అంటే ఇద్దరి మధ్య అభిప్రాయ మార్పిడి తప్పని సరి. అందుకే చిరు కలహాలు ముదిరి కాపురాన్ని నాశనం చేయకుండా ఎలా తెలివిగా మసలు కోవాలో ఇప్పుడు తెలుసుకుందాం!

ఆగ్రహం హైపిచ్‌లో ఉంటే.. చర్చను మధ్యలో వదిలివేయవద్దు. అవసరమైతే మీ భాగస్వామికి దానిని గురించి ఆలోచించుకునేందుకు టైం ఇవ్వండి. ఆ విషయం వారికి తెలిసేలా చెప్పండి.

# చిరు కలహాలు మంచివే!

గొడవదాకా వచ్చిందని తేలితే తప్పును అంగీకరించండి. మీ భాగస్వామి మీద పగపెంచుకోవడం, రాజీ పడకుండా ఉండడానికి ఇగోనే కారణం అవుతుంది. అందుకే ఇగోను పక్కన పెట్టక తప్పదు. ఇగో అనేది ఎదుటి వ్యక్తిని అర్థం చేసుకోనివ్వదు. పైగా తీవ్ర మనస్పర్ధలకు దారితీస్తుంది.

➪ ప్రతి విషయానికి గొడవపడడం సరైంది కాదు. ఏదైనా ఒక సమస్య పట్ల మీ భాగస్వామి ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించరు అని తెలిసినప్పుడు మాత్రమే.. చర్చకు తావీయండి.అలాంటివాటిని చిరుకలహాలుగా భావించ వద్దు. మీ భాగస్వామి గొడవ పడతారని తెలిసినా ఇలాంటి వాటిని నిర్లక్ష్యం చేయవద్దు. లేదంటే లాంగ్ టర్మ్ లో అది మీ దాంపత్యానికి గొడ్డలి పెట్టుగా మారవచ్చు. అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరమే మంచిదన్న విషయం గుర్తుంచుకోండి. అంటే మీ భాగస్వామితో ఎలాంటి విషయంలో గొడవ పడాలో గుర్తించి ..వాటి విషయంలోనే కలహానికి సిద్ధం కండి. లేదంటే సర్దుకు పోవాలి.

➪ మీరు ఏదైనా అంశం మీద మీ భాగస్వామితో కలహానికి సిద్ధ పడేటప్పుడు ముందు ..ఆ విషయంపై మిమ్ములను మీరు శాంతపరుచుకోండి. ప్రశాంతంగా విషయంపై చర్చకు తెరతీయండి. ఆగ్రహంతో రగిలి పోతూ విషయంపై చర్చను ప్రారంభించ వద్దు. మీరు గొడవ పడక తప్పదని నిర్ణయించుకున్న విషయం గురించి మీ భాగస్వామిని అడగాలని నిర్ణయించుకున్నప్పుడు.. ఎప్పుడు పడితే అప్పుడు రెడీ కావద్దు. ప్రశాంత చిత్తంతో పడక గదిలోనో..లేక ఇద్దరూ వాకింగ్‌కు వెళ్లినప్పుడో.. విషయాన్ని ప్రస్తావనకు తెండి. విషయంపై వాడిగా వేడిగా చర్చ జరుగుతున్నప్పుడు, మీ భాగస్వామి

➪ ఇలాంటి విషయాలలో ఎప్పుడూ ఇగోకు పోవద్దు. ఎదుటి వారి పట్ల దయార్ద్ర హృదయంతో ఉండండి. ఒకవేళ మీ వల్లే సమస్య



➪ మీ మధ్యతలెత్తిన సమస్యకు కారణం ఎవరు? ఎందుకు అలా జరిగిందో మీకు మీరుగా విశ్లేషించుకోలేక పోయినప్పుడు మీ స్నేహితుల లేదా కుటుంబ సభ్యుల సలహా తీసుకోవాడానికి వెనుకంజవేయవద్దు. అవసరమైతే మీ భాగస్వామితో జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం విషయంలో వారిని మధ్యవర్తిత్వం నెరపమని అడగండి. ఎందుకంటే సమస్య జటిలమైనప్పుడు మీరు కోపానికి గురవుతారు. విచక్షణ కోల్పోయే ప్రమాదం ఉంది.ఇటువంటి క్లిష్టపరిస్థితిలో మీ స్నేహితులు లేదా కుటుంబ సభ్యులు మీకు మార్గనిర్దేశం చేస్తారు. సమస్య పరిష్కారం అవుతుంది.

# దినఫలాలు

**మేష రాశి**
పనుల్లో విజయం, శుభవార్తలు వింటారు. ఆర్థిక ప్రగతి ఉంటుంది. ముఖ్య నిర్ణయాలు, దూరపు బంధువులతో సఖ్యత. వ్యాపార, ఉద్యోగాలు మరింత ఆశాజనకంగా ఉంటాయి. నూతన ఉద్యోగాలు.

**వృషభ రాశి**
మిత్రులతో విభేదాలు. ఆర్థిక పరిస్థితి అయోమయంగా ఉంటుంది. ఆకస్మిక ప్రయాణాలు. కుటుంబంలో ఒత్తిడులు. వ్యాపారాలు, ఉద్యోగాలలో అనుకోని మార్పులు.

**మిథున రాశి**
కొత్త విషయాలు తెలుసుకుంటారు. విద్య, ఉద్యోగావకాశాలు, పరపతి పెరుగుతుంది. పరియ చాలు పెరుగుతాయి. వ్యాపారాలు ఉత్సాహవంతంగా సాగుతాయి. ఉద్యోగాలలో చిక్కులు తొలగుతాయి.

**కర్కాటక రాశి**
పనుల్లో స్వల్ప ఆటంకాలు, రుణాలు చేస్తారు. ఆలోచనలు కలసిరావు. దైవదర్శనాలు, ఆరోగ్య సమస్యలు, వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగాలలో మరిన్ని బాధ్యతలు మోయాల్సి వస్తుంది.

**సింహ రాశి**
పలుకుబడి పెరుగుతుంది. వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. భూలాభాలు. చిన్ననాటి మిత్రుల కలయిక, ఆధ్యాత్మిక చింతన, వ్యాపారాలు, ఉద్యోగాలలో పురోభివృద్ధి సాధిస్తారు.

**కన్య రాశి**
శుభకార్యాలలో పాల్గొంటారు. పాత బాకీలు కొన్ని వసూలవుతాయి. నూతన ఉద్యోగప్రాప్తి. విందు వినోదాలు. చిన్ననాటి మిత్రల కలయిక. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యల నుంచి గట్టెక్కుతారు.

**తులా రాశి**
కొన్ని పనులు వాయిదా వేస్తారు. ఆర్థిక లావాదేవీలు నిరాశ కలిగిస్తాయి. బంధువులతో విభేదాలు. ఆలయాలు సందర్శిస్తారు. అనారోగ్యం, వ్యాపారాలలో లాభాలు కనిపించవు. ఉద్యోగాలలో చిక్కులు.

**వృశ్చిక రాశి**
పరిస్థితులు అనుకూలించవు. వృథా ఖర్చులు. ఆరోగ్యభంగం. మిత్రులలో మాటపట్టింపులు. వ్యాపారాలు, ఉద్యోగాలలో మరింతగా ఒత్తిడులు. పనుల్లో ప్రతిబంధకాలు.

**ధనూ రాశి**
నూతన ఉద్యోగాలు లభిస్తాయి. కీలక నిర్ణయాలు, వ్యవహారాలలో విజయం, ప్రముఖులతో పరిచయాలు. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూలమైన పరిణామాలు. సంఘంలో గౌరవం.

**మకర రాశి**
కొత్త పనులు చేపడతారు. శుభవార్తలు, ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగాలలో చిక్కులు తొలగుతాయి.

**కుంభ రాశి**
రుణాలు చేస్తారు. పనుల్లో మరింత జాప్యం. బంధు, మిత్రులతో విభేదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. దూరప్రయాణాలు. వ్యాపార, ఉద్యోగాలలో ఒడిదుడుకులు, దైవ దర్శనాలు.

**మీన రాశి**
శ్రమ తప్ప ఫలితం ఉండదు. రుణదాతల ఒత్తిడులు. ఆధ్యాత్మిక చింతన, పనులు ముందుకు సాగవు. వ్యాపార, ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు. కళాకారులకు విదేశీ పర్యటనలు వాయిదా.



శ్రీ గుదిమెళ్ళ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి



రుద్రాక్ష ధారణ వల్ల సకల విధాల ఆరోగ్యవంతులవుతారు. సకల పాపాల నుంచి విముక్తులవుతారు. రుద్రాక్షలు ధరించిన వ్యక్తి సదా దేవతల అనుగ్రహం పొందుతూ ఉంటాడు. అతనికి జీవితంలో పురోగతి, చివరకు పరమగతి ప్రాప్తిస్తుందని శాస్త్ర వాక్యం

# శివ ప్రసాదం రుద్రాక్ష

రుద్రాక్షలు పరమ పవిత్రమైనవని అందరికీ తెలుసు. అవి సర్వ శుభాలను, లాభాలను, సమస్త భోగ భాగ్యాలను, అష్టైశ్వర్యాలను, ఆధ్యాత్మిక, అమరత్వ సిద్ధిని, ఉత్తమ గతిని, పురోగతిని అందిస్తాయి. త్రిపురాసురుణ్ణి వధించేందుకు ఈశ్వరుడు 'అఘోర' అనే దివ్యాస్త్రాన్ని స్మరించగా, శివుని నేత్రాల నుంచి కొన్ని అశ్రు బిందువులు భూమ్మీద పడ్డాయి. అవి రుద్రాక్ష వృక్షాలుగా ఆవిర్భవించేయి. స్వయంగా ఈశ్వరుడే కార్తికేయునికి ఈ విషయం తెలిపాడు. ఈ వృక్షాల నుంచి శివుని ఆజ్ఞ తో 38 రకాల రుద్రాక్షలు ఫలరూపాన ప్రకటితమయ్యాయి. శివుని ఆజ్ఞ మేరకు సూర్యుని నేత్ర శక్తితో కపిల వర్ణంలో గల 12 రుద్రాక్షలు, చంద్రుని నేత్ర శక్తితో తెల్లగా ఉండే 16 రుద్రాక్షలు, అగ్నిదేవుని నేత్ర శకితో కృష్ణవర్ణంలో ఉండే 10 రుద్రాక్షలు ఉత్పన్నయ్యాయి.

**రుద్రాక్ష మాహాత్మ్యం**

రుద్రాక్షలను మాలగా కంఠమందు 32, తలపై వీలైన రీతిలో 40, ఒక్కొక్క చెవికి ఆరేసి చొప్పున, ఒక్కో చేతికి 12 వంతున ఇరవై నాలుగు, రెండు భుజాలలో ఒక్కో దానికి 16, శిఖ యందు ఒకటి, వక్షస్థలమందు 108 ధరించాలి. ఇలా ధరించిన వ్యక్తి నీలకంఠునితో సమానుడవుతాడని శాస్త్రాలు చెబుతున్నాయి. రుద్రాక్షలకు ఇంతటి మహత్తు ఉంది. బంగారం, వెండి తీగతో రుద్రాక్షలను శిఖయందు, చెవులకు ధరించవచ్చు. యజ్ఞోపవీతంతో కూడా రుద్రాక్షను ధరించవచ్చు. తెలుపు, నలుపు, పసుపు దారంతో కూడా ధరించవచ్చు.

**ధరించే విధానం**

భగవంతుడైన శంకరుని జ్ఞానాన్ని పొందే సాధనం రుద్రాక్ష ధారణం. రుద్రాక్ష ధారణ విషయంలో వివక్ష లేదు. అయితే ద్విజులు మంత్రసహితంగా, ఇతరులు మంత్రం లేకుండానే ధరించవచ్చు. రుద్రాక్షలు ధరించిన ఏ పురుషుడైనా సాక్షాత్తు భగవంతుడైన శంకరునితో సమానుడు. శ్వేతవర్ణ రుద్రాక్షలను ద్విజులు, క్షత్రియులు, రక్త వర్ణం, ఇతర రంగుల రుద్రాక్షలను వైశ్యులు, కృష్ణ వర్ణ రుద్రాక్షలను ఇతరులు ధరించాలని శాస్త్ర వచనం. నూట ఎనిమిది గాని, యాభైనాలుగు గాని, ఇరవై ఏడు రుద్రాక్షలను మాలగా తయారు చేసుకుని ధరించాలి.

రుద్రాక్షలను ధరించిన వ్యక్తికి ప్రతిదినం అశ్వమేధ యాగ ఫలం లభిస్తుంది.

# చింతన

**భద్రాక్ష**

రుద్రాక్షలలో భద్రాక్షలు ఒక రకం. అయితే భద్రాక్షలను రుద్రాక్షల కంటె తక్కువ స్థాయివిగా పరిగణిస్తుంటారు. రెండూ ఒక రకమైన వృక్షాల నుంచి ప్రకటితమైనవే. వాటి ఆకారాల్లో తేడా ఉంటుంది. రుద్రాక్షలకుండే సహజ సిద్ధమైన రంధ్రాలు భద్రాక్షలకుండవు.

**రుద్రాక్షలను శక్తివంతం చేసే విధానాలు**

రుద్రాక్షలను శక్తివంతం చేసేందుకు పలు విధానాలున్నాయి. రుద్రాక్షలను పూజలో ఉంచి, గంధంతో అలంకరించి, యంత్రంలో ప్రతిష్ఠించి శక్తివంతం చేయవచ్చు. మహానుభావులు, గురువులు తమ స్వీయ ప్రతిభావిశేషాలతో రుద్రాక్షలను శక్తిమంతం చేస్తారు.

**నియమాలు**

రుద్రాక్ష ధారణ రెండు విధాలుగా ఉంటుందని పెద్దలు చెబుతారు. వారు చెప్పే దాని ప్రకారం రుద్రాక్షలను తీసివేసి ధరించే అలవాటు ఉన్నవారు, ఎల్లప్పుడూ ధరించేవారు ఉంటారు. ధరించి తీసివేసే అలవాటున్న వారు అది ధరించినసమయంలో మద్య మాంసాలను సేవించకూడదు. ఉల్లి, వెల్లుల్లి, మునగ తినకూడదు, నిద్ర, బహిర్భూమికి వెళ్ళడం వంటి సమయాలలో, స్త్రీ సంగమ సమయంలో తీసివేయాలి. వీరు గ్రహణ తుల, మేష సంక్రాంతుల నాడు, అమావాస్య, పౌర్ణమి మొదలైన పర్వదినాలలో ధరించడం మంచిది. ఇక ఎప్పుడూ ధరించేవారు, సర్వ కాల సర్వావస్థల యందు వేసుకుని ఉండవచ్చు. అవి శరీరంలో భాగంగా భావించాలి. అందువల్ల శరీర శుద్ధితోనే వాటి శుద్ధీ జరిగిపోతుంది.

**ఫలితాలు**

రుద్రాక్ష ధారణ వల్ల సకల విధాల ఆరోగ్యవంతులవుతారు. సకల పాపాల నుంచి విముక్తులవుతారు. రుద్రాక్షలు ధరించిన వ్యక్తి సదా దేవతల అనుగ్రహం పొందుతూ ఉంటాడు. అతనికి జీవితంలో పురోగతి, చివరకు పరమగతి ప్రాప్తిస్తుందని శాస్త్ర వాక్యం. రుద్రాక్షమాల ధరించడం వల్ల మన ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మానసిక ఒత్తిడిని, రక్త పీడనాన్ని, ఆందోళనను తగ్గిస్తుంది. మానసిక ప్రశాంతతను పెంపొందిస్తుంది. జంతువుల పరంగా వచ్చే ప్రమాదాల నుంచి రక్షిస్తుంది. రుద్రాక్షలను ఋతుక్రమం ఆగిన స్త్రీలు మాత్రమే ధరించాలి. అయితే ఇతరులు కూడా జప సంఖ్యను లెక్కించుకునేందుకు చేతిలో ఉంచుకోవచ్చు.

(రుద్రాక్షలు - ముఖాలు - విశేషాలు వచ్చే శనివారం నాటి సంచికలో)



- రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669

# కాల్గరీలో శరన్నవరాత్రి ఉత్సవాలు



కెనడాలోని ఆల్బెర్టా కాల్గరీలో గల అనఘాదత్త సాయిబాబా మందిరంలో ఇటీవల ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు జరిగాయి. శ్రీమతి లలితా, శైలేష్ తదితరుల ఆధ్వర్యంలో వలంటీర్లు ఉత్సవ ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజ్‌కుమార్ శర్మ ప్రతినిత్యం అమ్మవారికి అలంకరణ, పూజ, హోమం నిర్వహించి శరన్నరాత్రుల విశిష్టతను వివరించారు. బాలాత్రిపుర సుందరి నుంచి రాజరాజేశ్వరివరకూ వివిధ అలంకారాలతో రోజూ అమ్మవారు కనువిందు చేశారు. ప్రతినిత్యం ఆలయంలో లలితా, విష్ణు సహస్రనామ పారాయణలు, బాబా నిత్య పూజలు జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా స్థానిక కళాకారులు భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. సుమారు 450 కుటుంబాల వారు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అందరికీ తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

# వివేకంతో వ్యవహరించినా లక్ష్మీ ప్రాప్తి



**సహసా విదధీత నక్రియం**
**అవివేకః పరమాపదాం పదమ్**
**వృణతే హి విమృశ్యకారిణః**
**గుణ లుబ్ధాః స్వయమేవ సంపదః**

ఇది మేటి హితవచనాల్లో ఒకటి. త్వరపడి ఏ కార్యం ఆలోచన లేకుండా చేయరాదు. తొందరపాటు అవివేకం అన్ని ఆపదలకు మూలం. ఆలోచించి సవిమర్శంగా పనిచేసే వానినిలక్ష్మి స్వయంగా కోరి వరిస్తుంది అని ఈ శ్లోకం అర్థం. దీనికి పరోక్షంగా మరో అర్థం కూడా ఉంది. తొందరపాటు, అవివేకంతో చేసే పనులు అనర్థదాయకమేకాదు. లక్ష్మి విడిచివెళ్లిపోతుంది. దీనిని తెలిపే కథలు చాలా ఉన్నాయి. వాటిలో ఒకటి గుర్తు చేసుకుందాం.

ఒక వ్యక్తిని అతని అల్లుడు వ్యాపారం చేసుకుంటానని లక్ష వరహాలు అడిగాడు. ఆ సమయంలో ఆ మామ వద్ద అంత డబ్బు లేకున్నా అతను అభివృద్ధిలోకి వస్తే కూతరు సుఖపడుతుందని తన భార్య నగలు అమ్మి, దగ్గరున్న డబ్బు జత చేసి ఇచ్చాడు. అల్లుడు ఆ డబ్బుతో వ్యాపారం చేసి సంపన్నుడయ్యాడు. సంపదతో అహంకారం తలకెక్కడంతో మామగారిచ్చిన డబ్బు ఆమనకు తిరిగి ఇవ్వలేదు. ఆయన వచ్చి అడిగినా చూద్దామనే వాడు. ఆయన పడే కష్టాలు తనవి కావనుకున్నాడు. అల్లుడు డబ్బు ఎంతకీ తిరిగి ఇవ్వక పోవడంతో రెండు కుటుంబాల మధ్య మనస్పర్థలు వచ్చాయి. అవి పెద్దవై కుటుంబాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. ఇలా ఏడు సంవత్సరాలు గడిచాయి. మామ అల్లుడి ముఖం చూడలేదు. తన వారిని అతని ఇంటికి వెళ్లనివ్వలేదు. డబ్బు కోసం సంబంధాలు తెంచుకోరాదన్న భార్య మాటలు వినలేదు. అతనిలో కోపంతో పాటు అశాంతి పెరిగిపోయింది. కాకతాళీయంగా ఆ సమయంలో ఒక సాధువు కనిపించాడు. అతనికి తన గోడు వినిపించాడు. దానికా సాధువు, 'గోడకు వేసిన సున్నం, అల్లుడికిచ్చిన సొమ్ము తిరిగిరాద'న్న సామెత నీకు తెలియదా? ఇప్పుడు నీవెంత కుమిలిపోయినా ప్రయోజనం లేదు. అయితే నీలో అశాంతి మాయమవడానకి ఒక ఉపాయం ఉంది చెబుతాను' అన్నాడు. 'నీ కూతరుని, అల్లుని దూరం చేసుకున్న కారణంగానే నీకు ఈ అశాంతి. నీవు మిఠాయిలు, పళ్లు తీసుకుని అల్లుడింటికి వెళ్లి నీ తప్పు

క్షమింమని అడుగు' అన్నాడా సాధువు. 'తప్పు చేసింది అల్లుడు కదా' అన్నాడు మామ. దానికి ఆ సాధువు 'కాదు ముమ్మాటికీ నీవే తప్పు చేశావు. ఒకటికాదు. ఆలోచించకుండా తొందరపడి అంత డబ్బు ఇవ్వటం మొదటి తప్పు. ఆ డబ్బుతో అతడు ప్రయోజకుడయ్యాడని ఆనందపడాలి కాని ఈర్ష్యపడుతున్నావు. ఇది రెండో తప్పు. కూతురు, అల్లునితో తెగతెంపులు చేసుకున్నావు, మనుమడు, మనుమరాళ్ళ ముఖాలు కూడా చూడలేకపోయావు. వారిని కూడా ద్వేషించడం నీ మూడవ తప్పు. నేను చెప్పినట్లు ఉపాహారాలు తీసుకుని వెళ్లి నీ తప్పులు ఒప్పుకుని క్షమించమని అడుగు. నీ అల్లుడిలో మార్పు వస్తుంది. నీ ఓర్వలేనితనం, ఈర్ష్య క్షణంలో కర్పూరంలా హరించుకుపోతాయి. రోగి తీయని మందు కోరినా వైద్యుడు చేదు మందు ఇవ్వడం మానడు. అలాగే నా సలహా నీకు రుచించకపోవచ్చు. అయితే నీలో అశాంతి తొలగాలంటే మరో మార్గం లేదు' అన్నాడు.

మామ మరునాడే భార్యను తీసుకుని పళ్లు, మిఠాయిలతో అల్లుడింటికి వెళ్ళాడు. సాధువు చెప్పినట్టే తనని క్షమించమని మామ అడిగాడు. మామ తనను క్షమించమని అడగ్గానే అల్లుడు నివ్వెరపోయాడు. తప్పు చేసింది తను. మామగారి డబ్బు తను తిరిగి ఇవ్వలేదు. క్షమించమని అడగవలసింది తను అనుకున్నాడు. వెంటనే మామగారి పాదాల మీద పడ్డాడు. 'నన్నే మీరు క్షమించాలి' అన్నాడు. అందరి కళ్లల్లో ఆనంద జ్యోతులు వెలిగాయి. మనుమలు కూడ తాత అమ్మమ్మలను చూసి సంబరపడ్డారు. 'క్షమించు' అన్న ఒక్క చిన్న మాటతో ఆ రెండు కుటుంబాలు మళ్ళీ దగ్గరయ్యాయి. సజ్జనులు ఇచ్చే సలహాలు మంచి చేస్తాయి.

గుమ్మా ప్రసాదరావు (భిలాయ్)
9755110398



## భగవద్గీత

# ఈ జ్ఞానాన్ని శ్రద్ధతో అధ్యయనం చేస్తే జ్ఞాన యజ్ఞ ఫలం

అధ్యాయం- 18
శ్లోకం- 69

అధ్యేష్యతే చ య ఇమం
ధర్మ్యం సంవాదమావయోః।
జ్ఞానయజ్ఞేన తేనాహమ్
ఇష్టః స్యామితి మే మతిః॥

**తాత్పర్యం**

మన ఈ పవిత్రమగు సంవాదమును శ్రద్ధతో అధ్యయనము చేయువాడు జ్ఞానయజ్ఞముచే నన్ను పూజించినవాడగునని నేను ప్రకటించుచున్నాను.

**భాష్యం:** లేదు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత యధాతథము' ఆధారంగా సమర్పిస్తున్నాము.

Google play | iOS iTunes

# గో గీత

**దృష్ట్వా ప్రయతాం స్తు కురూన్ కిరీటీ**
**హృష్టో బ్రవీత్ తత్ర సముత్స్యపుత్రమ్**
**ఆవర్త యాశ్వాన్ పశవో జితాస్తే**
**యాతాః వరే యాహి పురం ప్రహృష్టః**

(విరాటపర్వం 26 అ.29)

గోవులను రక్షించి, విజయోత్సాహంతో అర్జునుడు ఉత్తరునితో 'గుర్రాలను మరలింపుము. గోవులను రక్షించితిమి. శత్రువులు వెడలిపోయిరి. విజయోత్సాహంతో నగరానికి బయలుదేరు' అంటాడు.



- లక్ష్మణరేఖ గోపాలకృష్ణ
9493053206




## మీకు తెలుసా..!

### బల్గేరియాలో తల ఊపటంలో తేడాలు




సాధారణంగా మనం అవును... అని చెప్పడానికి తలని ఒకరకంగా నిలువుగా ఊపుతాం. అలాగే కాదని అనడానికి అడ్డంగా తిప్పుతాం. కానీ బల్గేరియాలో మాత్రం విచిత్రంగా ఇందుకు వ్యతిరేకంగా చేస్తారు. అంటే మనం అవును అనడానికి తలని ఎలా ఊపుతామో అలా... వారు కాదనడానికి ఊపుతారు. అలాగే వాళ్లు తలని అడ్డంగా తిప్పారంటే... అది అవునని అర్ధమన్నమాట. వారిలో ఈ ఇలాంటి వ్యతిరేక సంప్రదాయం ఎందుకు ఉందో ఎవరికీ తెలియదు. ఇతర దేశీయులు బల్గేరియా వెళ్లినప్పుడు... తలని ఊపటం కాకుండా అవును...కాదు అని నోటితో చెప్పటం మేలన్నమాట.

### థామస్ అల్వా ఎడిసన్‌కి చీకటంటే భయం

మొట్టమొదట విద్యుత్ బల్బుని కనిపెట్టిన థామస్ ఎడిసన్ పేరుని వినే ఉంటారు కదా...ఆయన బల్బుని కనిపెట్టడానికి వెయ్యిసార్లకు పైగా ప్రయత్నించి విఫలమయ్యాడు. అయినా పట్టువదలకుండా పరిశోధనలు చేసి చివరికి విజయం సాధించాడు. అయితే ఆయన గురించి మనకు తెలియని నిజం ఏమిటంటే...థామస్‌కి చీకటంటే భయం ఉండేది. అంటే ఫోబియాలా అన్నమాట. బహూశా అందుకే ఆయన చీకటిని పారద్రోలే సాధనం కోసం అంతగా శ్రమించి ఉంటాడు.



### తుమ్ము వేగం ఎంతో తెలుసా?

తుమ్ము వస్తే...ఆపుకోవటం చాలా కష్టం కదా. ఎందుకంటే...దాని వేగం అలా ఉంటుంది. తుమ్ము వేగం గంటకు 160 కిలోమీటర్లు. మనం ప్రయాణించే వాహనాల వేగంకంటే ఎక్కువ. తుమ్ము గురించి మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే...మనం కళ్లను తెరచి ఉంచి తుమ్మలేము.



ప్రపంచ

వింతలు-విశేషాలు





### బంగారు పలుకు

వ్యక్తిత్వం కోసం విజయాన్ని వదులుకో, కానీ విజయం కోసం వ్యక్తిత్వాన్ని వదులుకోకు...

- స్వామి వివేకానంద

# గంప కింద పిల్లి



శేషాద్రి కొండ దిగువన ఏడుకొండలకి వెళ్లే దారిలోని కపిలతీర్థం వద్దకి కోదండ రామయ్య ఏడాది కొకసారి వచ్చేవాడు. ప్రతి ఏడాదీ తన తండ్రి తిథి రోజు అయిన శ్రావణ శుద్ధ బహుళ ఏకాదశి నాడు పిండ ప్రదానం చేయడానికి తన కొడుకు కోటి వీరయ్యను తోడుగా తీసుకొచ్చేవాడు.

శేషాచలం కొండలనుంచి ఆకాశ గంగ గల గల పారుతూ 20 అడుగుల ఎత్తులోంచి ఆలయ పుష్కరిణిలోకి దూకే పవిత్ర పుణ్య ప్రదేశాన్ని కపిలతీర్థంగా కొనియాడుతారు.కృత యుగంలో ఈశ్వరుని గురించి తపస్సు చేసిన కపిల మహర్షి భక్తికి శివుడు మెచ్చి పాతాళం నుండి పుడమిని బద్దలు చేసుకొని కపిలతీర్థంలో నిలిచినట్లు స్థల పురాణం చెబుతోంది. దివంగతులైన పూర్వీకులకు కపిలతీర్థం వద్ద పిండ ప్రదానం చేస్తే పై లోకంలోని వారి ఆత్మలు శాంతి పొందుతాయని ప్రతీతి. అంత చారిత్రక ప్రాశస్త్యం వున్న స్థలంలో తన తండ్రికి తర్పణం వదలడాన్ని కోదండ రామయ్య ఎంతో గొప్పగా భావిస్తాడు.

ఒక శ్రావణ శుద్ధ బహుళ ఏకాదశి నాడు ఇంటి వద్దనే తన తండ్రికి ఇష్టమైన జీ డి పప్పు పాయసం చేయించి నాడు. పప్పు బియ్యం కూరగాయలను కూడా తెచ్చి కపిల తీర్థంలో వుండే పురోహితుడి ఆధ్వర్యంలో పిండ ప్రదానం చేసి మరణించిన తండ్రికి తర్పణం వదల దలిచాడు. పిండ ప్రదానంకి అవసరమైన చిన్న చిన్న సహాయాలను కొడుకు కోటి వీరయ్య చేసేవాడు.

ఆ రోజు పిండ ప్రదానం చేసే సమయంలో ఒక పిల్లి గబ గబా వచ్చి పాయసం తినడానికి ప్రయత్నించింది. ఏమి చేయాలో తెలియక కోదండ రామయ్య తన కొడుకుతో దూరంగా పడి వున్న ఒక గంపను తెచ్చి పిల్లిని దాచి పెట్టమని చెబుతాడు. కోటి వీరయ్య భద్రంగా పిల్లిని పట్టి జాగ్రత్తగా గంప కింద దాచి పెడతాడు. కార్యక్రమం పూర్తయ్యేంతవరకు పిల్లినే కాచి పెట్టుకొని కూర్చొన్నాడు. తర్పణం ఇవ్వడం పూర్తి అయినాక గంప కింది పిల్లిని విడిచి పెట్టేసినాడు. ఇది జరిగిన ఆరు నెలలకి 'చావుకు ముదురు లేత వుండవు' అన్న చందాన నాలుగు పదుల వయస్సు దాటకనే కోదండ రామయ్య చనిపోతాడు. చనిపోయిన ఏడాదికి తండ్రికి పిండ ప్రదానం చేయడానికి కోటి వీరయ్య కపిలతీర్థం వస్తాడు. తనతో పాటు పప్పు బియ్యం పూజాసామగ్రి తో పాటు ఒక గంపను, పిల్లిని కూడా తీసుకు వస్తాడు. గంప మరియు పిల్లిని ఎందుకు తెచ్చినావని ప్రశ్నిస్తాడు పురోహితుడు. ''స్వామీ ,మీకు తెలియనిదేముంది ? గత సంవత్సరం మా నాన్న గారు పిండ ప్రదానం చేసేటప్పుడు పిల్లిని పట్టి గంప కింద పెట్టి తర్పణం వదిలాడు .అలా పిండ ప్రదాన సమయంలో పిల్లిని పట్టి గంప కింద దాచి పెట్టి తర్పణం వదలడం మన సంప్రదాయం కదా. సమయానికి ఇక్కడ పిల్లి గంపలు దొరుకుతాయో లేదోనని ఇంటి వద్దనుంచే వాటిని పట్టుకొచ్చినాను స్వామీ'' అని వినమ్రంగా బదులిచ్చాడు.

కోటి వీరయ్య చేస్తున్న నిర్వాకానికి పురోహితుడికి నవ్వాలో ఏడవాలో తెలియక ''బాబూ , మన ఆచారాలు వాడుకలు సంప్రదాయాలన్నీ శాస్త్రీయ దృక్పథంతో సున్నితమైన అంశాలతో మానవ సంబంధాల నేపథ్యంతో ముడి పడి వున్నవే. దేనినీ తప్పు పట్టలేము.కాదనలేము. అయితే మీ నాన్న పాయసాన్ని పిల్లి తాగి పోతుందేమోననే భయంతో పిల్లిని పట్టి గంప కింద దాచమన్నాడు. అంతే తప్పితే పిండ ప్రదానం సమయంలో పిల్లిని దాచి పెట్టడం మన సంప్రదాయం కాదు. సంప్రదాయాల లోతు తెలుసుకొంటే ఇలాంటి తప్పిదాలు జరగవు'' అని సున్నితంగా మందలించినాడు. తప్పు తెలుసుకొన్న

కోటి వీరయ్య వెంటనే పిల్లిని కొండల పక్కన వదిలేసి గంపని అక్కడే పారేసినాడు. భక్తి ప్రపత్తులతో కపిలేశ్వరుని సన్నిధిలో తండ్రికి,తాతకి తిల తర్పణం వదిలాడు.

ఆర్ సి కృష్ణ స్వామి రాజు
తిరుపతి 9393662821



# రావణ వధ




భారీ కాయుని రాముడు
బ్రహ్మాస్త్రము తోడ
కూల్చె!
అదిగాంచిన కపి సేనకు
ఆనందమ్మే హెచ్చె!
క్రుద్ధుడైన రావణుడే
యుద్ధరంగమునకు వచ్చె!
రామ రావణుల పోరును
రాగమ్మున గాంచగాను
గంధర్వులు, దేవతలూ
గగన భాగమున నిలిచిరి!
రావణ నాగాస్త్రమునకు
రాముడు గరుడా స్త్రమును
అతడి ఆగ్నేయాస్త్ర ముకు
ఇతడు వారుణాస్త్ర మును
ప్రయోగించగా ఇరువురి
పరాక్రమము తిలకించిరి!
దశకంఠుని తలలన్నీ
దాశరథియె నేలకూల్చ
తిరిగి ఉద్భవించసాగె
తీవ్రంగా పోరుసాగె
అగ్రజుని కుక్షిలోన
అమృత భాండమున్నదనుచు
అనుజుడైన విభీషణుడు
అసలు కిటుకు తెలియపరిచె!
ధర్మ వీరుడగు రాముడు
దానిని గ్రహియించినమా
గుండె కేను బ్రహ్మాస్త్ర ము
గురి పెట్టుచు వేసినమా
వాయు దేవుడేను గాలి
వాటముతో కుక్షి చేర్చె!
అమృత కలశమే పగులగ
ఆ రావణు నేలగూల్చె!
పరస్త్రీల చెరబట్టిన
ప్రతివానికి పతనమ్మే
తప్పదనుచు పలుకగాను
మెప్పగ దివి
పూలు కురిసె!



డా॥ వడ్డేపల్లి కృష్ణ
సెల్ :9246541699






# పక పక

### కళ్లు మూసుకుని



**టీచర్:** ఏరా రవి ఏంట్రా కళ్లు మూసుకుని పరీక్ష రాస్తున్నావు ఏంటి సంగతి.. !
**రవి:** ఏం లేదు టీచర్. పరీక్షల్లో చూసి రాయకూడదని మా అమ్మ చెప్పింది. అందుకే కళ్లు మూసుకు రాస్తున్నా
**టీచర్:** అవునా?

### మరోటి ఉంది



**తల్లి:** ఇవ్వాళ బడిలో ఏం నేర్చుకున్నావ్?
**కొడుకు:** రాయడంనేర్పించారు.
**తల్లి:** రాసింది చదువు
కొడుకు: ఏమో! ఇంకా చదవడం నేర్పలేదు


పవన్‌కళ్యాణ్

# రీ ఎంట్రీ ఎప్పుడు?

పవన్‌కళ్యాణ్ సినీరంగంలోకి ప్రవేశించి....చూస్తుండగానే 23 ఏళ్లు గడిచిపోయాయి. ఆయన హీరోగా పరిచయమైన అక్కడ అమ్మాయి...ఇక్కడ అబ్బాయి చిత్రం శుక్రవారం నాటికి సరిగ్గా 23 ఏళ్లు పూర్తిచేసుకుంది. ఇన్నేళ్లలో ఆయన చేసింది 25 సినిమాలే అయినప్పటికీ...ఆయనకు ప్రేక్షకాభిమానుల్లో ఉండే క్రేజ్ అంతాఇంతా కాదు. తమ్ముడు, బద్రి, ఖుషి, గబ్బర్‌సింగ్, అత్తారింటికి దారేది వంటి సినిమాలు ఆయనకెంతో పేరు తెచ్చిపెట్టిన విషయం వేరుగా చెపప్పనక్కరలేదు. కెరీర్ పరంగా మంచి పొజిషన్‌లో ఉన్నప్పుడే ఆయన రాజకీయరంగంలోకి అరంగేట్రం చేశారు. ఇక అప్పట్నుంచి రాజకీయాలలో ఊపిరి సలపకుండా ఉన్న ఆయన ఇకపై సినిమాలు చేయకపోవచ్చునని ఆ మధ్య వినిపించింది. అయితే తాజాగా హల్‌చల్ చేస్తున్న వార్తల ప్రకారం ఒక మంచి ప్రాజెక్టును ఎంచుకుని ఆయన నటించే అవకాశాలున్నాయన్న మాటలు వినిపిస్తున్నాయి. చిరంజీవి, పవన్‌కళ్యాణ్ ప్రధాన పాత్రలలో త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నట్లు లోగడ టి.సుబ్బరామిరెడ్డి ప్రకటించారు కూడా. అయితే ఆ ప్రాజెక్టు ఉంటుందా? ఉండదా? అన్న అంశంపై స్పష్టత రాలేదు. మరోవైపు మైత్రీ మూవీమేకర్స్ బేనర్‌లో ఓ చిత్రం చేసేందుకు కూడా గతంలో పవన్‌కళ్యాణ్ అంగీకరించారు. అయితే ప్రాజెక్టుపై కూడా ఎలాంటి సమాచారం లేదు. ఇదిలావుండగా...ఇటీవలసైరా చిత్రం ప్రమోషన్‌లో పాల్గొన్న చిరంజీవి తన సోదరుడు పవన్‌కళ్యాణ్ నటించడానికి సుముఖమైతే తమ కొణితల ప్రొడక్షన్స్ బేనర్‌లో రామ్‌చరణ్ తీసేందుకు సిద్ధంగా ఉన్నాడని చెప్పుకొచ్చారు. దాంతో కొంతకాలంగా స్తబ్దతగా ఉన్న పవన్ రీఎంట్రీకి ఇప్పుడు మళ్లీ రెక్కలు వచ్చినట్లయింది. దీనిపై పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాల్సిందే. ఏదిఏమైనా పవన్ ఓకే అనాలే కానీ...ఎందరో దర్శక, నిర్మాతలు సంసిద్ధంగా ఉన్నారు.

# దర్బార్ తర్వాత

సూపర్‌స్టార్ రజనీకాంత్ తన తదుపరి చిత్రాన్ని ప్రకటించారు. ప్రస్తుతం ఆయన 'దర్బార్' సినిమాలో నటిస్తున్నారు. ఈ చిత్ర నిర్మాణం చివరిదశలో ఉండగానే తన తదుపరి చిత్రాన్ని శివ దర్శకత్వంలో చేయబోతున్నట్టు తెలిపారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తుందని ఆయన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

దర్శకుడు శివ తెలుగులో కెరీర్ మొదలు పెట్టారు. 'శౌర్యం', 'దరువు' చిత్రాలకు దర్శకత్వం వహించారు. అనంతరం తమిళ్‌లో అజిత్‌తో వరుసగా 'వీరం', 'వేదాళం', 'వివేకం', 'విశ్వాసం' చిత్రాలు చేశారు. ఇవన్నీ కమర్షియల్‌గా విజయం పొందడంతో ఆయనకు ఇప్పుడు రజనికాంత్‌తో సినిమా చేసే అవకాశం వచ్చింది. ఇప్పటికే రజనీకి కథ చెప్పినట్టు తెలిసింది. డిసెంబర్‌లో రజనీ పుట్టినరోజు సందర్భంగా షూటింగ్ ప్రారంభించే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది వేసవిలో


రజనీకాంత్

విడుదల చేస్తారు.

రజనీకాంత్‌కు వయసుమీద పడుతున్నా సరే వేగంగా సినిమాలు చేస్తున్నారు. ఏడాది కాలంలో 'కాలా', '2.ఓ', 'పేట' చిత్రాల్లో నటించారు. తాజాగా 'దర్బార్' పూర్తిచేశారు. ఒక సూపర్‌స్టార్ ఇంత త్వరగా సినిమాలు పూర్తిచేయడం విశేషంగా సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.


తమన్నా

# ముందే చెప్పేస్తా...

నియమాలు పెట్టుకోవడం సులువే. పాటించడం కష్టం. కానీ ఒక్కసారి తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండేవాళ్లు అనూహ్య విజయాలు చూస్తారు. అడ్డు లేకుండా ముందుకు సాగుతుంటారు. ఒక వ్యక్తిత్వాన్ని అలవర్చుకుని మిగతా వాళ్లకు ఆదర్శంగా నిలుస్తారు. ప్రలోభాలు నిత్యమయ్యే చిత్ర పరిశ్రమలో ఇలా ఒక నియమాన్ని పెట్టుకుని నిలబడటం అసాధ్యం. కానీ అనుకుంటే అసాధ్యమే లేదని చూపించింది మిల్కీ బ్యూటీ తమన్నా. తెరపై ముద్దు సన్నివేశాల్లో నటించకూడదు అనేది ఆమె చిత్ర పరిశ్రమకు వచ్చినప్పటి నుంచీ తీసుకున్న నిర్ణయం ఇప్పటికీ ఆ మాటను దాటలేను తమన్నా. కెమెరా ముందు ముద్దు పెట్టను అని నిర్ణయించుకుంది. పదమూడేళ్లకే నటిగా మారిన తమన్నా....ఆ తర్వాత తెలుగు, తమిళంలో ఒక్కో విజయాన్ని అందుకుంటూ అగ్రతారగా ఎదిగింది. హిందీలోనూ నటించి మెప్పించింది. ఈ క్రమంలో ఎంత పెద్ద స్టార్ హీరోతో నటించినా, ఎంత ప్రతిష్టాత్మక సినిమాలో భాగమైనా, ముద్దుకు దూరంగానే ఉంటూ వచ్చింది. అందుకే సకుటుంబ తారగా పేరు తెచ్చుకుంది. కథ కోరుకుంటే దేనికైనా సిద్ధమని చెప్పుకునే మూస నాయికల తీరుకు తాను భిన్నమని నిరూపించుకుంది తమన్నా. అందాల ప్రదర్శనలోనూ హద్దుల్లోనే ఉంటోంది. నట ప్రయాణంలో పల్లాలు ఎదురైనా, అనుకున్న పద్ధతినే పాటిస్తోంది. ముద్దు విషయంలో తమన్నా స్పందిస్తూ..నా అరంగేట్రం నుంచీ కెమెరా ముందు ముద్దు పెట్టను అని నియమం పెట్టుకున్నా, ముద్దు సన్నివేశాల్లో నటించను అనేది నా ప్రతి సినిమా ఒప్పందంలోనూ తెలియజేస్తా. ముద్దులు పెట్టను అని ముందే చెప్పేస్తా. అని చెప్పుకుంది. ప్రస్తుతం తమన్నా తమిళంలో పెట్రోమాక్స్, యాక్షన్, హిందీలో భోలే చూడియాన్, తెలుగులో సరిలేరు నీకెవ్వరూ చిత్రంలో ప్రత్యేక గీతంలో కనిపించనుంది.

# రన్వీర్ సరసన షాలినీ...

అర్జున్ రెడ్డి తార షాలినీ పాండే బాలీవుడ్‌లో అడుగుపెడుతోంది. అరంగేట్రమే రన్వీర్ సింగ్ లాంటి స్టార్ హీరో సరసన నటించబోతోంది. అర్జున్ రెడ్డి సినిమా రీమేక్ కబీర్ సింగ్ హిందీలో సంచలన విజయం సాధించింది. దీంతో...మాతృక సినిమా ఎలా ఉంటుందో చూడాలని ఆసక్తి అందరిలో కలిగింది. అలా షాలినీ పాండే నటన గురించి విస్తృతంగా తెలిసింది. ఈ సినిమా చూసిన వాళ్లు ఆమె నటన గురించి ప్రశంసిస్తూ చెప్పుకున్నారు. రన్వీర్ సింగ్ సినిమాలో కొత్త నాయిక కావాలని నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిలింస్ వెతుకుతోంది. ఈ క్రమంలో షాలినీ గురించి వాళ్లకు తెలిసి, సంప్రదించారట. ఎంతోమంది కొత్త నటీనటులను యష్ రాజ్ ఫిలింస్ సంస్థ తెరకు పరిచయం చేసి, వాళ్లను స్టార్‌లను చేసింది. షాలినీకి కూడా అలాంటి గొప్ప అవకాశమే దక్కుతోంది. బ్యాండ్ బాజా బారాత్ చిత్రంతో యష్ రాజ్ సంస్థతో అరంగేట్రం చేసిన రన్వీర్....గూండే, బేఫికర్ లాంటి చిత్రాల్లో ఇదే సంస్థలో నటించారు. స్టార్ అయ్యారు. ఇప్పుడు జయేష్ భాయ్ జోర్దార్ పేరుతో కొత్త చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో రన్వీర్ గుజరాతీ వ్యాపారి జయేష్ భాయ్ పాత్రలో నటిస్తుండగా...షాలినీ స్థానిక అమ్మాయిగా హీరోకు జోడీగా కనిపించబోతోంది. దివ్యాంక ఠక్కర్ దర్శకత్వంలో జయేష్ భాయ్ జోర్దార్ సినిమా తెరకెక్కనుంది. షాలినీ నాయికగా ఎంపికైన విషయాన్ని చిత్ర యూనిట్ సభ్యులొకరు తెలియజేస్తూ...రన్వీర్ సరసన కొత్త నాయికను తీసుకోవాలనుకున్నాం. అర్జున్ రెడ్డి సినిమాలో షాలినీ నటన మాకు నచ్చింది. స్క్రీన్ టెస్ట్ చేసినప్పుడు షాలినీ మెప్పించింది. గుజరాతీ అమ్మాయి పాత్ర కోసం షాలినీని ఎంపికచేశాం. అని చెప్పారు. తెలుగులో అవకాశాలు విజయాలు తగ్గిన నేపథ్యంలో షాలినీకి ఇది గొప్ప అవకాశమే కానుంది.




జాన్వికపూర్

# శ్రీదేవి కల సాకారమవుతోంది!

తన కుమార్తె జాన్వికపూర్ హీరోయిన్‌గా వెలుగొందాలని...ఆమె కథానాయికగా తమ సొంత నిర్మాణ సంస్థలో ఓ చిత్రం చేయాలని శ్రీదేవి కన్న కల ఇప్పుడు సాకారమవుతోంది. బాలీవుడ్‌లో రూపొందిన దఢక్ చిత్రం ద్వారా పరిచయమైన జాన్వికి ఆ తొలి సినిమానే అద్భుతమైన విజయాన్ని అందించింది. దాంతో ఆమెకు అవకాశాలపై అవకాశాలొస్తున్నాయి. ఇప్పటికే ఆమె నటించిన బయోపిక్ చిత్రం గుంజన్ సక్సేనా, రూహిఆఫ్జా చిత్రాలు నిర్మాణానంతర పనుల్లో ఉన్నాయి. వచ్చే ఏడాదిలో ఆ రెండు సినిమాలు విడుదల కానున్నాయి. ఇటీవలి వరకు వాటిల్లో నటిస్తూ బిజీగా ఉన్న ఆమె తాజాగా గోస్ట్ స్టోరీస్ అనే నాలుగు లఘు చిత్రాల సిరీస్ చేస్తోంది. వీటి తర్వాత కూడా ఆమె నటించబోయే చిత్రంపైనా కూడా స్పష్టత వచ్చేసింది. తమ సొంత బేనర్‌లో తన తండ్రి బోనీకపూర్ నిర్మించనున్న బాంబే గర్ల్ చిత్రంలో జాన్వి నటించనుంది. వాస్తవానికి జాన్వితో ఓ సినిమా, అలాగే తమిళ కథానాయకుడు అజిత్‌తో ఓ సినిమా తమ సంస్థలో తీయాలన్నది శ్రీదేవి కోరికట. ఇప్పటికే అజిత్‌తో నేర్కొండ పార్వాయ్ చిత్రం ఆగస్టులో ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. దీంతో శ్రీదేవి కలగన్న రెండు కోరికలలో ఒకటి తీరిపోగా....తాజాగా జాన్వి కథానాయికగా బోనీకపూర్ నిర్మించే చిత్రం ద్వారా శ్రీదవి రెండో కోరిక కూడా నెరువేరుతున్నట్లు అవుతోంది దీనికి సంజయ్ త్రిపాఠి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పుడు శ్రీదేవి ఉంటే మత్రికోత్సాహంతో ఎంత సంతోషించేవారోనని అనుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బోనీకపూర్ స్పందిస్తూ తన సతీమణి కోరికను నెరవేర్చబోతున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. శ్రీదేవి ఎక్కడున్నా తన కుమార్తె విజయాన్ని చూసుకుని ఆనందిస్తుంది...ఆశీస్సులు అందిస్తుంది అని అన్నారు. ప్రస్తుతం బాంబే గర్ల్ చిత్రం పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

# మరోసారి పోలీస్ అధికారిగా...

పోలీస్ పాత్రలకు సల్మాన్ పెట్టింది పేరు. ఆయన నటించిన రక్షకభట చిత్రాలెన్నో మంచి విజయాలు సాధించాయి. పోకిరీ రీమేక్ వాంటెడ్ సహా, దబాంగ్ సిరీస్‌లో వచ్చిన సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇటీవలే దబాంగ్ 3 చిత్రీకరణ పూర్తి చేసిన సల్మాన్..మరోసారి పోలీస్ అధికారిగా కనిపించబోతున్నారు. ఈ చిత్రాన్ని కూడా దబాంగ్ 3 దర్శకుడు ప్రభుదేవా రూపొందించనున్నట్లు సమాచారం. ఈ కొత్త సినిమాకు ఇండియాస్ మోస్ట్ వాంటెడ్ కాప్, రాధేగా టైటిల్ నిర్ణయించారు. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ అని వింటుంటాం...కానీ మోస్ట్ వాంటెడ్ కాప్ అనేది కొత్త తరహా కథా కథనాలు చూపించబోతున్నట్లు తెలుపుతోంది. రెండేళ్ల కిందట కొరియన్ భాషలో వచ్చిన ఔట్‌లాస్ అనే చిత్రానికి ఇండియాస్ మోస్ట్ వాంటెడ్ కాప్ పునర్నిర్మాణ చిత్రంగా చెబుతున్నారు. నవంబర్ 4 నుంచి సల్మాన్ కొత్త సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది. అయితే ఇదే పేరుతో మరో నటుడు సోహైల్ ఖాన్ టైటిల్ నమోదు చేసుకున్నారు. సల్మాన్ సినిమా కాబట్టి అతను తన టైటిల్ వదులుకునే అవకాశాలే ఉన్నాయి. ఈద్ పండక్కి తన సినిమాలు విడుదల చేసే సల్మాన్....ఈ సినిమాను వచ్చే ఏడాది ఈద్‌కు తెరపైకి తీసుకురానున్నాడు. తాజాగా దబాంగ్ 3 చిత్రీకరణ పూర్తి చేసిన సల్మాన్. బిగ్ బాస్ 13కు వ్యాఖ్యాతగానూ వ్యవహరిస్తున్నాడు.


సల్మాన్ ఖాన్

# వినోదాల ఇఎమ్ఐ

భానుశ్రీ, నోయల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఇఎమ్ఐ'. ఈ అమ్మాయి అనే అర్థం వచ్చే ఈ చిత్రం ఫస్ట్‌లుక్ మరియు పోస్టర్‌ను ఇటీవల విడుదల చేశారు. దొంతు బుచ్చయ్య, సంగీత బమ్మిడి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి దొంతు రమేష్ దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్ భానుశ్రీ మాట్లాడుతూ "చాలా కష్టపడి చేసిన సినిమా ఇది. పాటలు మినహా పూర్తయింది. కథ నచ్చడంతో ఇందులో నటిస్తున్నా. ఇది హీరోయిన్ ఓరియంటెడ్ సినిమా. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికీ ఇఎమ్ఐలు ఉంటాయి. వాటి వలన మహిళలు ఎలా ఇబ్బంది పడుతున్నారు అని తెలిపేదే ఈ చిత్రం" అని చెప్పారు. చిత్ర దర్శకుడు రమేష్ మాట్లాడుతూ "నిర్మాతల సహకారం వల్ల టాకీపార్ట్ పూర్తిచేశాం. సినిమా బాగా వచ్చింది. చూసిన ప్రతి ఒక్కరికి నచ్చుతుంది" అని అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "మా అబ్బాయిని దర్శకునిగా పరిచయం చేస్తున్నాం. మంచి కథ చాలా కొత్తగా ఉంటుంది. అందరికీ నచ్చుతుంది. ఇఎమ్ఐల గురించి తెలియనివారుండరు. దీనికి వినోదం జోడించి తీస్తున్నాం" అని చెప్పారు. ఈ చిత్రానికి మాటలు: ఘటికాచలం, ఛాయాగ్రహణం: ఎమ్. మోహన్ చంద్, సంగీతం: ఎస్. రవికుమార్.


భానుశ్రీ

Vaccum Therapy లింగవర్థక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?
అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076